


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 119 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ బుధవారం 11 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 119 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD WED 11 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

# నేనేమైనా టెర్రరిస్టునా?

## నిరవధిక దీక్షకు దిగితే అరెస్ట్ చేస్తరా

- రాహుల్ గాంధీ వెలుగుమట్లలో
- ఏం జరిగిందో తెలుసుకోండి
- కూలగొట్టిన చోటే వాళ్లకు ఇండ్లు కట్టించి ఇవ్వాలి
- అవసరం అయితే కోర్టులో పిల్ వేస్తం
- మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితుల పక్షాన నిలబడి ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించారు. నిరాహార దీక్షకు దిగిన తనను పోలీసులు అర్ధరాత్రి అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పేదల కోసం గళమెత్తిన తనను ఒక ఉగ్రవాదిలా భావించి అరెస్ట్ చేశారని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల పట్ల కనికరం లేకుండా వ్యవహరిస్తోందని ఆమె మండిపడ్డారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన కవిత, వెలుగుమట్లలో పేదలు కష్టపడి కట్టుకున్న ఇళ్లను అధికారులు కర్కశంగా కూల్చివేసిన తీరును తప్పుబట్టారు. భూదాన్ భూములు అంటేనే పేదలకు ఇచ్చేవి అని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ భూములను పెద్దలకు కట్టబెట్టేందుకే ఇలాంటి దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. కూల్చివేసిన చోటే మళ్లీ ఇళ్లను నిర్మించి బాధితులకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ, ఖమ్మంలో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న తీరును గమనించాలని కవిత సూచించారు. ఈ అన్యాయంపై ఆయనకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. బాధితుల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఉన్నారని,

పరీక్షల సమయంలో వారిని రోడ్డున పడేయడం కలెక్టర్, జిల్లా మంత్రులకు కనిపించడం లేదా? అని ఆమె నిలదీశారు. ఈ పోరాటం ఇంతటితో ఆగదని, అవసరమైతే కోర్టులో పిల్ వేసి న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.



## నీళ్లివ్వమని అడిగిన రైతులను జైల్లో పెట్టడం ఏమిటి?

- రంగనాయక్ సాగర్ పనులను వెంటనే పూర్తి చేయాలని బండి సంజయ్ డిమాండ్
- పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని విమర్శ
- పనులు పూర్తయి ఉంటే 9,500 ఎకరాలకు సాగునీరు అందేదని వ్యాఖ్య

**హైదరాబాద్ పెన్ పవర్:**రాజన్న సిరిసిల్ల జిల్లాలో సాగునీటి కాలువ పనుల కోసం ఆందోళన బాట పట్టిన రైతులను పోలీసులు అరెస్టు చేయడంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రంగా మండిపడ్డారు. తమ పొలాలకు నీళ్లివ్వమని

మిగతా 2లో

## తెలంగాణలో 'ఆపరేషన్ క్రాక్‌డౌన్'... 208 మంది అరెస్ట్!



- తెలంగాణలో 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0' పేరుతో పోలీసుల మెరుపు దాడులు
- రాష్ట్రవ్యాప్తంగా 208 మందిని అరెస్ట్ చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో
- నిందితుల్లో ఇద్దరు బ్యాంకు ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, విద్యార్థులు
- సుమారు రూ.100 కోట్ల విలువైన మోసాలకు మ్యూల్ ఖాతాలు వాడినట్లు గుర్తింపు
- కమీషన్ కోసం తమ ఖాతాలను సైబర్ మోసగాళ్లకు అప్పగించినట్లు వెల్లడి

మిగతా 2లో

## తెలంగాణ కొత్త గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు సీఎం వెల్ కమ్



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ కొత్త గవర్నర్ గా నియమితులైన శివ ప్రతాప్ శుక్లాకు శంషాబాద్ ఎయిర్ పోర్టులో సీఎం రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. గవర్నర్ కు స్వాగతం పలికిన వారిలో సీఎం రేవంత్ తో పాటు మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్ కె. రామకృష్ణా రావు, డీజీపీ శివధర్ రెడ్డి ఉన్నారు. ఉత్తరప్రదేశ్ కు చెందిన శుక్లా 2014 ఎన్డీఏ కేబినెట్ లో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు.రాష్ట్ర గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా మార్చి 11న ప్రమాణస్వీకారం చేయనున్నారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ చేతుల మీదుగా కొత్త గవర్నర్ ప్రమాణం చేయనున్నారు. ఇందుకు లోక్?భవన్‌లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మన్, మంత్రులు, ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు. మరోవైపు, బదిలీపై మహారాష్ట్రకు వెళ్తున్న జిష్ణుదేవ్ వర్మ సోమవారం రిలీవ్? అయ్యారు. బేగంపేట ఎయిర్ పోర్టులో గవర్నర్? దంపతులకు సీఎస్ రామకృష్ణారావు, ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన వీడ్కోలు పలికారు.




## ఇండిగో వరుస వైఫల్యాలు.. కంపెనీ సీఈవో రాజీనామా

**హైదరాబాద్ పెన్ పవర్:**వరుస వైఫల్యాలతో విమానయాన రంగాన్ని ఓ కుదుపు కుదుపేసిన ఇండిగో సంస్థలో కీలక పరిణామం జరిగింది. తమ కంపెనీ సీఈవో పీటర్ ఎల్బర్స్ రాజీనామా చేసినట్లు యాజమాన్యం ప్రకటించింది. ఆయన రాజీనామా మంగళవారం (మార్చి 10) నుంచి అమలులోకి వస్తుందని వెల్లడించింది. సంస్థ నుంచి ఎల్బర్స్ తప్పుకోవడంతో.. ఆయన స్థానంలో రాహుల్ భాటియా బాధ్యతలు తీసుకోనున్నారు. మధ్యంతర సీఈవోగా భాటియాకు బాధ్యతలు అప్పగించినట్లు మేనేజ్మెంట్ ప్రకటించింది. తదుపరి ఏర్పాట్లు పూర్తయ్యేలోపు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ గా కొనసాగుతారని యాజమాన్యం తెలిపింది.

**ఏంటి ఇండిగో సంక్షోభం:**

నవంబర్ 1, 2025 నుంచి పూర్తిస్థాయిలో అమలులోకి వచ్చిన ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ నిబంధనల రెండో దశ ఈ సంక్షోభానికి ప్రధాన మూలకారణం.

మిగతా 2లో



## వంటగ్యాస్ ఆందోళన... ప్రధాని మోదీ కీలక సమీక్ష

- 10 శాతం మేర ఉత్పత్తి పెంచాలని ఇంధన ఉత్పత్తి కంపెనీలకు ఆదేశాలు
- భారత రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయన్న కేంద్రం
- దేశానికి 70 శాతం ఉత్పత్తులు ఇతర మార్గాల్లో వస్తున్నాయన్న కేంద్రం

**హైదరాబాద్ పెన్ పవర్:** వంటగ్యాస్‌పై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వంటగ్యాస్‌ను బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో 10 శాతం మేర ఉత్పత్తిని పెంచాలని ఇంధన

మిగతా 2లో

# ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాస...

## చొక్కాలు పట్టుకున్న కౌన్సిలర్లు



- కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం, బాహాబాహీ
- నీటి సమస్యపై చర్చించాలని బీజేపీ డిమాండ్
- కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య తోపులాట
- చైర్‌పర్సన్ కార్యాలయం ఎదుట బైఠాయించిన బీజేపీ

మిగతా 2లో

# ఆర్థిక సంక్షోభంలో పాకిస్థాన్

## మంత్రులకు కూడా జీతాలు కట్.. ప్రధాని షరీఫ్ సంచలన నిర్ణయాలు



- పశ్చిమాసియా యుద్ధంతో పాక్ అతలాకుతలం
- అత్యంత కఠినమైన పొదుపు చర్యలను ప్రకటించిన షెహబాజ్ షరీఫ్
- వారానికి నాలుగు రోజులే పని చేయనున్న ప్రభుత్వ కార్యాలయాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు, అంతర్జాతీయ మార్కె ట్‌లో ఆయిల్ ధరల పెరుగుదల పాకిస్థాన్‌ను

మిగతా 2లో



## కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తుంది

**హైదరాబాద్ పెన్ పవర్:**మంచిర్యాల జిల్లా మందమర్రి మార్కెట్ లోని పెద్ద మసీదులో రంజాన్ తోఫా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామి ముస్లిం సోదరులతో కలసి మసీదు లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 112 మంది పేద ముస్లింలకు రంజాన్ తోఫా అందించి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు మంత్రి వివేక్. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని అన్నారు మంత్రి వివేక్.చెన్నూరు,మందమర్రి లో కోటి రూపాయ లతో షాదిఖానా లు, ఖబరస్తాన్ లను నిర్మిస్తున్నా మని..మందమర్రి లో ఖబరస్తాన్ ప్రహరీ నిర్మాణానికి 15 లక్షలు మంజూరు చేశామని అన్నారు. ాుజ సెంటర్లో కొత్త కోర్సులను ప్రవేశపెట్టి విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని..చెన్నూరు

మిగతా 2లో

# ప్రభుత్వానికి తలవంచని ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ

## లోక్‌సభలో ప్రియాంక గాంధీ

- లోక్‌సభలో సోదరుడిని గట్టిగా సమర్థించిన ప్రియాంక గాంధీ
- నెహ్రూను విమర్శించే బీజేపీ నేతలే ఇప్పుడు ఆయన్ను ఉటంకిస్తున్నారని చురక
- స్పీకర్ ఓం బిర్లా తొలగింపు తీర్మానంపై చర్చ సందర్భంగా ఈ వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తన సోదరుడు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని గట్టిగా సమర్థించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి తలవంచకుండా నిలబడిన ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ అని ఆమె కొనియాడారు. మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను తొలగించాలంటూ ప్రవేశపెట్టిన తీర్మానంపై జరిగిన చర్చలో ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. సభకు అధ్యక్షత వహిస్తున్న ప్యానెల్ స్పీకర్ కృష్ణ ప్రసాద్ తెన్నేటి అనుమతితో ప్రియాంక మాట్లాడారు. ఈ సందర్భంగా అధికార పక్షంపై ఆమె చురకలు అంటించారు. "ప్రతిరోజూ నెహ్రూజీని విమర్శించే వారే, ఈ రోజు ఆయనను ఉటంకించడం చూసి నాకు నవ్వొచ్చింది. ఒక్కసారిగా వారికి నెహ్రూజీపై గౌరవం పుట్టుకొ చ్చింది. ప్రజాస్వామ్యాన్ని అత్యంత

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# బడ్జెట్‌లో ఈసారైనా బీసీలకు న్యాయం చేయండి!

తెలంగాణ రాష్ట్ర 2026-27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సమీపిస్తున్న వేళ, బీసీలకు న్యాయం అనే అంశం మళ్లీ ప్రధాన చర్చగా మారింది. 2024లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కులగణన ప్రకారం రాష్ట్ర జనాభాలో బీసీలు 56.33 శాతం ఉన్నారు.. ఈ వాస్తవం రాష్ట్ర సామాజిక నిర్మాణాన్ని స్పష్టంగా చూపుతున్నప్పటికీ, ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపుల్లో అదే నిష్పత్తి కనిపించకపోవడం బీసీలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. జనాభాలో సగానికి పైగా ఉన్న వర్గానికి అభివృద్ధి నిధులు సమానంగా అందకపోతే, అది కేవలం ఆర్థిక లోపం కాదు.. సామాజిక అసమానతకు నాంది. వ్యవసాయం, చిన్న పరిశ్రమలు, కార్మిక రంగాలు, వాణిజ్య కార్యకలాపాలు ఈ రంగాలన్నింటికీ బీసీలు వెన్నెముకలా నిలుస్తున్నారు. అలాంటి వర్గం విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారతలో వెనుకబడితే, రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యం కాదు.. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వారా ఏటా రూ.20,000 కోట్లు కేటాయిస్తామని, ఐదేళ్లలో లక్ష కోట్లు వెచ్చిస్తామని, బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత ఇస్తామని, 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీలు ఇచ్చింది. ఇవి బీసీలలో భారీ ఆశలను రేకెత్తించాయి. అయితే అధికారంలోకి వచ్చి గత రెండేళ్లలో బీసీలకు బడ్జెట్ కేటాయింపులు, నిధుల విడుదల గణాంకాలు బీసీల ఆశలకు సరితూగలేదని బీసీ సంఘాలు వాదిస్తున్నాయి. హామీలతో పోలిస్తే కేటాయింపులు తక్కువగా ఉండటం, నిధుల విడుదల మరింత తగ్గిపోవడం విశ్వాస సంక్షోభానికి దారితీస్తోంది.ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌లు జనాభా ప్రాతిపదికన అమలవుతున్నాయి. అదే విధంగా బీసీ సబ్‌ప్లాన్‌ను చట్టబద్ధం చేసి, జనాభా దామాషా ప్రకారం కేటాయింపులు చేయాలన్న డిమాండ్ అన్యాయమైనది కాదు. 56 శాతం జనాభాకు తగిన నిధులు ఇవ్వడం సామాజిక సమతుల్యానికి అవసరం. ఇది ఓట్ల రాజకీయమో, పార్టీ ప్రయోజనమో కాదు.. రాజ్యాంగబద్ధ బాధ్యత. బీసీ సబ్‌ప్లాన్ సరైన రీతిలో అమలైతే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, విదేశీ విద్యా అవకాశాలు, స్వయం ఉపాధి పథకాలు, బీసీ బజార్లు, హాస్టళ్లు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు బలోపేతం అవుతాయి. కానీ తగిన నిధులు లేకపోతే పథకాలు కాగితాలపైనే మిగిలిపోతాయి.. నిధుల కేటాయింపు మాత్రమే కాదు, వాటి సకాల విడుదల, పారదర్శక వినియోగం కూడా సమానంగా ముఖ్యమే. ఈసారి 2026-27 బడ్జెట్‌ను ప్రభుత్వం 'డెలివరీ బడ్జెట్'గా నిలబెట్టుకోవాలంటే, బీసీ హామీలను అమలు చేయడంలో స్పష్టమైన సంకల్పం చూపాలి. కనీసం రూ.25,000 కోట్లు లేదా జనాభా దామాషా ప్రకారం మరింత ఎక్కువ నిధులను కేటాయించాలి. బీసీ కార్పొ రేషన్లు, సహకార బ్యాంకులు బలోపేతం చేయాలి. పథకాల అమలు పర్యవేక్షణకు ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేయాలి. బీసీలు రాష్ట్ర అభివృద్ధికి మూలస్తంభాలు.. వారిని నిర్లక్ష్యం చేస్తే అభివృద్ధి అసమానంగా మారుతుంది. ఈ బడ్జెట్ కేవలం లెక్కల పుస్తకం కాకుండా, న్యాయానికి ప్రతిబింబంగా ఉండాలి. తెలంగాణ అభివృద్ధి అంటే అన్ని వర్గాల సమగ్రాభివృద్ధి. ఆ సూత్రాన్ని ఆచరణలో చూపించాల్సిన సమయం ఇదే. 2026-27 బడ్జెట్ బీసీలకు న్యాయం చేసి, రాష్ట్ర సామాజిక సమరసతకు బలమైన పునాది వేయాలి. అదే నిజమైన ప్రజాపాలనకు పరీక్ష.

# తెలంగాణలో 'ఆపరేషన్ క్రాక్‌డౌన్'... 208 మంది అరెస్ట్!

తెలంగాణలో సైబర్ మోసగాళ్లకు సహకరిస్తున్న వారిపై రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఉక్కుపాదం మోపింది. 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0' పేరుతో ఫిబ్రవరి 25న ప్రారంభించిన ఈ రాష్ట్రవ్యాప్త ఆపరేషన్‌లో భాగంగా 208 మందిని అరెస్ట్ చేసినట్లు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ మంగళవారం తెలిపారు. నిందితుల్లో ఇద్దరు బ్యాంకు ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఏడుగురు విద్యార్థులు, 15 మంది మహిళలు, ఇద్దరు లెక్చరర్లు, విద్యుత్ శాఖ ఉద్యోగి కూడా ఉండటం గమనార్హం.దేశవ్యాప్తంగా జరుగుతున్న సైబర్ మోసాలకు సంబంధించిన నగదు బదిలీలకు ఉపయోగించే 'మ్యూల్ ఖాతాల'పై ఈ ఆపరేషన్ కేంద్రీకరించింది. నిందితులు 5 శాతం వరకు కమీషన్ తీసుకుని తమ బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లకు అప్పగించినట్లు దర్యాప్తులో తేలింది. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ డేటాను విశ్లేషించిన టీజీసీఎస్‌బీ, తెలంగాణలో తెరిచిన అనుమానాస్పద ఖాతాలను

గుర్తించింది.ఈ ఆపరేషన్‌లో భాగంగా 512 మంది సిబ్బందితో కూడిన 137 పోలీస్ బృందాలు రాష్ట్రవ్యాప్తంగా 137 బ్యాంకు బ్రాంచ్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. దేశవ్యాప్తంగా 9,451 కేసులతో సంబంధం ఉన్న 1,888 మ్యూల్ ఖాతాలను గుర్తించారు. ఈ ఖాతాల ద్వారా సుమారు రూ.100 కోట్ల మోసం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. అరెస్టయిన వారిలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, జూబ్లీహిల్స్ మర్చంట్ కో-ఆపరేటివ్ బ్యాంకులకు చెందిన

ఇద్దరు ఉద్యోగులు కూడా ఉన్నారు. వీరు సరైన కేవైసీ నిబంధనలు పాటించకుండా ఖాతాలు తెరిచేందుకు సహకరించినట్లు పోలీసులు గుర్తించారు.నిందితుల నుంచి 63 మొబైల్ ఫోన్లు, 208 బ్యాంకు పాస్‌బుక్‌లు,

చెక్ బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వరంగల్‌లో ఒక వ్యక్తి తన కుటుంబ సభ్యుల ఖాతాలను కూడా మోసాలకు వాడినట్లు తేలింది. కొందరు నిందితులు నకిలీ పత్రాలతో ఆన్‌లైన్‌లో ఖాతాలు తెరిచి మోసాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది.

# నీళ్లివ్వమని అడిగిన రైతులను జైల్లో పెట్టడం ఏమిటి?

- మొదటి పేజి తరువాయి

అడిగిన రైతులను జైల్లో పెట్టడం ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రంగనాయక్ సాగర్ నుంచి పెద్దలింగాపూర్, తంగళ్లపల్లి మండలాలకు సాగునీరు అందించే 11వ ప్యాకేజీ (ఎల్ఎం 4, ఎల్ఎం 6) కాలువ పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కాలువ పనుల కోసం రూ. 3 కోట్ల నిధులు విడుదలయ్యాయని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించి ఏడాది దాటినా, ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంపై బండి సంజయ్ విస్మయం వ్యక్తం చేశారు. ఈ పనులు గనుక పూర్తయి ఉంటే దాదాపు 9,500 ఎకరాలకు సాగునీరు అందేదని ఆయన అన్నారు. గత పదేళ్లు అధికారంలో ఉండి కూడా సిరిసిల్ల జిల్లాకు నీరివ్వని కేటీఆర్ ఒక 'రైతు ద్రోహి' అని ఆయన ఘాటుగా విమర్శించారు. అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ వైఫల్యాల వల్లే రైతులు పంటలు నష్టపోతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులకు మద్దతుగా నిలిచిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి సహా ఇతర నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు.

రైతులపై అక్రమ కేసులు నమోదు చేస్తే ఊరుకునేది లేదని, వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని హెచ్చరించారు. రైతుల డిమాండ్లు నెరవేరే వరకు బీజేపీ అండగా ఉంటుందని, తక్షణమే ప్రభుత్వం స్పందించి కాలువ పనులు ప్రారంభించకపోతే పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# ఆర్థిక సంక్షోభంలో పాకిస్థాన్

- మొదటి పేజి తరువాయి

ఊపిరాడనీ యకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల ప్రభావంతో చమురు దిగుమతులు ప్రియమవ్వడంతో, దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రధాని షెహబాజ్ షరీఫ్ అత్యంత కఠినమైన పొదుపు చర్యలు ప్రకటించారు. గల్ఫ్ దేశాల నుంచి వచ్చే చమురు సరఫరాపైనే తమ దేశం ఆధారపడి ఉందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఖర్చులను తగ్గించుకోక తప్పదని ఆయన స్పష్టం చేశారు. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వ కార్యాలయాలు ఇకపై వారానికి నాలుగు రోజులు (సోమవారం నుంచి గురువారం వరకు) మాత్రమే పనిచేస్తాయి. అయితే బ్యాంకులు, ఆసుపత్రులు, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు ఈ నిబంధన వర్తించదు. వచ్చే రెండు వారాల పాటు స్కూళ్లు, కాలేజీలు మూసివేస్తున్నట్లు ప్రకటించారు. ఉన్నత విద్యా సంస్థలు తరగతులను ఆన్‌లైన్‌లో నిర్వహించాల్సి ఉంటుంది. ప్రభుత్వ, అధికారిక వాహనాలకు ఇచ్చే పెట్రోల్ కోటాను 50 శాతానికి తగ్గించారు. అలాగే రాబోయే రెండు వారాల పాటు 60 శాతం ప్రభుత్వ వాహనాలను రోడ్డెక్కించబోమని ప్రధాని తెలిపారు. అంబులెన్స్‌లు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌కు దీని నుంచి మినహాయింపు ఇచ్చారు.

మంత్రులు, సలహాదారులు రాబోయే రెండు నెలల పాటు ఎటువంటి జీతాలు తీసుకోరు. పార్లమెంటు సభ్యులందరికీ 25 శాతం, రూ. 3 లక్షల కంటే ఎక్కువ సంపాదించే ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం

జీతాల్లో కోత విధించారు. ప్రధాని, ముఖ్యమంత్రులు, గవర్నర్లు సహా అందరు ప్రజాప్రతినిధులు, అధికారుల విదేశీ పర్యటనలపై పూర్తి నిషేధం విధించారు. కేవలం అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే అనుమతి ఉంటుంది.

# ఇండిగో వరుస వైఫల్యాలు.. కంపెనీ సీఈవో రాజీనామా

- మొదటి పేజి తరువాయి

ఈ నిబంధనలు పైలట్‌ల వారపు విశ్రాంతి సమయాన్ని 36 గంటల నుంచి 48 గంటలకు పెంచాయి. ఇది పైలట్‌ల అలసట రిస్క్‌ను తగ్గిస్తుంది. ఈ మార్పులు విమాన ప్రయాణాల భద్రతను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మెరుగుపరచాలని లక్ష్యంగా చేసిన ప్రయత్నం. ఈ నిబంధనల గురించి రెండు సంవత్సరాల ముందు నుంచే పూర్తి అవగాహన ఉన్నప్పటికీ, కొత్త నిబంధనలకు అనుగుణంగా తగినంత మంది సిబ్బందిని సమకూర్చుకోవడంతోపాటు రోస్టరింగ్ వ్యవస్థను మెరుగుపరచడంలో ఇండిగో నిర్లక్ష్యం వహించింది. భారతదేశంలో అత్యధిక విమానాలను నడుపుతున్న సంస్థగా, సిబ్బంది కొరతను సరిచేయడానికి ఇండిగో ప్రణాళికా లోపం సంస్థ కార్యకలాపాలను ఒక్కసారిగా కుప్పకూల్చింది.

### డీజీసీఏ వైఫల్యం

దేశ పౌర విమానయాన భద్రతకు అత్యున్నత బాధ్యత వహించే డీజీసీఏ చర్యలు ఈ సంక్షోభంలో అసమర్థతను చూపించిందని నిపుణులు విమర్శిస్తున్నారు. డీజీసీఏ, ఇండిగోకు షోకాజ్ నోటీసు ఇవ్వడం న్యాయపరమైన చర్య అయినప్పటికీ, వేలాది విమానాలు రద్దై, ప్రయాణీకులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయిన తర్వాత మాత్రమే డీజీసీఏ స్పందించింది.

ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్1937 ప్రకారం డీజీసీఏ సంస్థకు విమానయాన ఆపరేటర్‌పై భారీ జరిమానాలు విధించే అధికారం లేదా ఎయిర్ ఆపరేటర్స్ పర్మిట్ రద్దు చేసే అధికారం ఉంది. ఈ జాప్యం డీజీసీఏ వ్యవస్థాపరమైన పర్యవేక్షణ వైఫల్యాన్ని తెలియజేస్తుంది. ముందస్తు తనిఖీ చేయడంలో విఫలమవడం, డీజీసీఏ తన ప్రాథమిక భద్రతా విధులను పూర్తిగా నిర్లక్ష్యం చేసినట్టేనని విమర్శలు వచ్చాయి.

### ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం

దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో చట్టపరమైన బాధ్యతతో పాటు నైతిక బాధ్యత వహించాలి. నిబంధనల అమలుకు తగిన ఏర్పాట్లు చేయడంలో విఫలమవడం అనేది కేవలం నిర్వహణ లోపం కాదు. ఇది 'ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం'గా పరిగణించవచ్చు. ఎందుకంటే, తమ అధిక లాభాలను కాపాడుకోవడానికి, ఇండిగో భద్రతా నిబంధనల అమలును ఆలస్యం చేసిందని, తద్వారా సంస్థ విమానయాన చట్టాలను ఉల్లంఘించిందని స్పష్టం చేస్తోంది. న్యాయ పదజాలంలో 'రెస్ ఇప్సా లోక్విటూర్' అనే సూత్రం ఇక్కడ వర్తిస్తుంది. అంటే, నష్టం జరగడానికి సంస్థ నిర్లక్ష్యమే కారణమని స్పష్టంగా తెలుస్తోంది. ఈ నిబంధనల ఉల్లంఘన విమానయాన చట్టాల క్రింద ఇండిగో విశ్వసనీయతను తీవ్రంగా దెబ్బతీసింది.

డీజీసీఏ సీఏఆర్? (పౌర విమానయాన అవసరాలు) సెక్షన్ 3, సిరీస్ ఎం, పార్ట్ ×ు అనేది విమాన ప్రయాణానికి నిరాకరించినప్పుడు, విమానాలు రద్దు అయినప్పుడు, ఆలస్యం అయినప్పుడు ప్రయాణీకులకు విమానయాన సంస్థలు అందించవలసిన సౌకర్యాలు, పరిహారం గురించిన నియమావళి

ప్రకారం అందించాల్సిన నష్టపరిహారం, రిఫండ్‌లతో పాటు ఇతర సౌకర్యాలను సకాలంలో అందించడంలో కూడా ఇండిగో వైఫల్యం చెందింది. ఈ వైఫల్యం కారణంగా ఇండిగో కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ 2019 కింద 'సేవా లోపం'కు పూర్తి బాధ్యత వహించాలి.

#### కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి

# పెద్దపీట వేస్తుంది

- మొదటి పేజి తరువాయి

నియోజకవర్గంలో ఇప్పటి వరకు 300 బోర్లు వేసామని అన్నారు మంత్రి వివేక్.తమ ప్రభుత్వం వచ్చాక త్రాగునీటి సమస్యలు తీర్చుతున్నామని... బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన మిషన్ భగీరథ పథకం ఒక పెద్ద ఫెయిల్యూర్ అని.. రూ.100 కోట్లతో పనులు జరుగుతున్న అమృత్ స్కీం పథకం ద్వారా చెన్నూరు నియోజక వర్గంలో ఇంటింటికి. తాగునీరు అందిస్తామని అన్నారు మంత్రి వివేక్. మందమర్రిలో పట్టా భూములు ఉన్న లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తామని అన్నారు మంత్రి వివేక్.

### ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్

# సమావేశం రసాభాస...

ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం రసాభాసగా మారింది. కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరిగింది. రెండు పార్టీల కౌన్సిలర్లు పరస్పరం చొక్కాలు పట్టుకుని, బాహాబాహీకి దిగారు. ఇరు పార్టీల గందరగోళం మధ్యనే ఛైర్‌పర్సన్ అనూష 'అజెండా పాస్' అంటూ ప్రకటన చేసి తన ఛాంబర్‌లోకి వెళ్లిపోయారు. అయితే చర్చ లేకుండానే అజెండాను ఎలా పాస్ చేస్తారని బీజేపీ కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛైర్‌పర్సన్ ఛాంబర్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఛైర్‌పర్సన్, కాంగ్రెస్ కౌన్సిలర్లు బయటకు రాకుండా బీజేపీ కౌన్సిలర్లు అడ్డుకున్నారు. పోలీసులు జోక్యంతో ఛైర్‌పర్సన్ బయటకు వచ్చారు. దీంతో దాదాపు మూడు గంటల పాటు అక్కడ ఉద్రిక్తత నెలకొంది.

కాగా, నీటి సమస్యపై చర్చించాలని బీజేపీ కౌన్సిలర్లు డిమాండ్ చేయడం ఉద్రిక్తతకు దారి తీసింది. కాంగ్రెస్ కౌన్సిలర్ అజయ్, బీజేపీ కౌన్సిలర్ రాకేష్ మధ్య తోపులాట చోటు చేసుకుంది. పాలకవర్గం సభను నామమాత్రంగా నిర్వహిస్తున్నారని బీజేపీ కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు.

# ప్రభుత్వానికి తలవంచని ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ

- మొదటి పేజి తరువాయి

బలోపేతం చేసింది నెహ్రూజీనే అని ఇప్పుడు చెబుతున్నారు" అని ప్రియాంక వ్యాఖ్యానించగా, ప్రతిపక్ష సభ్యులు బల్లలు చరుస్తూ మద్దతు తెలిపారు. అనంతరం రాహుల్ గాంధీని సమర్థిస్తూ, "గత 12 ఏళ్లుగా ఈ ప్రభుత్వం ముందు తలవంచని వ్యక్తి ఈ దేశంలో ఒక్కరే ఉన్నారు. ఆయనే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ. ఎందుకంటే లోక్‌సభ నాయకుడు నిజం మాట్లాడటానికి వెనుకాడరు. కానీ, వారు (ప్రభుత్వం) నిజాన్ని జీర్ణించుకోలేరు" అని ప్రియాంక అన్నారు.అంతకుముందు, స్పీకర్‌కు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు స్పందించారు. రాజ్యాంగం ప్రకారం చట్టాలు, నిబంధనలకు అధికార, ప్రతిపక్ష సభ్యులందరూ కట్టుబడి ఉండాలని అన్నారు. "ఏ వ్యక్తి అయినా తనను తాను అన్నింటికీ అతీతుడిగా భావించినప్పుడు, అతడిని నిలదీయడం చాలా ముఖ్యం" అని రాహుల్ గాంధీని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు.

# వంటగ్యాస్ ఆందోళన... ప్రధాని మోదీ కీలక సమీక్ష

- మొదటి పేజి తరువాయి

ఉత్పత్తి కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. ఇంధన ఉత్పత్తిపై ఆందోళనలు రేకెత్తుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక భేటీ నిర్వహించారు.విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరితో ఉన్నతస్థాయి చర్చలు జరిపారు. ఎల్పీజీ నిల్వలు, సరఫరాపై సమీక్ష జరిపారు.కాగా ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో కేంద్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. కమర్షియల్ ఎల్పీజీ వాస్తవ అవసరాలను గ్యాస్ కంపెనీలు అందుకోవాల్సిందేనని ఇంధన కంపెనీలకు స్పష్టం చేసింది.ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో కొంత సంక్షోభం వాస్తవమే కానీ పెట్రోలియం ఉత్పత్తుల ప్రస్తుతానికి ఇబ్బంది లేదని కేంద్రం తెలిపింది. పశ్చిమాసియాలో యుద్ధానికి ముందు తరహాలోనే భారత రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని అన్నారు. దేశానికి వచ్చే 70 శాతం ఉత్పత్తులు హోర్ముజ్ జలసంధి నుంచి కాకుండా ఇతర మార్గాల్లో వస్తున్నట్లు కేంద్రం తెలిపింది.




మెడికల్ షాపులోపల మంగళవారం కుత్బుల్లాపూర్ డిఐ తిరుపతి, మరో డిఐ కలిసి తనిఖీలు..

# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

# మంత్రిగారి 'బంధువు' ఆగడాలు..?

## వ్యాపారంలో పార్టనర్ షిప్ కోసం శత విధాల ఒత్తిడి..?

ఏ క్షణంలో తెలంగాణ స్వ రాష్ట్రాన్ని సాధించుకున్నామో కానీ..! సామాన్యులకు న్యాయం అందని ద్రాక్షగా మారింది.. గత ప్రభుత్వ హయాంలోనూ, ప్రస్తుత ప్రభుత్వం లోనూ అదే కొనసాగుతుంది.. "అప్పుడు- ఇప్పుడు- ఎప్పుడైనా" ప్రజాప్రతినిధులు, మంత్రుల బంధువుల ఆగడాలు మరీ మితిమీరి పోతున్నాయని, అనడానికి ఈఘటన కూడా ప్రత్యేక ఉదాహరణ.. ఒక సాధారణ వెటర్నరీ మెడికల్ షాప్ యజమాని కుటుంబాన్ని శత విధాలుగా వేధింపులకు గురిచేస్తున్న వారిలో ఓ మంత్రి బంధువు తోపాటు, డ్రగ్ కంట్రోల్ అధికారులు ఉండటం గమనార్హం.. రూ.5 లక్షలు ఇస్తాను మీ షాపులో పార్ట్‌నర్ షిప్ ఇవ్వండి.. నెలకు రూ.50 వేలు ఇవ్వాలని నిర్ణయించి వార్నింగ్ ఇచ్చినట్టు బాధితులు మీడియాతో తెలిపారు.. మాట వినలేదని డ్రగ్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశాడు.. ఓమంత్రి తమ్ముడికి తను 'వియ్యంకుడు' అయినందున డ్రగ్ కంట్రోల్ అధికారులతో సిఫార్సులు చేసి 'డిఐ'లతో దాడులకు పాల్పడ్డారు.. భహుశా పలుకుబడి పనిచేసిందేమో.. పాపం ఆ మెడికల్ షాపును ఐదు రోజులపాటు సీజ్ చేసిన 'డిఐ'లు పలుమార్లు తనిఖీలు చేశారు.. అయినప్పటికీ బాధితులు పార్ట్‌నర్‌షిప్‌కి ససేమిరా అనడంతో ఏకంగా డ్రగ్ కంట్రోల్ బోర్డు "అడిషనల్ డైరెక్టర్" తోనూ ఫోన్‌కాల్‌లో రాయబారం కొనసాగింది..? అయినా వినలేదని పరువునష్టం దావాకు నోటీసులు పంపించాడట.. బాధితులు భయపడకుండా కౌంటర్ దాఖలు చేయడంతో.. పరువు నష్టం దావా పత్తాలేకుండా పోయిందని బాధితులు తెలిపారు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మార్చి 10:**

**షాపులో వాటా..! నెలనెలా రొక్కం..?**

షాపులో వాటా ఇవ్వాలని, లాభాల పంపకంలో నెలనెలా తన వాటా డబ్బులు సమర్పించాలని భాగ్యలక్ష్మీ భర్తకు ఫోన్ చేసి వేధించడం మొదలుపెట్టాడు.. రాజ్‌కుమార్ అడిగిన దానికి, యజమాని నిరాకరించడం తో, తనకున్న పలుకుబడి వినియోగించి డ్రగ్ కంట్రోల్ అధికారులను ఉసిగొల్పి తనిఖీల పేరుతో వేధింపులకు తెరలేపాడు. ఒక సందర్భంలో ఐదు రోజులపాటు డ్రగ్ కంట్రోల్ అధికారులు షాప్‌ను మూసివేశారు. అప్పై కూడా వేధింపులు కొనసాగుతూనే ఉండడంతో..! గతంలోనే కుత్బుల్లాపూర్ ప్రాంతానికి ఓ కార్యక్రమానికి హాజరైన మంత్రికి బాధితులు వ్రాతపూర్వక ఫిర్యాదు చేశారు.. ఫిర్యాదు స్వీకరించిన మంత్రి, బాలానగర్ ఏసిపికి విచారణకు ఆదేశించారు.. కేసును ఏసిపి జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్‌కి అప్పగించారు.. దీంతో ఇరువర్గాలను పిలిపించిన, ఇన్‌స్పెక్టర్ మంత్రి బంధువుపై ఆరోపణలకు, బాధితులు ఆధారాలు చూపించడంతో రాజ్‌కుమార్‌ను ఇన్‌స్పెక్టర్ మందలించినట్టు బాధితుని భర్త మీడియాకు తెలిపాడు..




కుత్బుల్లాపూర్ గ్రామంలోని వెటర్నరీ మెడికల్ షాపులో మంగళవారం తనిఖీలకు వచ్చిన డిఐలు..

-4లో

- కుత్బుల్లాపూర్ 'విలేజ్'లో "వెటర్నరీ" మెడికల్ షాపు యజమానికి వేధింపులు..
- 'సెటిల్మెంట్'ల డ్రామాలో డ్రగ్ కంట్రోల్ అధికారులు మధ్యవర్తిత్వం..!
- పార్ట్‌నర్ షిప్ కోసం బెదిరించిన వ్యక్తికి వత్తాసుగా 'డ్రగ్' కంట్రోల్ అధికారులు.."
- తనిఖీల పేరుతో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వేధింపులకు గురి చేస్తున్నాడని ఆరోపణ..
- సెటిల్మెంట్ చేసుకోవాలంటూ సలహా ఒకే మెడికల్ షాప్‌పై పలుమార్లు తనిఖీలు..
- ఏకంగా ఒకసారి సీజ్.. మరోసారి తనిఖీల పేరిట బెదిరింపులు..?
- తాజాగా మంగళవారం నాలుగవ సారి తనిఖీలతో వేధింపు..
- మీడియా జోక్యం చేసుకోవడంతో వెళ్లిపోయిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్..
- కూన రాజకుమార్ గౌడ్ వేధిస్తున్నాడంటూ మహిళా బాధితురాలు ఆవేదన..

## ఇప్ప సారా... మరోసారి కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆసక్తికర వ్యాఖ్యలు

- ఇప్పపువ్వుతో చేసే సారా ఆర్గానిక్ అన్న అనిరుద్ రెడ్డి
- ఇప్పపువ్వు అడవిలో సహజంగా లభిస్తుందన్న ఎమ్మెల్యే
- ఇప్పసారాతో ప్రపంచ మార్కెట్‌లో పెటీపడవచ్చన్న అనిరుధ్ రెడ్డి

-4లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## టైమొచ్చినప్పుడు చెబుతా..

### పార్టీ మార్పుపై జీవన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

- జీవన్ రెడ్డి పార్టీని వీడుతున్నారంటూ వార్తలు
- ఇంకా నిర్ణయం తీసుకోలేదన్న జీవన్ రెడ్డి
- అనుచరులతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్:జగిత్యాల రాజకీయాలు ఒక్కసారిగా హీటెక్కాయి. కాంగ్రెస్ పార్టీలో దశాబ్దాల కాలంగా కీలక నేతగా ఉన్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, పార్టీ మారుతున్నారనే వార్తలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. జగిత్యాలలోని ఇందిరా భవన్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆయన ఈరోజు చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీలోనే కలకలం రేపుతున్నాయి.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు పార్టీలో, ప్రభుత్వ ప్రోటోకాల్‌లో అధిక ప్రాధాన్యత ఇవ్వడంపై జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల జరిగిన జగిత్యాల మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆశించిన ఫలితాలు సాధించకపోవడానికి ఎమ్మెల్యే సంజయ్ కుమారే కారణమని ఆయన గతంలోనే నేరుగా ఆరోపించారు. 'ఇంకెంత కాలం ఈ అవమానాలు భరించాలి?' అని ప్రశ్నిస్తూ, పార్టీలో తనకు తగిన గుర్తింపు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతానికి తాను కాంగ్రెస్ లో కొనసాగాలా? వద్దా? అనే దానిపై తుది నిర్ణయం తీసుకోలేదని... తన అనుచరులు, కార్యకర్తలతో చర్చించిన తర్వాతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని స్పష్టం చేశారు. ఏదైనా మీకు చెప్పే చేస్తానని మీడియాను ఉద్దేశించి అన్నారు.

## లక్షల గొంతుకల పోరాటం.. 15 ఏళ్ల కిందటి ఉద్యమ ఘట్టం

### మిలియన్ మార్చ్‌ను స్మరించుకున్న కేటీఆర్

- మిలియన్ మార్చ్‌కు 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేటీఆర్ స్పెషల్ పోస్టు
- తెలంగాణ ఉద్యమంలో అదొక కీలక ఘట్టమని వెల్లడి
- నిర్బంధాలు ఉద్యమకారుల స్ఫూర్తిని ఆపలేకపోయాయని వ్యాఖ్య
- ట్యాంక్‌బండ్‌పై లక్షల గొంతుకలు గర్జించాయని పోస్టులో పేర్కొన్న కేటీఆర్

-4లో



## పంచాయతీలకు మూడేళ్లలో శాశ్వత భవనాలు

### ప్రణాళికలు సిద్ధం చేయాలని భట్టి ఆదేశం

### వివిధ శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష




**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో అన్ని గ్రామ పంచాయతీలకు వచ్చే మూడేళ్లలో శాశ్వత భవనాలు నిర్మించేందుకు పంచాయతీరాజ్‌శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తే.. నిధులు కేటాయిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పంచాయతీరాజ్, ఉపాధి-శిక్షణ, పర్యాటక, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖలు పంపిన బడ్జెట్ ప్రతిపాదనలపై మంగళవారం సచివాలయంలో ఆయన

-5లో


# మంత్రిగారి 'బంధువు' ఆగడాలు..?



మీడియాతో మాట్లాడుతున్న కుత్బుల్లాపూర్ డ్రగ్ ఇన్స్పెక్టర్ తిరుపతి..



మెడికల్ షాపు యజమాని భార్య లక్ష్మీ



గతంలో ఐదు రోజులపాటు సీజ్ చేసిన నాటి దృశ్యం..

## ఫలించని పాచికలు..! మళ్ళీ తనిఖిలు..! మీడియా ఎంట్రీ..!

ఓవైపు చేసేది చేస్తూనే రాజ్ కుమార్ తిరిగి తన పరువు తీసాడని పేర్కొంటూ బాధితురాలు భర్త శివకుమార్‌కు పరువు నష్టం దావ నోటీసు ఇచ్చాడు. దీనికి బదులుగా బాధితులు సమాధానం లాయర్ ద్వారా అందించారు. ఇది జరిగిన కొద్ది రోజులకు..! తాజాగా, రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కుత్బుల్లాపూర్ మండల డ్రగ్ కంట్రోల్ అధికారి తిరుపతి. మల్కాజిగిరి డ్రగ్ కంట్రోల్ అధికారి మురళీకృష్ణలు సదరు మెడికల్ షాపులో మళ్ళీ (4 వసారి) తనిఖీలకు వెళ్లారు. అయితే, విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు తనిఖీలు చేస్తున్న దుకాణానికి వెళ్లగానే అక్కడినుంచి అధికారులు జరుకునే ప్రయత్నం చేశారు. మీడియా ప్రతినిధులు ప్రశ్నించడంతో పిర్యాదు మేరకు రావడం జరిగిందని తెలిపారు. కాగా అప్పటికే వేధింపులతో విసిగిపోయిన యజమాని భాగ్యలక్ష్మి మీడియాను ఆశ్రయించి జరిగింది, జరుగుతుంది మొత్తం . మీడియా ప్రతినిధులు ముందు ఆవేదన వ్యక్తం చేశారు.. ఇక తనిఖీల పేరుతో హడావుడి చేస్తున్న అధికారులు సమాధానం చెప్పలేక అక్కడి నుండి జారుకోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది..

## మంత్రిగారి 'బంధువు' ప్రయోజనం కోసం ప్రభుత్వ అధికారులు..

ఒక ప్రైవేట్ వ్యక్తి ప్రయోజనాల కోసం డ్రగ్ కంట్రోల్ అధికారులు పనిచేయడం సిగ్గుచేటు అంటూ విమర్శిస్తున్నారు. నిజాయితీగా వ్యాపారం చేసుకునే వారిని భయభ్రాంతులకు గురిచేసి, 'సెటిల్మెంట్లు' చేసుకోవాలని ఉచిత సలహాలు ఇవ్వడం వారి విధి నిర్వహణలో భాగమా..?" అంటూ స్థానిక వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులతో కుమ్మక్కై సామాన్యులను ఇబ్బంది పెడుతున్న అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపించాలనీ, రాజకీయ అండ చూసుకుని వ్యాపారస్తులను బ్లాక్ మెయిల్ చేస్తున్న రాజ్‌కుమార్ వంటి వ్యక్తులపై అతనికి సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.. అధికార ముసుగులో జరుగుతున్న ఈ దోపిడీ పర్వానికి జిల్లా యంత్రాంగం స్పందించి అడ్డుకట్ట వేస్తుందా..? లేక లోపాయికారి ఒప్పందాలతో అక్రమార్కులకు వత్తాసు పలుకుతుందా..? వేచి చూడాలి.

- 3 పేజి తరువాయి

రక్షించాల్సిన వారే భక్షకులుగా మారితే..!చట్టాన్ని కాపాడాల్సిన యంత్రాంగం అక్రమార్కులకు కొమ్ముకాస్తే..! సామాన్యుడి పరిస్థితి ఏమిటి..? తెలంగాణలో 'సిస్టమ్– శిధిలావస్థకు' చేరుకుంది అనడానికి నేటి "పెన్ పవర్" దినపత్రికలో ప్రత్యేక కథనం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్‌లో ఓ వెటర్నరీ మెడికల్ షాపు పార్టనర్ షిప్ కోసం మంత్రిగారి 'బంధువు' తోపాటు డ్రగ్ కంట్రోల్ బోర్డు అధికారులు వ్యవహరించిన తీరుపై స్థానికంగా సంచలనం రేపుతోంది.. విధుల్లో పారదర్శకత పాటించాల్సిన డ్రగ్ కంట్రోల్ అధికారులు, అధికార పార్టీకి చెందిన ఓ మంత్రి తమ్ముడికి 'వియ్యంకుడి'కి ప్రాధాన్యత ఇస్తూ..! మెడికల్ షాపుల యజమానులను వేధింపులకు గురిచేస్తుండటం స్థానికంగా కలకలం రేపుతోంది.. బాధితులు తెలిపిన వివరాలు, ఆధారాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ జీడిమెట్ల గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మీ గత కొంతకాలంగా 'నోబుల్ పెట్ అండ్ వెట్' పేరుతో పశువుల మందుల దుకాణాన్ని సుమారు 14 ఏళ్ళుగా నడుపుతున్నారు.. వ్యాపారం సాఫీగా సాగుతున్న తరుణంలో, స్థానికంగా నివసించే కూన రాజ్‌కుమార్ అనే వ్యక్తికి ఆ షాపుపై కన్ను పడింది.. తనకు రాజకీయ పలుకుబడి తోపాటు.. మంత్రికి అత్యంత దగ్గరి 'బంధువు' అని బాధితులు ఆరోపిస్తున్నారు..

---


సూరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గేటు ముందు వేసిన చెత్త..


పాఠశాల విద్యార్థులతో కాలనీలో ప్రచారానికి సిద్ధం..

- స్కూల్ గేటు ముందు చెత్త వేస్తున్న వారిని పట్టుకున్న పర్యావరణ ప్రేమికులు..
- వారితోనే చెత్తను ఎత్తించి బ్యాండ్ బాజాతో వీధుల్లో ఊరేగింపు..
- విద్యార్థులకు దుర్వాసన, అసౌకర్యం కలగడంతో ఈ చర్యలు..
- చెత్తను నిర్ణీత ప్రదేశాల్లోనే వేయాలని రవిందర్ ముదిరాజ్ ప్రజలకు సూచన..

# చెత్త వేస్తే బ్యాండ్ బాజాతో ఊరేగింపు..!

## సూరారం కాలనీలో వినూత్న రీతిలో పర్యావరణ సందేశం..


మున్సిపల్ నిర్ధారించిన విధంగానే చెత్తను పారబోయాలని కోలా రవిందర్ ముదిరాజ్ ప్రజలకి విజ్ఞప్తి..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, మార్చి10:**రోడ్లపై చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సూరారం కాలనీలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు.. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ గేటు ముందే చెత్త వేస్తున్న వారిని గుర్తించి, వారితోనే చెత్తను ఎత్తించి బ్యాండ్ బాజాలతో ఊరేగింపుగా తిప్పుతూ పర్యావరణ పరిరక్షణపై బలమైన సందేశాన్ని ఇచ్చారు.. పర్యావరణ ప్రేమికుడు సామాజిక వేత్త కోలా రవిందర్ ముదిరాజ్ ఈ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు.. మంగళవారం ఉదయం సుమారు 7.35 గంటల సమయంలో పాఠశాల గేటు ముందు చెత్త వేస్తున్న వ్యక్తులను ఆయన పట్టుకుని, వారితోనే అక్కడ పడేసిన చెత్తను శుభ్రం చేయించారు.. అనంతరం విద్యార్థులతో కలిసి బ్యాండ్ బాజాలు మోగిస్తూ కాలనీ వీధులలో ఊరేగింపు నిర్వహించారు. పాఠశాల గేటు ముందు చెత్త వేయడం వల్ల విద్యార్థులకు తీవ్ర దుర్వాసన, అసౌకర్యం, అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు.. భవిష్యత్తులో ఎవరూ ఇలాంటి చర్యలకు పాల్పడకూడదని ప్రజలకు సూచించారు. పరిశుభ్రమైన పరిసరాలు మనందరి బాధ్యత అని, చెత్తను నిర్ణీత ప్రదేశాల్లో మాత్రమే వేయాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికుడు కోలా రవిందర్ ముదిరాజ్, పాఠశాల విద్యార్థులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు. సమాజంలో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి వినూత్న కార్యక్రమాలు అవసరమని వారు పేర్కొన్నారు..

---

# లక్షల గొంతుకల పోరాటం.. 15 ఏళ్ల కిందటి ఉద్యమ ఘట్టం

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక ఘట్టమైన 'మిలియన్ మార్చ్'కు నేటితో 15 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆనాటి ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగసేలా చేసిన అద్భుత పోరాట రూపాల్లో ఇదొకటని ఆయన పేర్కొన్నారు.ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. 2011 మార్చి 10న జరిగిన మిలియన్ మార్చ్‌ను స్మరించుకున్నారు. "స్వరాష్ట్ర సాధన కోసం ట్యాంక్‌బండ్‌పై యావత్ తెలంగాణ ప్రజలు ఏకమై గర్జించి నేటికి 15 ఏళ్లు. నిర్బంధాలు, దిగ్బంధాలు, అడ్డంకులు, బ్యారికేడ్లు, ఇనుపకంచెలు ఏవీ తెలంగాణ ఉద్యమకారుల స్ఫూర్తిని దెబ్బతీయలేకపోయాయి" అని కేటీఆర్ తన పోస్టులో రాసుకొచ్చారు. స్వరాష్ట్రం కోసం లక్షల గొంతుకలు ట్యాంక్‌బండ్‌పై ఏకమై నినదించిన అద్భుత పోరాటానికి నేటితో 15 ఏళ్లు పూర్తయ్యాయని తెలిపారు.ఈ సందర్భంగా కేటీఆర్ తన పోస్టుకు ఆనాటి మిలియన్ మార్చ్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలను జతచేశారు. "తెలంగాణ అమరవీరులకు జోహార్లు, జై తెలంగాణ" అంటూ తన పోస్టులో రాసుకొచ్చారు.

# ఇప్ప సారా... మరోసారి కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆసక్తికర వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:**జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇప్పపువ్వుతో చేసే సారా ఆర్గానిక్ అని, ఇది ఆరోగ్యంపై పెద్దగా ప్రభావం చూపదని అన్నారు. అసెంబ్లీలో దీనిని ప్రస్తావిస్తే ప్రతిపక్షాలు కూడా స్వాగతిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం మాత్రం చివరకు ఏది సరైనదో అదే చేస్తుందని అన్నారు. ఇప్పపువ్వు అడవిలో సహజంగా లభిస్తుందని ఆయన తెలిపారు. దీనితో మనం ప్రపంచ మార్కెట్‌లో కూడా పోటీ పడవచ్చని అన్నారు.మెక్సికో టకీలా డ్రింక్, ఫ్రాన్స్ కొనియా డ్రింక్‌ను తయారు చేసి ఎగుమతి చేస్తున్నాయని పేర్కొన్నారు. అందుకే తాను ఇప్పసారాపై పూర్తి నివేదిక సిద్ధం చేసుకున్నానని అన్నారు. ఇప్పసారా వల్ల కలిగే లాభ నష్టాల గురించి అసెంబ్లీలో మాట్లాడతానని తెలిపారు.గతంలో ఇప్పసారా తాగిన వారు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా 110 ఏళ్లు బతికారని అన్నారు. కానీ ఇప్పుడు మద్యం తాగి అరవై ఏళ్లు కూడా ఆరోగ్యంగా బతకడం లేదని అన్నారు. ఇప్పపువ్వు సారాను మార్కెట్ చేస్తే ఆదివాసీలు, ఎస్టీలకు జీవనోపాధి దొరుకుతుందని అన్నారు. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి కూడా మంచి ఆదాయం లభిస్తుందని అన్నారు.

# బన్సీలాల్ పేటలో కలెక్టర్ పర్యటన

**సికింద్రాబాద్: పెన్ పవర్:** 99రోజుల యాక్షన్ ప్లాన్ ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా సనత్నగర్ నియోజకవర్గం, బన్సీలాల్ పేట్ ను కలెక్టర్ దాసరి హరి చందన మంగళవారం సందర్శించారు.జీ హెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, ఇతర ఉన్నతాధికారులతో కలసి శిథిలావస్థకు చేరిన వాంబే పథకంలోని భవనాలను కలెక్టర్ పరిశీలించారు. పాత వాంబే పథకంలో నిర్మించిన నాలుగు బ్లాకుల ఇళ్లను వారు పరిశీలించి గోడలు బీటలు వారడం, స్లాబుల నుండి పెచ్చులు ఊడిపడుతుండడం గమనించారు. అంగన్ వాడి, ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం గురించి టీచర్ ను అడిగి తెలుసుకున్నారు. గాంధీ పట్టణ ఆరోగ్య కేంద్రంలోకి వెళ్ళి, అక్కడ రోజువారీ బయోవేస్ట్ ను వేరుగా చేయాలని మెడికల్ ఆఫీసర్ కు సూచించారు. రెండు చోట్ల ఉన్న ఖాళీ స్థలంలో పిల్లల పార్కులను అభివృద్ధి చేయాలని జోనల్ అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులను పంపించి సమగ్ర రిపోర్ట్ తీసుకొని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు నిపుణులు రిపోర్టుల ఆధారంగా వీటిని కూల్చి వేసి నూతన భవనాలు నిర్మించడమా లేక మరమ్మతులు సరిపోతాయనే అంశం తెలుస్తామన్నారు. కలెక్టర్ తో పాటు జీహెచ్ఎంసి సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కే అలివేలు మంగతాయారు, కవాడిగూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆర్ పుష్పలత, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, తాసిల్దార్ పాండు నాయక్ అధికారులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## భారీగా ఎన్ డి పి ఎల్ మద్యం పట్టివేత రూ.3.68 లక్షల మద్యం స్వాధీనం 18 కేసులు నమోదు

**రంగారెడ్డి: పెన్ పవర్:**ఎక్సైజ్ యంత్రాంగం స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ శానవాజ్ ఖాసీం ఆదేశాల మేరకు ఎయిర్పోర్టు నుంచి వస్తున్న మద్యాన్ని పట్టుకున్నారు. ఢిల్లీ గోవా ప్రాంతాల నుంచి వస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ, గోవా నుంచి మద్యం వస్తున్నట్లుగా సమాచారం రావడంతో ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ బి, సి అండ్ డి టీముల సిఐలు భిక్షా రెడ్డి, వెంకటేశ్వర్లు, నాగరాజు సిబ్బంది కలిసి రాజీవ్ గాంధీ ఎయిర్పోర్ట్ బయట రోడ్డుపై వాహనాలు తనిఖీలు చేపట్టారు.

ఈ తనిఖీల్లో 99 ఢిల్లీ గోవాకు చెందిన మద్యం బాటిల్లను సీజ్ చేశారు. శంషాబాద్ రోడ్డు లో శంషాబాద్ డిటిఎఫ్ సిఐ ప్రవీణ్ కుమార్, శేర్లింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐ కిరణ్, చేవెళ్ల ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, శంషాబాద్ సిఐ దేవేందర్ రావు సిబ్బంది కలిసి ఎయిర్పోర్టు నుంచి వస్తున్న ఎన్డిపిఎల్ మద్యాన్ని పట్టుకోవడానికి శంషాబాద్ రోడ్ లో వాహనాలను తనిఖీ చేశారు.

85 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నారు. 12 మంది పై కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసుల్లో 1084 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మద్యం బాటిల్ల విలువ రూ.3.68 లక్షలు గా ఉంటుందని అంచనా వేశారు.

## పెన్షన్ 'మిస్ మ్యాచ్'.. ఎంపీడీఓ కీలక ఆదేశాలు

**కల్వకుర్తి, మార్చి 10 పెన్ పవర్:** నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని దివ్యాంగుల పెన్షన్ల విషయంలో తలెత్తిన 'మిస్ మ్యాచ్' సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం ఎంపీడీఓ సత్యపాల్ ఆదేశాలు జారీ చేశారు. మార్చి 12న ఉదయం 10:00 గంటలకు కల్వకుర్తి ఎంపీపీ కార్యాలయంలో లబ్ధిదారులు తమ ఆధార్ కార్డు, సదరం సర్టిఫికేట్ వంటి ధృవపత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

## కల్వకుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్ష బరిలో వెంకటేష్ నామినేషన్

**అచ్చంపేట, మార్చి 10 పెన్ పవర్:**కల్వకుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఎస్. వెంకటేష్ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారి ఏ. రాంగోపాల్ కు ఆయన తన నామినేషన్ పత్రాన్ని అందజేశారు. ఇప్పటికే మాజీ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి కూడా అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేశారు. మార్చి 11వ తేదీన ఎన్నికల అధికారి తుది నిర్ణయం తీసుకుంటారు.

## సావిత్రిబాయి పూలే 149వ వర్ధంతివేడుకలు

**నారాయణపేట, మార్చి 10 పెన్ పవర్:** నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో మంగళవారం రోజున స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 149వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి, ఆమెకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కొక్కు శంకర్, సర్పంచ్ రేణుక భరత్, హాజమ్మ, వార్డ్ మెంబర్ మల్లేష్ తదితరులు పాల్గొని, ఆమె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. దేశంలో మహిళాభివృద్ధి, విద్య కోసం ఆమె జీవితాన్ని త్యాగం చేశారని గుర్తు చేశారు.

## సావిత్రిబాయి పూలే 149వ వర్ధంతివేడుకలు

**నాగర్కర్నూల్, మార్చి 10 పెన్ పవర్:** నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో మంగళవారం రోజున స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 149వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి, ఆమెకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కొక్కు శంకర్, సర్పంచ్ రేణుక భరత్, హాజమ్మ, వార్డ్ మెంబర్ మల్లేష్ తదితరులు పాల్గొని, ఆమె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. దేశంలో మహిళాభివృద్ధి, విద్య కోసం ఆమె జీవితాన్ని త్యాగం చేశారని గుర్తు చేశారు.

## రేపాల గ్రామంలో పశువులకు ఉచిత టీకాలు పంపిణీ



**కోదాడ, మార్చి 10 పెన్ పవర్:** కోదాడ నియోజకవర్గం పరిధిలోని మునగాల మండలం రేపాల గ్రామంలో మంగళవారం పశు వులకు ఉచితంగా గాలికుంట వ్యాధి నిరోధక టీకాలు పంపిణీ చేశారు. సర్పంచ్ మొగిలిచర్ల సత్యనారాయణ ఈ కార్యక్రమాన్ని పరిశీలించి, పశువుల ఆరోగ్యం గ్రామ ఆర్థికాభివృద్ధికి కీలకమని, రైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. పశువైద్యాధికారి డాక్టర్ మమత, ఎల్ఎస్ఏ ప్రమీల, గోపాల మిత్ర శ్రీను, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# హెచ్ బీ కాలనీలో ఎల్ఐజీ, ఎంఐజీలు

**హైదరాబాద్, మార్చి 10, పెన్ పవర్:**
పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారం చేసే దిశగా తెలంగాణ సర్కార్ వేగంగా అడుగులు వేస్తోంది. హైదరాబాద్ శివారులో ఎల్ఐజీ, ఎంఐజీ( వర్గాలకు తక్కువ ధరలకే ఇళ్లను కట్టించి ఇవ్వడానికి ప్రణాళికలు రచిస్తోంది. అందుకు కావాల్సిన స్థలాలపై తాజాగా హౌసింగ్ బోర్డు దృష్టిసారించింది. ఈనెల 25 నుంచి ఏప్రిల్ 4 వరకు కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ(క్యూర్) పరిధిలోని హౌసింగ్ బోర్డు, దక్కన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్స్ స్థలాలను గుర్తించి వాటికి రక్షణ గోడలను నిర్మించాలని డిసైడ్ అయింది.ఈ 11 రోజుల్లోనే ఆయా పేద, మధ్యతరగతి ప్రజలకు స్థల సేకరణ, ఇళ్ల నిర్మాణంపై డీపీఆర్ తయారీకి ప్రణాళిక రూపొందించనుంది. హౌసింగ్ బోర్డుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ 5 నుంచి 14 వరకు కేటాయింపుదారులతో కాలనీల వారీగా అధికారులు సమావేశాలను నిర్వహిస్తారు. ఏప్రిల్ 15 నుంచి 23 వరకు గ్రీవెన్స్ కాల్ సెల్ను ఏర్పాటు చేస్తారు. ఈ మేరకు ప్రభుత్వం ఎఫర్డబుల్ హౌసింగ్ పాలసీని సిద్ధం చేస్తోంది. ఈ నెలాఖరులోగా మార్గదర్శకాల ముసాయిదాను సర్కార్ రూపొందించనుంది. పాలసీ రూపకల్పనకు 'రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్' ద్వారా ఇప్పటికే సీబీఆర్ఐ కన్సల్టెన్సీ సంస్థను సైతం ఎంపిక చేసింది.తెలంగాణ రైజింగ్ విజన్-2047లో భాగంగా పట్టణ ప్రాంతాల్లో పీపీపీ పద్ధతిలో పేదలు, మధ్యతరగతి వారికి ఇళ్ల నిర్మాణం చేపట్టడానికిసర్కార్ ఏర్పాట్లు చేస్తోంది. మొత్తం మూడు దశల్లో ఈ ఇళ్ల సముదాయాలను నిర్మించనున్నట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ ఫోర్త్ సిటీలోనూ పెద్దఎత్తున గృహ సముదాయాల నిర్మాణాన్ని చేపట్టనుంది. హైదరాబాద్తోపాటు రాష్ట్రంలోని ఇతర నగరాల్లోనూ తక్కువ ఆదాయ, మధ్య తరగతి పరిధిలోకి వచ్చే జనాభా ఎక్కువగా ఉంటున్నారు. వీరికి కూడా సొంత ఇల్లు కొనుక్కోవాలనే కోరిక ఉన్నప్పటికీ.. అక్కడ కూడా ధరలుభారీగా పెరిగిపోవడంతో అద్దె ఇళ్లలోనే నివాసం ఉంటున్నారు. అందుబాటు ధరలో ఇళ్లు, ఫ్లాట్ల ఉంటే వీరి సొంతింటి కలను నిజం చేసుకోవచ్చు.ఈ మేరకు టైర్ -2 పట్టణాల్లోనూ ఇళ్ల టవర్లను ఏర్పాటుచేసేలా సర్కార్ మార్గదర్శకాలను రెడీ చేస్తోంది. కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్నగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలో గృహనిర్మాణశాఖ స్థలాలను ఇప్పటికే గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో ఇళ్ల సముదాయాలు నిర్మించిఅల్ప ఆదాయ, మధ్యతరగతి వారికి తక్కువ ధరలకే అందించాలని సర్కార్ ప్రయత్నాలు చేస్తోంది

# పంచాయతీలకు మూడేళ్లలో శాశ్వత భవనాలు

- 3 పేజి తరువాయి

సమీక్షలు నిర్వహించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, గడ్డం వివేక్ విడివిడిగా తమ శాఖల సమీక్షల్లో పాల్గొన్నారు. స్థలాలు అందుబాటులో ఉన్నచోట తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను కలిపి నిర్మించే అవకాశాలను పరిశీలించాలని ఈ సందర్భంగా అధికారులకు భట్టి సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు నాణ్యమైన బోధనా పద్ధతులతో వారికి శిక్షణ ఇవ్వాలని స్పష్టం చేశారు. పట్టణాల్లో రహదారులపైన కొంతమంది చంటి బిడ్డలను పెట్టుకొని యాచక వృత్తి కొనసాగిస్తున్నారని.. ఆ చిన్నారులను శిశు విహార్కు పంపి అవసరమైన చర్యలు చేపట్టాలని భట్టి ఆదేశించారు. శిశు విహార్లో ఆధునిక వంటశాల నిర్మించాలన్నారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ఉపాధి కల్పించే కోర్సులను నిర్వహించాలని ఉపాధి శిక్షణ శాఖను ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. కోర్సుల విషయంలో గ్లోబల్ సమ్మిట్లో ఒప్పందాలు కుదుర్చుకున్న కంపెనీలను సంప్రదించాలని సూచించారు. క్యూర్, ప్యూర్, రేర్ పాలసీకి అనుగుణంగా వచ్చే పరిశ్రమలనూ దృష్టిలో పెట్టుకుని కోర్సులు ప్రవేశపెట్టాలన్నారు. ఈ సెంటర్లను స్కిల్స్ యూనివర్సిటీతో అనుసంధానం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు.. గిరిజన ఏజెన్సీల ద్వారానే జరగాలని, ఐటీడీఏలు వాటికి పూర్తిస్థాయిలో సహకారం అందించాలని భట్టి ఆదేశించారు. గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు.

**రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్, సర్వే.. ఒకే గొడుగు కిందకు**

భూముల రీ-సర్వే కోసం అత్యాధునిక రోవర్ల కొనుగోలుకు 2026-27 బడ్జెట్లో నిధులు కేటాయించాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి... భట్టి విక్రమార్కను కోరారు. భూముల సర్వేకు ప్రస్తుతం మండలానికొకటి చొప్పున 460 రోవర్లను కొనుగోలు చేశామని, మరో 400 రోవర్ల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. రాష్ట్రంలో నక్షా (మ్యాప్) లేని 373 గ్రామాల్లో త్వరలోనే రీ-సర్వే చేపట్టబోతున్నామన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి ప్రత్యేక పోర్టల్ను రూపొందిస్తున్నట్లు వివరించారు.

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ఉన్నతస్థాయికి తీసుకువెళ్లాలని ఆ శాఖ అధికారులకు భట్టి, జూపల్లి సూచించారు. "పర్యాటకులను ఆకర్షించే విధంగా... టైగర్ రిజర్వ్ జోన్లను అభివృద్ధి చేయాలి. ఎకో, టెంపుల్ టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. డ్రగ్స్ వినియోగంతో జరిగే నష్టాన్ని కళ్లకు కట్టేలా గ్రామస్థాయిలో ప్రదర్శనలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలి" అని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని అధికారులు వివరించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఒక్కో నియోజకవర్గానికి కనీసం రెండు వేల ఇళ్లయినా మంజూరు చేయాలని ప్రతిపాదించినట్లు సమాచారం. సమావేశంలో ఆర్థిక, గనుల శాఖల ముఖ్యకార్యదర్శులు సందీప్కుమార్ సుల్తానియా, శ్రీధర్, పంచాయతీరాజ్శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్కుమార్, ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ క్వారీ నాది కాదు బీఆర్ఎస్ వి చిల్లర ఆరోపణలు



**పెన్ పవర్: హైదరాబాద్**
బిఆర్ఎస్ నేతల విమర్శల పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సీరియస్ అయ్యారు. ఓఆర్ఆర్ పక్కన సంబంధం లేని క్రషర్ నాదని పిచ్చి కుక్కలు చాలా మొరుగుతున్నాయి. నాపై మొరిగే కుక్కను ఏ గొలుసుతో కట్టేయాలో నాకు తెలుసని అన్నారు. ఆ క్వారీ నాదని చిల్లర ఆరోపణలు చేస్తున్నారు. నాకు క్రషర్ నడిపే ఓపిక లేదు..అది నా క్రషర్ కాదు. బిఆర్ఎస్ నేతలు చెబుతున్నది తిరుమల క్రషర్. వేస్ట్ క్రష్ చేసి సప్లై చేసే లైసెన్స్ వారికి ఉంది. ఆ క్రషర్ కంపెనీ మా కంటైనర్ తీసుకువెళ్ళింది. దాని పై ఉన్న పేరును తొలగించినట్లు ఉన్నారు. దానిని పట్టుకుని పిచ్చి వాగుడు వాగుతున్నారు. వెలుగు పట్లలో 410 మంది నిజమైన వారు ఉన్నారు.. 330మంది బోగస్ అని తేలింది. 410 మందికి త్వరలోనే స్థలాలు ఇండ్లు ఇస్తాం. నా పై పిచ్చి మాటలు మాట్లాడుతున్న వారికి అసెంబ్లీలో గట్టిగా సమాధానం చెబుతానని అన్నారు...

# 99 రోజుల కార్యాచరణ సమావేశం పాల్గోన్న మంత్రి పొన్నం

**కరీంనగర్: పెన్ పవర్:** హుజురాబాద్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు అయ్యారు. హుజురాబాద్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ రోంటాల సుహాసిని, వైస్ చైర్ పర్సన్ గూడూరి అంజలి, కౌన్సిలర్ ల పదవి బాధ్యతల స్వీకరణ సందర్భంగా వారికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి అంబేద్కర్ చౌరస్తా నుండి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ
ర్యాలీ నిర్వహించారు.చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డిసిసి అధ్యక్షులు మేడిపల్లి సత్యం, ,హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఒడితల ప్రణవ్, , ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## హైదరాబాద్ హైవేపై వేగంగా వచ్చిన కారు ఢీకొని ఇద్దరు గాయాలు

**నల్గొండ: పెన్ పవర్:** నల్గొండహైదరాబాద్ హైవేపై వేగంగా వచ్చిన కారు ఢీకొని ఇద్దరికి గాయాలు అయ్యాయి.నల్గొండహైదరాబాద్ హైవేపై ఉన్న అన్లిమిటెడ్ షాపింగ్ మాల్ సమీపంలో వేగంగా వచ్చిన కారు రోడ్డు ఊడుస్తున్న మున్సిపల్ శానిటేషన్ కార్మికులను ఢీకొట్టింది. ఈ ఘటన సీసీటీవీలో నమోదైంది.ఈ ప్రమాదంలో ఒక మహిళా శానిటేషన్ కార్మికురాలి రెండు కాళు విరిగినట్లు సమాచారం. అదే సమయంలో స్కూటర్పై వెళ్తున్న యువకుడిని కూడా కారు ఢీకొట్టడంతో అతనికి తీవ్ర తల గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని నల్గొండ
ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారును నడిపిన డ్రైవర్ను పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## గండిపేటలో బీఆర్ఎస్ ఒక్కరోజు వర్క్ షాపు

**రంగారెడ్డి: పెన్ పవర్:** గండిపేటలోని గోల్కొండ రిసార్ట్లో నేడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఒకరోజు వర్క్ షాపు నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీశ్ రావు హాజరు అయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేసారు. సభలో లేవనెత్తాల్సిన ప్రజా సమస్యలు, నియమనిబంధనలు (రూల్ బుక్), రాజ్యాంగ అంశాలపై అవగాహన కల్పించారు.
వర్క్ షాపును కేటీఆర్ ప్రారంభించగా హరీష్ రావు ముగింపు సమావేశంలో కీలక సూచనలు చేసారు.

## వినాయక ఆలయంలో చోరీ

**సంగారెడ్డి: పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని అశోక్ నగర్ వినాయక ఆలయంలో సోమవారం అర్ధరాత్రి చోరీ వెలుగుచూసింది. ఆలయం తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దుండగులు సుమారు 6 తులాల బంగారు ఆభరణాలు, 8 కిలోల వెండి, ఆలయ హుండీని పగులగొట్టి, 90,000 రూపాయల నగదును దోచుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీం సహాయంతో వేలిముద్రలు,ఇతర ఆధారాలను సేకరిస్తున్నారు. ఆలయ పరిసరాల్లో ఉన్న సీసీటీవీ కెమెరాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

# 50 లక్షల ఓట్ల తొలగింపు..?

**హైదరాబాద్, మార్చి 10, పెన్ పవర్:**
దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ తెలంగాణలో ఏప్రిల్, మే నెలల్లో జరగనుంది. ఈ ప్రక్రియ ద్వారా సుమారు 50 లక్షల ఓట్లదాకా బారీగా తొలగింపు జరగొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. గడిచిన పదిహేనేళ్లలో రెండు మూడు చోట్ల ఓట్లు నమోదు చేసుకుని అన్నిచోట్లా కొనసాగుతున్న వారి డూప్లికేట్ ఓట్లు ఇకపై కొనసాగవని ఈసీ అధికారులు చెప్తున్నారు. తెలంగాణా వ్యాప్తంగా వున్న 3.35 కోట్ల ఓట్లు ఈ సవరణ తర్వాత 2.75 లేదా 2.80 కోట్లకు తగ్గిపోయే అవకాశముంది. పట్టణీకరణ, ఉపాధి అవకాశాల వల్ల ఇటీవల చాలామంది హైదరాబాద్ కు వలస వచ్చి స్థిరపడుతున్నారు. ఐనప్పటికీ వారి స్వంత గ్రామాల్లో కూడా ఓట్లు కొనసాగిస్తూ సందర్భాన్నిబట్టి రెండు చోట్లా ఓటు వినియోగించుకుంటున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ వచ్చిన వారు ఇక్కడ ఓటు నమోదు చేసుకున్నారు. రెండు రాష్ట్రాల్లోనూ అసెంబ్లీ ఎన్నికలు వేర్వేరుగా జరుగుతుండటం వల్ల రెండు చోట్లా ఓటు వినియోగించుకుంటున్నారు. తాజా సవరణ జరిగితే ఆ డూప్లికేషన్కి అవకాశం ఉండదు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో కలిపి మొత్తంగా 87 లక్షల ఓట్లు ఉన్నాయి. అందులో ఈ రకమైన డూప్లికేట్ ఓట్లు సుమారు 20 లక్షలదాకా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ జిల్లాలనుంచి వచ్చినవారితోపాటు తెలంగాణ గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చి రాజధాని నగరంలో స్థిరపడి ఓటు నమోదుచేసుకున్నవారూ ఉన్నారు. తెలంగాణలో పట్టనీకరణ వేగంగా జరుగుతోంది. హైదరాబాద్ తోపాటు జిల్లాల్లోని వివిధ ప్రధాన పట్టనాలకు వలసలు పెరిగాయి. పెద్ద పట్టనాలైన వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్ లాంటి పట్టనాల్లో ఓటర్లు భారీగా పెరిగారు. ఆమేరకు ఆయా పట్టణ పరిసల గ్రామాల్లో ఓటర్ల సంక్య తగ్గాలి కానీ వారు ఓటు మాత్రం రెండు చోట్లా కొనసాగిస్తున్నారు. ఈ స్పెషల్ ఇంటెన్సివ్రివిజన్ ద్వారా గ్రామీణ తెలంగాణలో కూడా సుమారు మరో 30 లక్షల ఓట్లదాకా తగ్గొచ్చని అంచనా. కొన్ని చోట్ల గ్రామాల్లో ఓటు కొనసాగించేందుకు ప్రాధాన్యత ఇవ్వగా కొందరు స్వగ్రామాల్లోనే ఓటు కొనసాగింపునకుసుముఖంగా వున్నారు. ఏది ఏమైనా రెండు చోట్ల మాత్రం ఓటు ఉండకుండా వుండేందుకు ఈసీ అన్ని జాగ్రత్త చర్యలూ తీసుకుంటోంది.బూత్



లెవల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఎన్యూమరేటర్ల ద్వారా మొదట ప్రతీ ఇల్లూసర్వేచేసి ప్రాధమిక జాబితారూపొందిస్తారు. ఆ సమయంలో ఓటరు స్వయంగా అందుబాటులో ఉండి అక్కడే తన ఓటు కొనసాగించాల్సిందగా చెప్పవచ్చు. లేదా మీ తరఫున ఆ ఇంటి యజమాని తగిన డాక్యుమెంటు ఆధారాలిచ్చి ఫారంలో సంతకం చేసినా సరిపోతుంది. ఒకే వ్యక్తికి రెండు లేదా అంతకంటే ఎక్కువ ఓట్లున్నట్టు గుర్తించేందుకు ఈసీ ఓ ప్రత్యేక సాఫ్ట్ వేర్ వినియోగించబోతోంది. డెమోగ్రఫీ సిమిలర్ ఎంట్రీస్ ను పరిశీలిస్తారు. పేరు, తండ్రిపేరు, వయసు, చిరునామా ల్లో సిమిలారిటీ వుంటే వాటిని గుర్తించి నోటీసులు ఇస్తారు. ఎవరైతే ఈ రకమైన ఆధారాలు ఇవ్వరో ఆ ఓటు తొలగిస్తారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ) మొత్తం 4 దశల్లో జరుగుతుంది. మొదటిది డోర్ టు డోర్ సర్వే – మీ బూత్ లెవల్ ఆఫీసర్లు ప్రతీ ఇంటికీ వెళ్లి సర్వేచేస్తారు. రెండవది – ఆ సర్వే ఆధారంగా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల రూపొందిస్తారు. వాటి ముసాయిదా జాబితా విడుదలచేస్తారు. మూడవ దశ – జాబితాలో

ఏవైనా తప్పులున్నా, ఓటు నమోదు కాకున్నా అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరించి సవరిస్తారు. నాలుగవది ఫైనల్ ఓటర్ల జాబితా. ఇప్పటికే ఎన్నికలు జరిగిన బీహార్, త్వరలో ఎన్నికలు జరగబోతోన్న బెంగాల్ , తమిళనాడు తదితర రాష్ట్రాలో ఈ ఎస్ ఐ ఆర్ పై పలు ఆరోపణలు వస్తున్నాయి. అధికార పార్టీ, లేదా యంత్రాంగం ఉద్దేశపూర్వకంగా ఓ వర్గానికి లేదా రాజకీయంగా తమకు వ్యతిరేకుల ఓట్లను వలసుల పేరిట తొలగిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మరి తెలంగాణలో ఎలా నిర్వహిస్తారో ప్రక్రియ ప్రారంభమైతే గానీ తెలియదు.

# వార్ ఎఫెక్ట్... తగ్గిన యూరియా ఉత్పత్తి

**అదిలాబాద్, మార్చి 10, పెన్ పవర్:**
రాబోయే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు యూరియా కొరత తప్పదని, వ్యవసాయ రంగంపై దీని ప్రభావం పడుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్–అమెరికా సంయుక్తంగా దాడులు చేస్తున్నాయి. ఇరానే సైతం ప్రతిదాడులకు దిగుతుండటంతో భీకర యుద్ధం జరుగుతోంది. ఈ యుద్ధం ఎఫెక్ట్ మిగతా ప్రపంచ దేశాలపై పడుతోంది. తాజాగా.. రామగుండం ఎరువుల కర్మాగారంలో యూరియా ఉత్పత్తిపై యుద్ధం ప్రభావం చూపుతోంది. ఈ కార్మాగారం పూర్తిగా గ్యాస్ ఆధారితంగా పనిచేస్తుంది. పశ్చిమాసియా దేశాల నుంచే ఇక్కడకు గ్యాస్ సరఫరా అవుతోంది. ప్రస్తుతం కర్మాగారానికి గ్యాస్ కొరత ఏర్పడటంతో ఈ నెల 6 నుంచి ఉత్పత్తి సామర్థ్యాన్ని అధికారులు సగానికి తగ్గించారు. సరఫరాలో అంతరాయం ఇలాగే కొనసాగితే యూరియా ఉత్పత్తి మరింత క్షీణించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.రామగుండం కర్మాగారం రోజువారీ యూరియా ఉత్పత్తి లక్ష్యం 3,850 టన్నులు. అయితే ప్రస్తుత పరిస్థితుల కారణంగా ఉత్పత్తిని సగానికి తగ్గించారు. ఇక్కడి విద్యుదుత్పాదక కేంద్రం కూడా గ్యాస్ ఆధారంగానే నడుస్తోంది. దీంతో విద్యుదుత్పత్తి కూడా నిలిచిపోనుంది. ప్రత్యామ్నాయ అత్యవసరాలకు ఎన్‌పీడీసీఎల్ విద్యుత్తును వినియోగంలోకి



తెచ్చుకునే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. గత ఐదు నెలలుగా ఎలాంటి అంతరాయాలు లేకుండా ఆర్ఎఫ్‌సీఎల్‌లో యురియా ఉత్పత్తి కొనసాగుతుండగా.. ప్రస్తుతం నిలిపివేయాల్సిన పరిస్థితులు రానున్నాయనే అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రామగుండం ఎరువుల కర్మాగారంలో యూరియా వార్షిక ఉత్పత్తి టార్గెట్ 12.7 లక్షల టన్నులు. ఈ ఏడాది ప్రారంభంలోనే అత్యధిక కాలం ఫ్యాక్టరీ షట్‌డౌన్‌లోనే ఉంది. దీంతో ఫిబ్రవరి నెలాఖరు వరకు 8.5 లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి మాత్రమే జరిగింది. ఈనెల 6 వరకు 1,800 టన్నుల యూరియా ఉత్పత్తి నమోదైంది. దేశవ్యాప్తంగా గ్యాస్ ఆధారిత ఎరువుల కర్మాగారాల్లో ఇంచుమించు ఇదే పరిస్థితి నెలకొందని అధికారులు చెబుతున్నారు. యూరియా ఉత్పత్తి తగ్గితే దాని ప్రభావం రైతులపై పడే అవకాశం ఉంది. రైతులు ఖరీఫ్ సీజన్ సాగు కోసం సిద్ధమవుతున్నారు. మరో 3 నెలల్లో సీజన్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో యూరియా కొరత ఏర్పడితే సాగు కష్టమవుతుందని.. అన్నదాతలకు కష్టాలు తప్పేలా లేవని వ్యవసాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# భారీగా సోలార్ ఉత్పత్తికి సింగరేణి ప్రణాళికలు



**అదిలాబాద్, మార్చి 10, పెన్ పవర్:**
పర్యావరణహిత గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా సింగరేణి సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. కార్మికుల నివాస గృహాలపై రూఫ్ టాప్ సౌర ఫలకాలను ఏర్పాటు చేయాలని డిసైడ్ అయింది. ఈ మేరకు సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. సుమారు రూ. 65 కోట్ల వ్యయంతో 15 వేల కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల సంస్థపై ప్రతి నెలా పడుతున్న రూ. 50–60 కోట్ల విద్యుత్ బిల్లుల భారం కొంత మేర తగ్గనుంది.సింగరేణి సంస్థ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా సింగరేణి ఏరియాల్లోని కార్మికుల నివాస గృహాలపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసి విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం అనువైన నివాస గృహాలను గుర్తించేందుకు ఆరు నెలల క్రితమే సింగరేణి అధికారులు సర్వే నిర్వహించారు. ఎక్కడైతే చెట్లు, నీళ్ల ట్యాంకులు లేకుండా ఖాళీగా నివాస గృహాలు ఉన్నాయో..వాటిపై ఈ ప్యానళ్లు ఏర్పాటు చేసి సోలార్ విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా సింగరేణి యాజమాన్యం గతేడాది డిసెంబర్‌లో ఓ సంస్థతో అగ్రిమెంట్ సైతం కుదుర్చుకుంది. పదేళ్లపాటు ఈసంస్థనే కార్మికుల ఇళ్లపై సోలార్ నిర్వహణ బాధ్యత చేపట్టనుంది.సింగరేణి క్వార్టర్లలో కార్మికుల గృహ విద్యుత్తు వినియోగానికి ప్రస్తుతం నెలకు సుమారుగా రూ.50 నుంచి 60 కోట్ల మేర చెల్లిస్తోంది. రూఫ్ టాప్ సౌర విద్యుత్తుతో సింగరేణికి ఆ భారం చాలా వరకు తగ్గనుంది. అన్ని ఏరియాల వ్యాప్తంగా 15 వేల కిలోవాట్ల మేర సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయాలని సంస్థ టార్గెట్‌గా పెట్టుకుంది. ఇందు కోసం రూ.65 కోట్ల ఖర్చుచేయనుంది. ఉద్యోగుల గృహాలకు వినియోగించగా మిగిలిన మొత్తాన్ని గ్రిడ్‌కి అనుసంధానించనున్నారు. ఈ మేరకు 800 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తే లక్ష్యంగా ఇప్పటికే పలు ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఈప్లాంట్ల ద్వారా ప్రస్తుతానికి 500 మెగావాట్ల వరకు లక్ష్యాన్ని సాధించింది. రూఫ్‌టాప్ సౌర విద్యుత్తు పనులు త్వరలో ప్రారంభం అవుతాయని మణుగూరు వర్క్‌షాపు డీజీఎం శ్రీకాంత్ తెలిపారు. సౌర ఫలకలు ఏర్పాటుచేసేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామని అన్నారు.కాగా, సింగరేణి సంస్థ చేపట్టిన ఈ రూఫ్ టాప్ సౌర విద్యుత్ ప్రాజెక్టు వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.

ప్రధానంగా.. ప్రతి నెలా కార్మికుల గృహ విద్యుత్ వినియోగం కోసం సంస్థ వెచ్చిస్తున్న రూ. 50 నుంచి 60 కోట్ల భారం గణనీయంగా తగ్గుతుందని చెబుతున్నారు. 15 వేల కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా సంస్థకు దీర్ఘకాలికంగా ఆర్థిక పొదుపు చేకూరుతుందని అంటున్నారు. పర్యావరణ పరంగా చూస్తే.. బొగ్గు ఆధారిత విద్యుత్తుపై ఆధారపడటం తగ్గి, కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని..ఇది గ్రీన్ ఎనర్జీ లక్ష్యానికి దోహదపడుతుందని వెల్లడిస్తున్నారు. గృహ అవసరాలకు పోగా మిగిలిన విద్యుత్తును గ్రిడ్‌కు అనుసంధానించడం ద్వారా అదనపు శక్తి వనరుగా మారుతుందని చెబుతున్నారు. ఇది సంస్థ ఆర్థికాభివృద్ధికే కాకుండా.. సింగరేణిని పర్యావరణ హితమైన తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తుందని అంటున్నారు.

## చెన్నారం గ్రామంలో పారిశుద్ధ పనులు ముమ్మరం

**భద్రాచలం, మార్చి 10 పెన్ పవర్:** నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామంలో కార్తీక పనుల నిర్వహణలో భాగంగా అంగన్వాడి టీచర్లు, గ్రామ సర్పంచ్ కలిసి స్థానిక ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ ఆసుపత్రి, అంగన్వాడి స్కూళ్లలో పారిశుద్ధ పనులను మంగళవారం పర్యవేక్షించారు. గ్రామం అభివృద్ధి చెందాలంటే వీధులు శుభ్రంగా ఉంచుకోవాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామంలో రోడ్ల వెంబడి చెత్తాచెదారం, మురికి నీరు నిలవకుండా చూడాలని, రాబోయే గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

## ఖమ్మంలో కవిత తో సహా 43 మందిపై కేసు నమోదు

**అశ్వారావుపేట, మార్చి 10 పెన్ పవర్:** ఖమ్మం వెలుగుమట్ల భూ బాధితుల ధర్నాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై కల్వకుంట్ల కవిత, విశారధన్ మహారాజ్ తో సహా 43 మందిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. అంబేడ్కర్ భవన్ ఆవరణలో భూ యజమానులను ఆందోళనకు పురికొల్పారనే ఆరోపణలతో ఈ చర్యలు తీసుకున్నట్లు టౌన్ ఏసీపీ రమణమూర్తి తెలిపారు. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

## పారిశుద్ధ పనులుచే పట్టిన సర్పంచ్



**పినపాక, మార్చి 10 పెన్ పవర్:** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలో మంగళవారం నాడు స్థానిక శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద పేరుకుపోయిన మట్టిని సర్పంచ్ స్వయంగా పారపట్టి తొలగించారు. ప్రజాపాలనలో భాగంగా చేపట్టిన ఈ పారిశుద్ధ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో పరిశుభ్రతను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

## రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని

**జనగామ, మార్చి 10 పెన్ పవర్:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 48, 49 డివిజన్‌లలో జరుగుతున్న శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక నాయకులు, భక్తులతో కలిసి ఆయన ఆలయ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి సీడీఎఫ్ నిధుల నుండి రూ. 10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ఆయన తెలిపారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి..




**పాలకుర్తి, మార్చి 10 పెన్ పవర్:** నర్సంపేట నియోజకవర్గం గీసుగొండ మండలం రెడ్డిపాలెం గ్రామంలోని విద్యా నిలయ స్కూల్‌లో మంగళవారం బాలల భద్రత మరియు మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం జరిగింది. హైదరాబాద్ నార్కోటిక్స్ విభాగం డీఎస్పీ రమేష్ ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటివల్ల ఆరోగ్యం, భవిష్యత్తు నాశనమవుతాయని సూచించారు. బాలల భద్రతపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంఈఓ, గీసుగొండ సీఐ విశ్వేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## వరంగల్ జిల్లాకు 100 ఈ-బస్‌లను మంజూరు చేసిన కేంద్రం

**స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 10 పెన్ పవర్:** వరంగల్ జిల్లాలోని ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రధానమంత్రి ఈ–బస్ సేవ పథకం కింద తెలంగాణకు ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించింది. వరంగల్‌కు 100 విద్యుత్తు బస్సులు మంజూరు చేసినట్లు కేంద్రమంత్రి టోకన్ సాహు వెల్లడించారు. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు బదులిచ్చారు. ఈ–బస్‌లకు అనుబంధమైన మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ప్రతిపాదనలూ అందలేదని మంత్రి సాహూ తెలిపారు.

### పదో తరగతిలో 100% ఫలితాలు సాధించాలి

**సంగారెడ్డి, మార్చి 10 పెన్ పవర్:** జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు మంగళవారం సంగాడిలోని కార్యాలయంలో ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. పదవ తరగతిలో బంధ శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రత్యేక పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా వారిని పరీక్షలకు సిద్ధం చేయాలని తెలిపారు.

### ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షునిగా అవకాశం కల్పించాలి

**ఆందోల్, మార్చి 10 పెన్ పవర్:** సంగారెడ్డిలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో మంగళవారం, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్ష పదవికి తనకు అవకాశం కల్పించాలని కోరుతూ ఒక నాయకుడు మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. తాను గెలిపిస్తే సంక్షేమానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# అమృత్ 2. 0 పథకం నిర్మాణ పనులను పూర్తి చేయాలి



**బెల్లంపల్లి, మార్చి 10 పెన్ పవర్:** మంగళవారం, బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అమృత్ 2.0 పథకం నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ చంద్రయ్య పరిశీలించారు. మునిసిపల్ చైర్ పర్సన్స్ స్వాతితో కలిసి వాటర్ ట్యాంక్, ఇతర నిర్మాణ పనులను ఆయన సమీక్షించారు. పనులు పూర్తయ్యే వరకు వేసవిలో అడా ప్రాజెక్టు ద్వారా సక్రమంగా నీటిని విడుదల చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## బైకు అదుపుతప్పి సింగరేణి రిటైర్డ్ కార్మికుడు మృతి

**చెన్నూరు, మార్చి 10 పెన్ పవర్:** మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి రిటైర్డ్ కార్మికుడు బర్ల శంకర్ (64) మృతి చెందారు. నెన్నెల గ్రామానికి చెందిన శంకర్, తన భార్య రాజేశ్వరితో కలిసి బైక్ పై మంచిర్యాల నుంచి నెన్నెల వైపు వెళుతుండగా, మందమర్రి టోల్ ప్లాజా వద్ద బైకు అదుపుతప్పి రైలింగ్ ను ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో గాయపడిన రాజేశ్వరిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## రెండు ట్యాంకర్లు ఢీ: డ్రైవర్ మృతి

**మంచిర్యాల, మార్చి 10 పెన్ పవర్:** సిసిసి టౌన్షిప్ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వాటర్ ట్యాంకర్ ను అతివేగంగా వచ్చిన ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో డ్రైవర్ అర్జున్ (35) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో వాటర్ ట్యాంకర్ డ్రైవర్ కు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై ప్రశాంత్ ఈ వివరాలను తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు వాటర్ ట్యాంకర్ డ్రైవర్ నెమ్మదిగా వెళుతుండగా, వెనుక నుంచి వచ్చిన ఆయిల్ ట్యాంకర్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. డ్రైవర్ వాహనంలోనే ఇరుక్కుపోయి మరణించారు.

## సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి వేడుకలు

**సిర్పూర్, మార్చి 10 పెన్ పవర్:** సిర్పూర్ తాలూకాలోని చింతలమానేపల్లి మండలం డబ్బా బారేగుడ గ్రామంలో మంగళవారం సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డబ్బా ఎక్స్‌రోడ్ వద్ద మహాత్మా జ్యోతిరావ్ పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు కూడా పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా, మహాత్మా జ్యోతిరావ్ పూలే, సావిత్రిబాయి పూలే, డా. బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయుల ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని, మాలీ సమాజ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

## ఆసిఫాబాద్‌లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

**ఆసిఫాబాద్, మార్చి 10 పెన్ పవర్:** ఆసిఫాబాద్ పురపాలక సంఘం పరిధిలో ప్రజా పాలన?ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం చిల్డ్రన్ పార్క్‌లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. పార్క్ పరిసరాలను శుభ్రపరిచి, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, వార్డు సభ్యులు, మున్సిపల్ కమిషనర్, సిబ్బంది పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో బాధ్యతగా వ్యవహరించాలని, పరిశుభ్రతతో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని సూచించారు.

## తాటిపల్లిలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రతిష్టాపన మహోత్సవాలు

**జగిత్యాల, మార్చి 10 పెన్ పవర్:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపల్లి గ్రామంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రతిష్టాపన కార్యక్రమం ఈ నెల 12వ తేదీ నుండి 15వ తేదీ వరకు జరుగుతుంది. 12న స్వామి వారి విగ్రహ ఊరేగింపు, 13న నామస్మరణ పతాకవిష్కరణ, 14న ప్రధాన కళశ మంటప పూజలు, పంచామృత అభిషేకం, 15న శ్రీ హరి మౌనస్వామి చే విగ్రహ ప్రతిష్టాపన జరుగుతుంది. అదే రోజున 27 కుండములు, 108 జంటలచే విష్ణు సహస్రనామా హవనం, అన్న ప్రసాద కార్యక్రమం ఉంటాయి.

## దళిత బంధు సమితి సభ్యుల ముందస్తు అరెస్ట్

**కోరుట్ల, మార్చి 10 పెన్ పవర్:** హుజురాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పర్యటన నేపథ్యంలో, రెండో విడత దళిత బంధు నిధులు మంజూరు చేయాలని నిరసన తెలిపే అవకాశం ఉందని భావించిన పోలీసులు, దళిత బంధు సాధన సమితి సభ్యులైన చంద్రమౌళి, రాకేష్‌లను ముందస్తుగా అరెస్టు చేశారు. దళిత బంధు నిధులు ఇవ్వకుండా అరెస్టులు చేయడం సరికాదని సమితి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటన మంత్రి పర్యటన నేపథ్యంలో కలకలం రేపింది.

## వరుకోలు గ్రామంలో పశువులకు ఉచిత గాలికుంటు టీకాలు

**పెద్దపల్లి, మార్చి 10 పెన్ పవర్:** సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని వరుకోలు గ్రామంలోని కరీంనగర్ డైరీ పాల కేంద్రం వద్ద మంగళవారం పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం ప్రారంభమైంది. కోహెడ పశువైద్యాధికారి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని, ప్రభుత్వం అందించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల కేంద్రం చైర్మన్ మడుపు శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు, వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధే లక్ష్యం:

**రామగుండం, మార్చి 10 పెన్ పవర్:** రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రజా సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి పనులను ప్రజల భాగస్వామ్యంతో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యమని తెలిపారు. మంగళవారం ప్రజా పాలన? ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా 8వ కాలనీ, 15, 19 డివిజన్లలో ఆయన ప్రజలతో నేరుగా మాట్లాడి తాగునీరు, మౌలిక వసతులు, డ్రైనేజీ, రహదారుల వంటి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో చర్చించారు.

## ఎన్నికలు నిర్వహించాల్సిందే!

**మంథని, మార్చి 10 పెన్ పవర్:** సింగరేణిలో తమకు సమాన హోదా కల్పించాలని ప్రతిపక్ష సంఘాలు యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తున్నాయి. సంస్థలో గుర్తింపు సంఘం రెండేళ్ల కాలపరిమితి ముగిసిందని, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని పట్టుబడుతున్నాయి. చివరిసారిగా 2023 డిసెంబర్ 27న జరిగిన ఎన్నికల్లో ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా, ఐఎన్టీయూసీ ప్రాతినిధ్య సంఘంగా ఎన్నికయ్యాయి. ఎన్నికలకు ముందు కాలపరిమితిపై అభిప్రాయాలు కోరగా, సీఐటీయూ రెండేళ్లు, మిగతా సంఘాలు నాలుగేళ్లు ఉండాలని సూచించాయి. ఎన్నికల అనంతరం కార్మిక శాఖ రెండేళ్ల కాలపరిమితితో పత్రాలు అందజేయగా, నాలుగేళ్ల కాలపరిమితితో ఎన్నికలు నిర్వహించి రెండేళ్లకు ఇవ్వడాన్ని గెలిచిన సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

# ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇల్లంతకుంటలో పరిశుభ్రత కార్యక్రమం



**ధర్మపురి, మార్చి 10 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా మానకొండూర్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండల కేంద్రంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ? ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ ఓ.రాజు ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమం జరిగింది. శాసన సభ్యులు డా.కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు ప్రధాన రహదారులను, మురికి కాలువలను శుభ్రపరిచి, బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, నాయకులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

కోర్టు పబ్లికేషన్ యాడ్స్

కేవలం

యాడ్ 500/-

'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


# పాండిత్యానికి ప్రతిరూపం రాజన్న శాస్త్రి

**హైదరాబాద్, మార్చి 10, పెన్ పవర్ :** నిరంతర పఠన మందే మనసును లగ్నం చేసి, సిద్ధి పొందిన సాహితీ తాపసి కొరిడె రాజన్న శాస్త్రి. కావ్య వ్యాఖ్యల్లో మల్లినాథసూరి వలె, శాస్త్ర వ్యాఖ్యలలో అభినవ గుప్తుని వలె, శ్లేష రచనలో శ్రీహర్షుని వలె, కమనీయ కవితలో కాళిదాసు వలె వచన రచనలో దండి వలె, ప్రసంగాలలో కవిసామ్రాట్ వలె భాసించిన బహుముఖ ప్రజ్ఞాశాలి రాజన్న శాస్త్రి. వేద వేదాంగ శాస్త్ర ఆగమ సకల కళలకు కాణాచి అయిన ధర్మపురి క్షేత్రంలో 1933 జూన్ 2న జన్మించిన శాస్త్రి, ఇంటి వద్ద వేద సంస్కృత అధ్యయనాలు చేసి, మహారాష్ట్ర, గుజరాత్, ఇతర ప్రాంతాలలో లబ్ద ప్రతిష్టులైన తాడూరి బాలకృష్ణ శాస్త్రి వద్ద కావ్య పాఠాలు, పాలెపు వేంకటరాయ శాస్త్రి చెంత, అద్వైత పూర్వ మీమాంసాదులను అభ్యసించారు. సంస్కృతాంధ్రాలలో ప్రైవేటుగా పరీక్షలు రాసి ఉపాధ్యాయ, అధ్యాపక స్థాయి నుండి, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్య స్థాయికి, స్వయం కృషితో చేరుకున్నారు. మనోహర కవితాధారలను స్రవించడమే కాకుండా, అమర భాషలు శ్లేషలో రెండర్థాలతో "బలి పుష్ట విలసితం"అనే పేరుతో కాకి, రాజకీయ నేతక్షుద్రవ్యంలో సమానులే అనే భావం ప్రకటితమ య్యేలా, ఆయన ద్వర్థి లఘు రచన సమస్త భారతావనిలో అభిమాన పాత్రతకు కారణమైంది. అలాగే , "గణనాయక స్తవం" పేరుతో రచన... పైకి గణపతి ప్రార్థన, తరచి చూడ, లోన నాయకుల ప్రస్తావన ఇమిడించుకుంది. "మధుపవి గీతి" లో తేనెను త్రాగుతున్న తుమ్మెదను వర్ణిస్తూ త్రాగుబోతు దుశ్చర్యలను శ్లేషార్థంతో విరచించారు. హరిహర స్తుతి మరో శ్లేష కావ్యం. చలన చిత్రాలు కళ, విజ్ఞానం అందించాల్సిన సాధనాలుగా ఉండాలని, కానీ అది హింస, అశ్లీలతతో కూడి ఉంటున్నాయని ఆవేదన భరిత సామాజిక బాధ్యతలు వ్యక్తీకరించారు. అలంకార శాస్త్ర గ్రంథం పరిష్కారమే కాకుండా, అల్లసాని పెద్దనామాత్యుని "మను చరిత్ర" లోని ధ్వని సిద్ధాంత అనువర్తనాన్ని పరిశోధన గ్రంథ రూపంలో వెలువరించి, ప్రతిభను చాటి చెప్పి, డాక్టరేట్ పొందారు. చిన్నయసూరి బాల వ్యాకరణానికి వ్యాఖ్యానం రాశారు. మరో రచన తారావళి గ్రంథం పండితామోదం పొంది, దివంగత ప్రధాని పీ.వీ.నరసింహా రావు ద్వారా సన్మానితుల చేసింది. దివాకర్ల సాహితి ట్రస్టు నుండి పురస్కార గ్రహీతలు అయినారు. స్వర్ణ భారతి పురస్కారం లభించింది. హైదరాబాద్ సంస్కృత భాషా ప్రచార సమితికి "వైస్ ఛాన్సలర్" గా పనిచేసి సంస్కృత భాషామ తల్లికి నీరాజనాలు అందించే కృషి జరిపారు. దివాకర్ల పండిత మండలిలో "భువన విజయం' భారతా వరణం, శ్రీనాధ కనకాభిషేకాది రూపకాలలో విభిన్న పాత్రలు ధరించి జీవం పోశారు. తాము పుట్టువు నొంది, పెరిగిన ధర్మపురి క్షేత్రం శ్రీ లక్ష్మి నరసింహుని సుప్రభాత శ్లోకాలు, నిత్య ఉషోదయ ప్రతిధ్వనులుగా, కొనసాగుతూ వస్తున్నాయి. భర్తృహరి శతక త్రయంకు సంబంధించి చతుర్థ శతకం పేరున, 1987 లో "ఓరియంటల్ కాన్ఫరెన్స్" లో నూతన ఆవిష్కరణలు గావించి, విశేషాలను వివరించారు. "వసుమతీ వసుధాకరం" పేరుతో రాసిన సంస్కృత నాటకం, నాలుగు దశాబ్దాల నాటి సంస్కరణలపై వెలుగొంది ఆకాశవాణి కేంద్రం ద్వారా ప్రసారమై, సంస్కృత భారతిలో ప్రచురితమైంది. "వింశతి శతా బ్దీయ సంస్కృత కావ్యామృతం" లో భారత.దేశ వాసులకు సుపరిచితులైన, 20 మంది మహాకవుల సరసన స్థానాన్ని పొందారు. షోడశ్రీ అనే 16 మంది భారతీయ సంస్కృత కవుల పరిచయంలో, రాజన్న శాస్త్రి కవిత్వం ముద్రితంగా నిలిచింది. "నిబంధ రత్న సముచ్చయము", సరస్వత సుషమం, సూర్యోదయం, సాగరికా, సంవిద్, అమృతలతా, సంస్కృత శోధనా, సంస్కృత భారతి, మధురవాణి లాంటి అనేక పత్రికలలో వచ్చిన తమ రచనలను సంకలనం గావించారు. 3,500 శ్లోకాలతో కూడిన "ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం" క్రీస్తుశకం 930 నాటి, ప్రాచీన తాళపత్ర గ్రంథాల్ని, స్థానికులు పండితులు కశోజ్జల సదాశివ శాస్త్రికి సహకరించి, పరిష్కరించి, దేవస్థానానికి ప్రచురణార్థం అందజేశారు. లక్ష్మి నరసింహ సుప్రభాతం, ప్రపత్తి, కాళేశ్వర స్తుతి, హరిహర స్తుతి లాంటి దేవత స్తుతులతో తమ కవిత మాధుర్యాన్ని రంగరించారు. తమ పాండిత్య ప్రతిభతో యావత్ దేశానికి బహుముఖీన సాహిత్య సేవలందించి, తెలంగాణ పూర్వ పండిత సంప్రదాయ వారసునిగా, ప్రతినిధిగా నిలిచిన కొరిడె రాజన్న శాస్త్రి, 2013 మార్చి 11న పాంచభౌతిక శరీరాన్ని త్యజించి, పర బ్రహ్మలీనులైనారు.

# గవర్నర్ మార్పు... అధికారమే లక్ష్యం

**హైదరాబాద్, మార్చి 10, పెన్ పవర్:**
తెలంగాణ రాజ్‌భవన్‌లో సీన్ మళ్లీ మొదటికి వచ్చిందా? 'నిశ్శబ్దంగా' ఉన్న గవర్నర్ స్థానంలోకి 'చురుకైన' కొత్త గవర్నర్ రావడంతో ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ ఏదో ఒక పెద్ద సంచలనమేరాబోతోందని అర్థమవుతోంది..తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశాంతంగా అందరితో కలిసిపోయి కాలం గడిపేస్తుంటే ఉన్నట్టుండి ఆయనను మహారాష్ట్రకు మార్చడం, హిమాచల్ ప్రదేశ్ నుంచి శివ ప్రతాప్ శుక్లాను తీసుకురావడం చూస్తుంటేడ ఇది కేవలం అడ్మినిస్ట్రేటివ్ మార్పునా లేక 2028 అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ వేసిన మాస్టర్ ప్లానా? అని రాజకీయ విశ్లేషకులు ముక్కున వేలేసుకుంటున్నారు.యూపీ రాజకీయాల్లోఆరితేరిన శివ ప్రతాప్ శుక్లా గారు రాకతో ఇక రాజ్ భవన్ 'రిమోట్' ఎక్కడి నుంచి పనిచేస్తుందోననే ఆందోళన కాంగ్రెస్ వర్గాల్లో కనిపిస్తోంది.అసలు అసలైన 'ట్విస్ట్' ఇక్కడే ఉంది. మన టీజేఎస్ అధినేత కోదండరాం
ఎమ్మెల్సీ సీటు దశాబ్దాల కాలక్షేపంలా మారితే ఇప్పుడు మంత్రి అజారుద్దీన్ కూడా ఆ 'త్రిశంకు స్వర్గంలో' చిక్కుకున్నారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక 6 నెలల్లోపు సభ్యత్వం ఉండాలి. సమయందగ్గరపడుతోంది. క్యాబినెట్ పంపిన ఫైల్ ఇప్పుడు కొత్త గవర్నర్ టేబుల్ మీదకు వెళ్తుంది. ఆయన ఆ ఫైల్‌ను స్వీకరిస్తారా లేక "ఇది సెట్ అవ్వదు" అని పక్కన పెడతారా? సుప్రీంకోర్టు తీర్పుల దాకా ఎందుకు? 'రాజ్ భవన్ కోర్టు'లో
ఏం జరుగుతుందన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న.ఇప్పటిదాకా "రాజకీయంగా విరోధం.. పాలనాపరంగా మైత్రి" అని రేవంత్ సర్కార్ సాఫీగా నడిపిస్తోంది. కానీ, కొత్త గవర్నర్ రాకతో ఆ
'మైత్రి' కూడా ఎండమావిలా మాయమవుతుందేమోనన్న భయం అధికార పక్షాన్ని వెంటాడుతోంది. మొత్తానికి గవర్నర్ వ్యవస్థ ఇప్పుడు తెలంగాణలో మళ్లీ ఒక 'కీలక రాజకీయ అస్త్రం'గా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

# సంక్షేమ పథకాలకే 56 వేల కోట్లు




**హైదరాబాద్, మార్చి 10, పెన్ పవర్:**
తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు కేవలం అంకెల గారడీగా కాకుండా, అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ రణక్షేత్రంగా మారబోతున్నాయి. ఒకవైపు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శ్వేతపత్రం డిమాండ్‌తో సర్కారును కార్నర్ చేస్తుంటే, మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ప్రభుత్వ అప్పుల చిట్టాను విప్పుతూ ఎదురుదాడికి దిగుతున్నారు. సుమారు 3 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు కసరత్తు జరుగుతున్న వేళ, రాష్ట్ర ఖజానా అసలు స్థితిగతులపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సంక్షేమం స అభివృద్ధి మధ్య సమతూకం పాటించడం ఇప్పుడు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు కత్తిమీద సాములా మారింది.రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అప్పుల ఊబి వేధిస్తోంది. గత పదేళ్లలో అప్పులు రూ.7.5 లక్షల కోట్లకు చేరాయని ముఖ్యమంత్రి ఆరోపిస్తుండగా, అధికారిక లెక్కలు భిన్నంగా ఉన్నాయి. అయితే, ఏ లెక్క చూసినా నెలకు వేల కోట్ల రూపాయలు కేవలం వడ్డీల చెల్లింపులకే వెచ్చించాల్సి వస్తోంది. ఈ డెట్ ట్రాప్ నుంచి బయటపడి, కొత్త ప్రాజెక్టులకు నిధులు మళ్లించడం ప్రభుత్వానికి అతిపెద్ద సవాలు. అప్పు తెచ్చి పప్పు కూడు అన్నట్లుగా కాకుండా, ఆదాయ వనరులను పెంచుకోవడమే ఏకైక మార్గమని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ఆరు గ్యారంటీలు బడ్జెట్‌లో సింహభాగాన్ని ఆక్రమించనున్నాయి. రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి వంటి పథకాల అమలుకు ఏటా రూ. 56,000 కోట్ల పైచిలుకు నిధులు అవసరమని అంచనా. ఎన్నికల వాగ్దానాలను నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఉన్న ప్రభుత్వం, ఈ నిధుల కోసం ఇతర శాఖల కేటాయింపుల్లో కోత విధిస్తుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తూనే, మౌలిక సదుపాయాలను విస్మరించకూడదనే ఒత్తిడి సర్కారుపై ఉంది.రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడి వ్యయం విషయంలో ప్రభుత్వం కొంత వెనుకబడి ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బడ్జెట్‌లో రూ. 36,000 కోట్లు కేటాయించినా, క్షేత్రస్థాయిలో ఖర్చు ఎంత అన్నదే కీలకం. జీతాలు, పెన్షన్లు వంటి రెవెన్యూ వ్యయంభారంగా మారుతున్న తరుణంలో, సాగునీటి ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం వంటి ఆస్తుల సృష్టికి నిధులు తగ్గిస్తే దీర్ఘకాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంది. సంక్షేమంతో పాటు సంపద సృష్టిని కూడా సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం నెరవేరాలంటే, ఆదాయ మార్గాలను గణనీయంగా పెంచుకోవాలి. అటవీ, ఎక్సైజ్, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయంతో పాటు కేంద్రం నుంచి రావాల్సిన పన్నుల వాటా, గ్రాంట్లపై రాష్ట్రం ఆశలు
పెట్టుకుంది. కేంద్రంతో సఖ్యతగా ఉంటూనే నిధులు రాబట్టుకోవడం రాజకీయం గానూ, ఆర్థికంగానూ ఇప్పుడు అనివార్యం. ఈ బడ్జెట్ సమావేశాలు తెలంగాణ ఆర్థిక దిశను నిర్దేశించనున్నాయి. కిషన్ రెడ్డి డిమాండ్ చేసినట్లుగా ప్రభుత్వం పారదర్శకంగా వివరాలు వెల్లడిస్తుందా? లేక రాజకీయ ఆరోపణలకే పరిమితమవుతుందా అన్నది చూడాలి. సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచుతూనే, ఆర్థిక క్రమశిక్షణను పాటించడమే రేవంత్ సర్కార్ ముందున్న అసలైన పరీక్ష.

# ఇది ఏపీ పోలీసు రివేంజ్? బిహార్ లో దెబ్బకు రిటర్న్ గిఫ్ట్?



**హైదరాబాద్ పెన్ పవర్:** డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో బిహార్ కేడర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ విచారణపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. హైకోర్టు సూచనల ప్రకారం సునీల్ నాయక్ ను గత ఐదు రోజులుగా విజయనగరం ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలోని ప్రత్యేక పోలీసు అధికారుల బృందం విచారిస్తోంది. అంతేకాకుండా విచారణను మరో మూడు రోజులు పొడిగించింది. దీంతో బిహార్ లో ఎదురైన అవమానానికి రివేంజ్ తీర్చుకునేలా, రిటర్న్ గిఫ్ట్ ఇచ్చేలా సిట్ పోలీసులు సునీల్ నాయక్ విచారణను కొనసాగిస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. బిహార్ లో సునీల్ నాయక్ ను అరెస్టు చేసేందుకు వెళ్లిన ఏపీ పోలీసు బృందానికి అక్కడ హోంగార్డులు ఇబ్బందులు సృష్టించారని, ఘర్షణ వైఖరి అవలంబించి కస్టడీలో ఉన్న సునీల్ నాయక్ ను తమతో తీసుకువెళ్లిపోయారని చెబుతున్నారు. అంతేకాకుండా ఓ మహిళా అధికారి ఇష్టానుసారం తిట్టారన్న ప్రచారం జరిగింది. దీనిపై రివేంజ్ తీర్చుకునేలా ప్రస్తుతం సునీల్ నాయక్ విచారణ కొనసాగుతోందా? అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. పోలీసు విచారణను పరిశీలిస్తే గతంలో సిట్ అధికారులు ఎదుర్కొన్న పరాభవానికి ఇప్పుడు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చేలా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సునీల్ నాయక్ ను అరెస్టు చేయాలనే పట్టుదల పోలీసు అధికారుల్లో కనిపిస్తోందని, అందుకే బెయిలు తీర్పు వచ్చే వరకు విచారణను పొడిగిస్తూ వస్తున్నారని న్యాయవాద వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. రఘురామరాజు అరెస్టు సమయంలో సునీల్ నాయక్ డీఐజీగా ఉన్నారు. అప్పట్లో ఏం జరిగింది? సునీల్ నాయక్ కు ఏం తెలుసు అన్న విషయాలపై సుదీర్ఘంగా విచారణ జరుగుతోంది. అయితే ఇదే కేసులో నిందితుడు అయిన మరో సీనియర్ అధికారి పీ.వీ.సునీల్ కుమార్ ను కేవలం ఒక రోజు, అది కూడా కేవలం నాలుగు గంటల పాటు విచారించి వదిలేశారని గుర్తు చేస్తున్నారు. కానీ ఐపీఎస్ సునీల్ నాయక్ విషయంలో మాత్రం సిట్ పోలీసులు రోజుల తరబడి విచారణ కొనసాగించడమే ఇంట్రెస్టింగు డిస్కషన్ కు తెరతీస్తోంది. ఆయన వ్యవహారశైలిపై ఏపీ పోలీసు అధికారులు గుర్రుగా ఉన్నారని, అందుకే విచారణను సుదీర్ఘంగా కొనసాగిస్తూ తమ చుట్టూ సునీల్ నాయక్ తిరిగేలా చేస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. బిహార్ రాజధాని పట్నాలో సునీల్ నాయక్ ను గతంలో ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. అయితే నిబంధనలను చూపి ట్రాన్సిట్ వారెంట్ జారీ కాకుండా అక్కడి పోలీసులు సునీల్ నాయక్ ను ఏపీ తరలించకుండా అడ్డుకున్నారు. అంతేకాకుండా ఆ సమయంలో ఏపీ పోలీసులపై ఎదురు కేసులు పెట్టడం, ఒకానొక సమయంలో దాడికి ప్రయత్నించినట్లు ప్రచారం జరిగింది. దీనిని స్థానిక కోర్టు దృష్టికి తీసుకువెళ్లిన పోలీసులు సునీల్ నాయక్ ను విచారించేందుకు అనుమతి తీసుకున్నారు. దీంతో ఈ నెల 5వ తేదీ నుంచి ఆయన రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గుంటూరు సీసీఎస్ పోలీసుస్టేషన్ లో విచారణకు హాజరవుతున్నారు. తొలుత 9వ తేదీవరకు సునీల్ నాయక్ విచారణకు కోర్టు అనుమతి ఇచ్చింది. ఆయన విచారణకు సహకరించడం లేదని కోర్టు దృష్టికి తీసుకువెళ్లడంతో మరో మూడు రోజులు సిట్ ఎదుట హాజరు కావాలని కోర్టు సూచించింది. దీంతో ఈ నెల 12వ తేదీ వరకు సునీల్ నాయక్ విచారణ కొనసాగుతుందని చెబుతున్నారు. ఇదంతా పరిశీలిస్తే గతంలో విచారణకు హాజరుకాకపోవడం, బిహార్ లో తమకు సహకరించకపోవడాన్ని సిట్ పోలీసులు సీరియస్ గా తీసుకున్నట్లు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ కారణంగానే సీనియర్ అధికారిని విచారణ పేరుతో రోజూ తమ వద్దకు రప్పించుకుంటున్నారని అంటున్నారు. సునీల్ నాయక్ ముందస్తు బెయిలుపై హైకోర్టు తీర్పు వచ్చేవరకు ఈ పరిస్థితి కొనసాగుతుందని అభిప్రాయపడుతున్నారు. హైకోర్టులో సునీల్ నాయక్ ముందస్తు బెయిలుపై తీర్పు వచ్చిన తర్వాత అరెస్టు చేయాలా? వద్దా? అని నిర్ణయం తీసుకుని విచారణ ముగిస్తారని అంటున్నారు. దీంతో మరో రెండు రోజులు కూడా సునీల్ నాయక్ విచారణ కొనసాగుతుందని, 12వ తేదీన హైకోర్టు ఆదేశాలతో ఈ పరిస్థితిలో మార్పు రావొచ్చని అంటున్నారు.

# పశ్చిమ ప్రకాశం లో వైసీపీ వీక్ అయిందా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీకి భారీ ఓటమి బాధలు ఇంకా తీరలేదా అన్న చర్చ నడుస్తోంది. ఎందుకంటే ఆ పార్టీకి కీలకమైన జిల్లాలలో ఇంకా కోలుకోకపోవడమే అని అంటున్నారు. ఇక జగన్ అంటేనే పశ్చిమ ప్రకాశంగా చెబుతారు. అలాగే పశ్చిమ ప్రకాశం అంటే జగన్ అనే విధంగా అక్కడ రాజకీయం ఉంటుంది. అలాంటి పశ్చిమ ప్రకాశంలో ఇపుడు వైసీపీ రాజకీయాలు భిన్నంగా సాగుతున్నాయని అంటున్నారు. పశ్చిమ ప్రకాశం మార్కాపురం జిల్లాగా మారింది. మొత్తం నాలుగు నియోజకవర్గాలు ఈ జిల్లాలో ఉన్నాయి. ఇక ఇందులో మూడు జనరల్ ఓసీ అయితే ఒకటి ఎస్సీగా ఉంది. అదే ఎర్రగొండపాలెం. ఇక మిగిలినవి చూస్తే మార్కాపురం, గిద్దలూరు, కనిగిరిగా ఉన్నాయి.

**వారిదే డామినేషన్ :**

ఇక చూస్తే పశ్చిమ ప్రకాశంలో రెడ్డి సామాజిక వర్గానిదే డామినేషన్ అంటారు. అంటే జనాభా పరంగా వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. కానీ ఇక్కడ జగన్ అమలు చేస్తున్న స్ట్రాటజీ అయితే ఏ మాత్రం వర్కౌట్ కావడంలేదు అని అంటున్నారు. కనిగిరిలో పూర్తిగా రెడ్లు ఉంటారు. కానీ అక్కడ సీటు యాదవ సామాజిక వర్గానికి జగన్ ఇచ్చారు. టీడీపీ తరఫున రెడ్డి అభ్యర్థి ఉన్నారు. దాంతో సామాజిక వర్గం సమీకరణలతో రెడ్డికే అంతా జై కొట్టారు. అయితే ఇక్కడ యాదవ సామాజిక వర్గం కూడా మూడవ ప్లేస్ లో ఉంది. అయితే ఇక్కడ ఓటర్లలో కానీ మార్కాపురంలో కానీ పూర్తిగా రెడ్లే ఉంటారు. అలాగే అక్కడ వైశ్య సామాజిక వర్గానికి సీటు ఇస్తే టీడీపీ రెడ్లకు ఇచ్చింది. దాంతో అక్కడ కూడా వైసీపీ వ్యూహమేదీ వర్కౌట్ కాలేదని చెబుతారు

**సీన్ మొత్తం అంతే :**

ఇక చూస్తే గిద్దలూరులో నాన్ లోకల్ ని వైసీపీ హైకమాండ్ ఇంచార్జి ఇచ్చారు. కానీ రెడ్డి సామాజిక వర్గమంతా సబ్ క్యాస్ట్ ఆ అభ్యర్థికి లేవు. కానీ అక్కడ అంతా సబ్ క్యాస్ట్ కే మొదటి ప్రాధాన్యత ఇస్తారు. అలా గిద్దలూర్లో అయితే ఆ పార్టీ ఇంచార్జి అసలు గ్రామ కమిటీలు కూడా వేయలేకపోతున్నారు అన్న విమర్శలు ఉన్నాయి. దాంతో ఇంకా చాలా గ్రామాలు ఖాళీగా ఏ కమిటీలు లేకుండా ఉన్నాయని అంటున్నారు. ఇక ఆయన ఉండేది మార్కాపురంలో గిద్దలూరుకి చుట్టపు చూపుగా వస్తూ పోతూ ఉన్నారు అంటున్నారు. దాంతో గిద్దలూరులోని వైసీపీ క్యాడర్ అయితే ఇంచార్జిని నమ్మడం లేదని అంటున్నారు. దాంతో ఆయనకే 2029లో టికెట్ వస్తుందా లేదా అన్నది కూడా చాలా మంది అనుకుంటున్న నేపథ్యం ఉంది.

**పార్టీలోనే వ్యతిరేకత :**

ఇక మార్కాపురంలో అయితే ఇంచార్జికి గ్రామంలో ఉన్న రెడ్డి సామాజిక వర్గం నాయకులకు అసలు సపోర్టు చేయడం లేదని అంటున్నారు. ఎందుకంటే గతంలో ఆ ఇంచార్జికి అక్కడి రెడ్డి సామాజిక వర్గం నేతలకు పడడం లేదని భావించే గిద్దలూరు నుంచి వచ్చి మార్కాపురంలో పోటీ చేశారు అని గుర్తు చేస్తున్నారు. అయితే అక్కడ మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు. వారి వర్గం కూడా బలంగా ఉంది. అందుకే ఆయనకు మద్దతు ఇవ్వవద్దని అని బహిరంగానే వైసీపీ నేతలు చెబుతున్నారని టాక్ నడుస్తోంది. దాంతో అక్కడ కూడా చాలా ఇబ్బందిగా ఉంది అని అంటున్నారు.

**కనిగిరిలోనూ ఇబ్బందిగానే :**

ఇక కనిగిరి నియోజకవర్గంలో అయితే గతంలో ఎమ్మెల్యేగా ఉన్న వారి వర్గీయులు ప్రస్తుతం ఇంచార్జికి ఏ మాత్రం మద్దతు ఇవ్వడం లేదు, పైగా బాహాటంగా వ్యతిరేకిస్తున్నారు. ఇంచార్జి తీరు పట్ల అక్కడ రెడ్డి సామాజిక వర్గం గుర్రుగా ఉనంటున్నారు అని చెబుతున్నారు. ఇక కనిగిరి ఇంచార్జికి డబ్బులు సమస్యగా ఉంది అని అంటున్నారు. ఇదే విషయం పెద్ద ఎత్తున డిస్కషన్ గా ఉంది. కనిగిరి ఒక్కటే కాదు మార్కాపురం, గిద్దలూరు ఇంచార్జిలు కూడా డబ్బులు తీయడం లేదు అని పార్టీలోనే కామెంట్స్ ఉన్నాయి.


**ఈయన ఒక్కడే బెస్ట్ :**

ఇక యెర్రగుండపాలెం ఎస్సీ ఎమ్మెల్యే మాత్రం బెస్ట్ అని అంటున్నారు. ఆయన అందరికీ నియోజకవర్గంలో కలుపుకుని పోతున్నారు అని చెబుతున్నారు. అందరితో మంచి సంబంధాలు నెరుపుతున్నారు అని నియోజకవర్గం క్యాడర్ ఎబుతోంది. ఇక వైసీపీ హైకమాండ్ కి ఆయన మీద మంచి నివేదికలు వెళ్ళాయని అంటున్నారు అలా యెర్రగొండపాలెం ఎమ్మెల్యేకు జగన్ దగ్గర మంచి మార్కులే పడుతున్నాయని అంటున్నారు. దాంతో అతనికి ఏ ఇబ్బంది ఉండదని వచ్చే ఎన్నికల్లో టికెట్ ఖాయమని అంటున్నారు.

**మూడు సీట్లూ ఫోకస్ పెట్టాల్సిందే :**

అయితే కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లలో మూడు అసెంబ్లీ సీట్ల మీద వైసీపీ అధినాయకత్వం ఫోకస్ పెట్టాల్సిందే అని అంటున్నారు. మార్కాపురం, కనిగిరి, గిద్దలూరూ ఈ మూడు సీట్లను బలమైన రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వాలని కోరుతున్నారు ఇంచార్జిలుగా ఉన్న వారు జనంతో ఉండాలని క్యాడర్ ని కలుపుకుని పోవాలని డబ్బులు ఖర్చు పెట్టాలని కోరుతున్నారు. లేకపోతే ఇబ్బంది అవుతుందని అంటున్నారు. ఈ ముగ్గురు ఇంచార్జిల పనితీరు మీద గుర్రుగా ఉన్న క్యాడర్ అయితే వారిని మార్చాలని తామే హైకమాండ్ ని కోరుతామని కూడా అంటున్నట్లుగా ప్రచారం సాగుతోంది. ఈ నియోజకవర్గాలలో కనుక మార్పులు చేసి బలమైన రెడ్లని ఇంచార్జులుగా నియమిస్తే వైసీపీకి తిరుగు ఉండదని అంటున్నారు. దాంతో మార్కాపురం జిల్లాలో నాలుగు అసెంబ్లీ సీట్లను వైసీపీ గెలుచుకుని తీరుతుందని వైసీపీ అంటున్నారు. మరి హై కమాండ్ ఈ విషయంలో ఏ రకమైన నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉంది అని అంతా చర్చిన్ చర్చించుకుంటున్నారు.

# 'బలమైన' హామీ సాకారానికి లోకేష్ భూమి పూజ!




**హైదరాబాద్ పెన్ పవర్:** గత ఎన్నికలకు ముందు మంగళగిరి నియోజకవర్గం ప్రజలకు ఇచ్చిన హామీలను మంత్రి నారా లోకేష్ నెరవేరుస్తున్నారు. తాజాగా గత ఎన్నికల సమయంలో ఇక్కడి నదీతీర ప్రాంతం వాసుల సమస్యలు పరిష్కరించేందుకు రిటైనింగ్ వాల్ నిర్మిస్తామని చెప్పారు. దీనికి సంబంధించి తాజాగా భూమి పూజ చేయడం గమనార్హం. తాడేపల్లి రిటైనింగ్ వాల్‌కు శంకుస్థాపన చేయడంతో స్థానికంగా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఈ రక్షణ గోడ నిర్మాణానికి 294 కోట్ల రూపాయలు ఖర్చుచేయనున్నారు. మంగళగిరి నియోజకవర్గం పరిధిలోని తాడేపల్లిలో ప్రకాశం బ్యారేజీ దిగువన రెండున్నర కిలో మీటర్ల మేరకు కృష్ణా నది కుడివైపున ఈ వరద రక్షణ గోడను నిర్మించనున్నారు. ఇది ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి లోకేష్ పెద్దపీట వేసినట్టు అయింది. దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న ఈ ప్రాజెక్ట్ కు కేవలం ఏడాది కాలంలోనే 294 కోట్ల రూపాయల పరిపాలన అనుమతులు సాధించడమే కాకుండా టెండర్ ప్రక్రియను కూడా పూర్తిచేశారు. భవిష్యత్ లో భారీ వరదలను దృష్టిలో పెట్టుకుని 15 లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని తట్టుకునేలా పటిష్టమైన డిజైన్ తో రిటైనింగ్ వాల్ ను నిర్మించనున్నారు.

**బలమైన కట్టడం!**

కేవలం సాధారణ గోడగా కాకుండా భూమి లోపల 26 నుంచి 38 మీటర్ల లోతు వరకు 1,920 పైల్స్ వేసి, పైల్- రాఫ్ట్ సాంకేతికతతో భూకంపాలను, నీటి ఉధృతిని తట్టుకునేలా నిర్మించనున్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తైతే సుందరయ్య నగర్, మహానాడు కాలనీ వంటి లోతట్టు ప్రాంతాల్లో నివసించే దాదాపు 50 వేల మంది ప్రజలు వరద భయం నుంచి శాశ్వతంగా విముక్తి పొందుతారు. అమరావతి రాజధాని పరిధిలోని కీలక ప్రాంతాలకు, జాతీయ రహదారి-65కు రక్షణగా రిటైనింగ్ వాల్ నిలవనుంది.

# ఇరాన్-ఇజ్రాయిల్ వార్ : ఏపీ ఎగుమతిదారులకు లాస్, ఎలా అంటే?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయల్ కొనసాగిస్తున్న యుద్ధంతో ఏపీ రైతులు కుదేలవుతున్నారు. యుద్ధం కారణంగా పశ్చిమాసియాకు ఎగుమతి కావాల్సిన ఆహారోత్పత్తులపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు చెబుతున్నారు. ఒక్క ఏపీ మాత్రమే కాకుండా తెలంగాణ, హరియాణా, కర్ణాటక, పంజాబ్, మహారాష్ట్రకు చెందిన రైతులు కూడా నష్టపోతున్నారని మార్కెట్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏపీ నుంచి రొయ్యలు, బియ్యం పెద్ద ఎత్తున పశ్చిమాసియాకు ఎగుమతి చేస్తుంటారు. అదేవిధంగా పండ్లు, కూరగాయలు, చేపలు, మాంసం ఉత్పత్తులు సైతం ఆయా రాష్ట్రాల నుంచి ఎగుమతి అవుతుంటాయి. యుద్ధంతో హోర్ముజ్ జలసంధి మూసివేయడంతో పోర్టుల్లో సరుకు పేరుకుపోయిందని అంటున్నారు. మన దేశ మొత్తం వ్యవసాయ ఎగుమతుల్లో ఐదు వంతు పశ్చిమాసియా దేశాలకు వెళుతోందని చెబుతున్నారు. గత ఏడాది పశ్చిమాసియా దేశాలకు భారత్ నుంచి ఒక లక్షా 8 వేల 898 కోట్ల రూపాయల విలువైన వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. ఇందులో దాదాపు 40 వేల కోట్ల రూపాయల విలువైన బియ్యం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ఎగుమతి చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. హర్మోజ్ జలసంధి మూసివేయడంతో ఆ మార్గం గుండా సరుకు రవాణా చేసే నౌకల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో మన దేశంలోని పోర్టుల్లో 4 లక్షల టన్నుల బాస్మతి బియ్యం నిల్వలు పేరుకుపోయినట్లు చెబుతున్నారు. ముఖ్యంగా కొన్ని నౌకలు నడి సంద్రంలో ఉండిపోయాయి. యుద్ధం మరికొంతకాలం కొనసాగితే నౌకల్లో ఉన్న రొయ్యలు, చేపలు, మాంసం ఉత్పత్తులు పాడయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మనం ఉత్పత్తి చేసే బాస్మతి బియ్యం ఎక్కువగా సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్ దేశాలు కొనుగోలు చేస్తున్నాయి. యుద్ధం వల్ల ఆ దేశాలకు బాస్మతి బియ్యం ఎగుమతి సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ప్రత్యామ్నాయ మార్కెట్లకు ఆ సరుకును తరలించే అవకాశం కనిపించడం లేదు. దీంతో స్థానికంగా ధరలు పతనమయ్యే ప్రమాదంతోపాటు రైతులకు కనీసం పంట ఉత్పత్తికి అయ్యే ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యుద్ధం వల్ల మన దేశం నుంచి దుబాయ్, ఇతర అరబ్ దేశాలకు ఎగుమతి అయ్యే పండ్లు, మాంసం ఉత్పత్తులు, గుడ్లు, పాలు వంటి ఎగుమతులు నిలిచిపోయాయని అంటున్నారు. యుద్ధం ప్రారంభం కాకముందు నుంచే ఉద్రిక్తతల కారణంగా ఎగుమతులు 50 శాతం క్షీణించాయి. యుద్ధం మొదలైన తర్వాత ఇవి పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో పండ్లు, గుడ్లు, మాంసం ఉత్పత్తుల ధరలు పతనమయ్యే పరిస్థితి కనిపిస్తోందని ఆందోళన వ్యక్తమవుతోంది.

**రంజాన్ వేళ.. ఎగుమతుల్లో స్తబ్ధత**

మన దేశం నుంచి ఎగుమతి అవుతున్న మాంసం, రొయ్యలు, పండ్లు, కూరగాయలు గల్ఫ్ దేశాలకు నిలిచిపోయాయి. దీంతో ఆయా దేశాల్లో రంజాన్ వేళ స్టాక్ తగ్గిపోయి స్తబ్ధత ఏర్పడిందని అంటున్నారు. రంజాన్ సమయంలో ఇఫ్తార్ విందులో భాగంగా ఎక్కువగా మాంసం, పండ్లు వినియోగిస్తారు. యుద్ధం కారణంగా ముస్లిం దేశాలు అయిన ఓమన్, కువైట్, సౌదీ, దుబాయ్ వంటి దేశాల నుంచి ఆర్డర్లు లేవని, నౌకలు కూడా అటువైపు వెళ్లడం లేదని చెబుతున్నారు. ఇదేసమయంలో పోర్టుల్లో నిలిచిపోయిన నౌకలు డెమరేజ్ చార్జిల భారం తడిపిమోపెడు అవుతోందని ఆవేదన చెందుతున్నారు. దీంతో ఎడాపెడా నష్టాలు ఎదురవుతున్నాయని స్థానికంగా రైతులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# హీరో శివాజీ.. అవసరమా ఈ మాటలు?



**హైదరాబాద్ పెన్ పవర్:** స్క్రిప్ట్ ప్రకారం అయితే ఆయనకు ఇప్పుడు కావాల్సింది మంచి పాత్రలు, హిట్ సినిమాలు... కానీ కెమెరా ముందు నటన కన్నా కెమెరా వెనుక రాజకీయ విమర్శలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లున్నారు నటుడు శివాజీ. సినిమాలో విలన్‌ని ఎదుర్కోవడం ఎంత బాగుంటుందో రాజకీయాల్లోకి వెళ్లకుండానే విలనిజాన్ని ఎంచుకోవడం అంతకంటే రిస్క్ అని ఈయన ఎప్పుడు గుర్తిస్తారో! తెలుగు సినీ పరిశ్రమలో తనదైన శైలి నటనతో సహజమైన డైలాగ్ డెలివరీతో ఒకప్పుడు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు శివాజీ. సుదీర్ఘ విరామం తర్వాత 'బిగ్ బాస్' వంటి కార్యక్రమాల ద్వారా మళ్లీ పాపులర్ అయిన ఆయన ఇప్పుడు సినిమాల్లో కూడా బిజీ అవుతున్నారు. అయితే ఒక నటుడిగా తన రెండో ఇన్నింగ్స్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్న శివాజీ.. ప్రస్తుతం తెరపై కంటే తెర వెనుక రాజకీయ చర్చల వల్లనే ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై ఆయన చేస్తున్న సంచలన వ్యాఖ్యలు, ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఉద్దేశించి ఆయన చేస్తున్న విమర్శలు ఇప్పుడు సినీ, రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీస్తున్నాయి.

**రాజకీయ నిష్పాక్షపాతం.. ఆచరణలో ప్రశ్నార్థకం?**

శివాజీ తాను ఏ రాజకీయ పార్టీకి చెందినవాడిని కాదని.. తనకు ఏ పార్టీతోనూ అంటకాగాల్సిన అవసరం లేదని పదే పదే చెబుతుంటారు. కానీ ఆయన మాటలు మాత్రం పరోక్షంగా ఒక నిర్దిష్ట రాజకీయ పక్షానికి... అంటే తెలుగుదేశం పార్టీకి మద్దతుగా ఉన్నాయనే భావన రాజకీయ పరిశీలకుల్లో బలంగా వ్యక్తమవుతోంది. ఒక నటుడిగా ప్రజా సమస్యల మీద స్పందించడం తప్పు కాదు... కానీ తన మాటలు రాజకీయంగా ఒక పక్షానికి అనుకూలంగా, మరొక పక్షానికి వ్యతిరేకంగా ఉండటం వల్ల ఆయన 'నిష్పాక్షపాతం'పై అనుమానాలు మొదలయ్యాయి. ఒకరిని విమర్శించడం, సవాళ్లు విసరడం వంటివి ఆయన ఇమేజ్‌ను ఒక 'పొలిటికల్ యాక్టివిస్ట్' స్థాయికి తీసుకువెళ్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

**రెండో ఇన్నింగ్స్.. సినిమాలపైనే దృష్టి పెట్టాల్సిన సమయం**

ప్రస్తుతం శివాజీకి నటుడిగా మంచి అవకాశాలు వస్తున్నాయి. క్యారెక్టర్ ఆర్టిస్టుగా, కీలక పాత్రల్లో ఆయన తన ప్రతిభను చాటుకుంటున్నారు. ప్రేక్షకుల్లో కూడా ఆయనపై ఒక సానుకూల దృక్పథం పెరుగుతోంది. ఇలాంటి కీలక తరుణంలో సినిమాలపై, తన నటనపై పూర్తి దృష్టి పెట్టాల్సిన శివాజీ అనవసరమైన రాజకీయ వివాదాల్లో తలదూర్చడం వల్ల కలిగే లాభం ఏమిటనేది ఇప్పుడు ప్రధాన ప్రశ్న. రాజకీయ వ్యాఖ్యల వల్ల ఆయనకు లభించే క్రేజ్ తాత్కాలికం కావచ్చు కానీ ఒక నటుడిగా ఆయనకు వచ్చే గుర్తింపు చిరస్థాయిగా ఉంటుంది. వివాదాలు నటుడిని నటుడిగా కాకుండా ఒక వర్గానికి ప్రతినిధిగా చూసే ప్రమాదం ఉంది. ఇది ఆయన సినీ కెరీర్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని పలువురు సినీ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

**సోషల్ మీడియా హోరు..వాస్తవ పరిస్థితి ఏమిటి?**

నేటి కాలంలో సోషల్ మీడియాలో ఏ చిన్న వ్యాఖ్య చేసినా దానికి అనంతమైన ప్రతిస్పందనలు వస్తుంటాయి. శివాజీ రాజకీయ వ్యాఖ్యలకు సోషల్ మీడియాలో కొన్ని వర్గాల నుంచి భారీ మద్దతు లభిస్తోంది. అయితే ఈ మద్దతు ఇచ్చేది నిజమైన అభిమానులా లేక రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేసే వర్గాలా అన్నది అంతుచిక్కని ప్రశ్న. ఇలా సోషల్ మీడియాలో పరస్పర విమర్శలు, రెచ్చగొట్టుకోవడం వల్ల సామాజికంగా లేదా రాజకీయంగా ఎటువంటి ప్రయోజనం చేకూరదని చివరికి ప్రత్యర్థులకు అనవసరమైన పబ్లిసిటీని కట్టబెట్టడమే అవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**కెరీర్‌పైనే మక్కువ చూపితేనే మంచిది!**

ప్రజాస్వామ్యంలో ప్రతి వ్యక్తికి తమ అభిప్రాయాలను వెల్లడించే హక్కు ఉంది. అయితే ఒక బాధ్యతాయుతమైన నటుడిగా, లక్షలాది మంది అభిమానులు ఉన్న వ్యక్తిగా శివాజీ తన వ్యాఖ్యల వల్ల కలిగే పరిణామాలను ఆలోచించుకోవాలి. రాజకీయాల్లోకి వెళ్లకపోయినా రాజకీయ వ్యాఖ్యలు చేయడం వల్ల వచ్చే వివాదాలు కెరీర్‌ను దెబ్బతీస్తాయి. ఇప్పటికైనా ఆయన రాజకీయ వివాదాలకు దూరంగా ఉండి.. తన నటనతో ప్రేక్షకులను అలరించడంపైనే దృష్టి సారిస్తే బాగుంటుందనేది మెజారిటీ అభిమానుల ఆకాంక్ష. నటుడిగా ఆయనకు ఉన్న సహజమైన ప్రతిభ, ప్రేక్షకుల్లో ఉన్న ఆదరణ ఆయనకు మంచి భవిష్యత్తును అందిస్తాయి. శివాజీ తన కెరీర్ పట్ల మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తారనేది అందరి ఆశ.

*Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965*

# ఇరాన్ ఆయిల్ డిపోలపై ఇజ్రాయెల్ భీకర దాడులు..

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో యుద్ధం రోజు రోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. ఇరాన్‌పై గత రెండు రోజుల నుంచి ఇజ్రాయెల్ దాడులను మరింత ఉద్ధృతం చేసింది. ఈ క్రమంలో ఇజ్రాయెల్ చేసిన ఓ పని అమెరికాను తీవ్ర ఆగ్రహానికి గురిచేసింది.ఇరాన్ చమురు క్షేత్రాలను టార్గెట్ చేయడంపై అగ్రరాజ్యం తీవ్రంగా స్పందించినట్టు అంతర్జాతీయ మీడియా నివేదించింది. దీనిపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్టు వైట్‌హౌస్ అధికారులు అమెరికా మీడియా ఆక్సియోస్ నివేదిక తెలిపింది. ఇరాన్ ఆయిల్ నిల్వ కేంద్రాలపై ఇజ్రాయెల్ దాడుల తీవ్రతను చూసి అమెరికా అధికారులు ఆశ్చర్యపోయారని పేర్కొంది. ఇరాన్- ఇజ్రాయెల్ భీకర దాడులతో పశ్చిమాసియాలో దారుణ పరిస్థితులు నెలకున్నాయి. దాడుల గురించి అమెరికాకు ఇజ్రాయెల్ ముందస్తు సమాచారం ఇచ్చినప్పటికీ ఇంత భారీ స్థాయిలో ఉంటాయని వారు ఊహించలేదని తెలిపింది. అమెరికా సీనియర్ అధికారి ఒకరు ఇజ్రాయెల్ వైఖరిపై 'ఛీఈ' (తీవ్ర అసహనం) అంటూ స్పందించినట్లు తెలుస్తోంది. చమురు కేంద్రాలను టార్గెట్ చేసుకోవడమనే ఆలోచన మంచిది కాదని వ్యాఖ్యానించినట్టు సమాచారం. ఫిబ్రవరి 28 యుద్ధం మొదలైన తర్వాత ఇజ్రాయెల్ తీరుపై అమెరికా ఈస్థాయిలో అసహనం వ్యక్తం చేయడం ఇదే మొదటిసారి. ఇరాన్ చమురు నిల్వ కేంద్రాలపై ఇజ్రాయెల్ క్షిపణి దాడుల్లో నలుగురు ప్రాణాలు కోల్పోగా.. చాలా మంది గాయపడ్డారు. ఈ దాడుల విషయంలో అధ్యక్షుడు సంతోషంగా లేరని ట్రంప్ సలహాదారులు వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ వైఖరి అధినేతను తీవ్ర ఆగ్రహానికి గురిచేసిందని చెప్పారు. 'ఈ స్థాయి దాడులు అధ్యక్షుడికి నచ్చలేదు. ఆయన చమురు వనరులను కాపాడాలని అనుకుంటున్నారు. నాశనం చేయాలని కాదు.. ఇటువంటి చర్యలు చమురు ధరలు పెరుగుదలకు కారణమవుతాయి' అని ట్రంప్ సలహాదారు ఒకరు వ్యాఖ్యానించారు. చమురు క్షేత్రాలపై ఇజ్రాయెల్ దాడులతో ఇరాన్‌లోని సామాన్యులు ఇబ్బందులకు గురవుతారని వైట్‌హౌస్ అధికారి అభిప్రాయపడ్డారు. ఇది వ్యూహాత్మకంగా 'సరైన ఆలోచన కాదు' కాదని.. దీనివల్ల ఇరాన్ పౌరులు తమపై వ్యతిరేకత పెంచుకునే ప్రమాదం ఉంది' అని అమెరికా అధ్యక్ష భవనం ఆందోళన వ్యక్తం చేస్తోంది. అమెరికా నుంచి 'ఛీఈ' సందేశం వచ్చినట్టు ఇజ్రాయెల్ అధికారులు పేర్కొన్నారు. కానీ,. అటు వైట్‌హౌస్ ఇటు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ దీనిపై ఇప్పటి వరకూ స్పందించలేదు.

## అంతర్జాతీయ న్యాయం చచ్చుబడిపోయింది !

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇజ్రాయెల్ యుద్ధోన్మాదంతో దాడులు కొనసాగిస్తున్న నేపథ్యంలో రష్యా కీలక ప్రకటన చేసింది. అంతర్జాతీయ న్యాయం చచ్చుబడిపోయిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో తాజా పరిణామాలపై చర్చించేందుకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలోని ఐదు శాశ్వత సభ్య దేశాలు (పి-5) తక్షణమే భేటీ కావాలని పిలుపునిచ్చింది. ప్రపంచ భద్రత, సుస్థిరతలపై చర్చించేందుకు పి-5లోని రష్యా, చైనా, అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ భేటీ కావాలని తమ అధ్యక్షులు పుతిన్ కోరుకుంటున్నారని రష్యా ప్రభుత్వ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ తెలిపారు. ఆదివారం ఆయన ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ పుతిన్ ప్రతిపాదన మేరకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలోని ఐదు శాశ్వత సభ్య దేశాలు భేటీ కావాల్సిన అవసరం ఉందన్నారు. కోవిడ్-19 సంక్షోభ కాలానికి ముందు కూడా ఒకసారి ఇదే ప్రతిపాదనను పుతిన్ చేశారని ఆయన గుర్తు చేశారు. అంతర్జాతీయ న్యాయం అనేది దాదాపు నశించిపోయిందని, ఇలాంటప్పుడు అంతర్జాతీయ న్యాయంలోని నిబంధనలు, సూత్రాలను అనుసరించమని ఇతరులకు ఎలా చెప్పగలమో తనకు అర్థం కావడం లేదన్నారు. కనీసం అంతర్జాతీయ న్యాయం అంటే ఏమిటో నిర్వచించే పరిస్థితిలో కూడా ఇప్పుడెవరూ లేరని ఆయన తెలిపారు. వాస్తవానికి అంతర్జాతీయ న్యాయం అనేది ఇంకా మిగిలి లేదని పెస్కోవ్ పేర్కొన్నారు. కేవలం అది కాగితాలు, మాటలకు పరిమితమైందని, ఆచరణలో అస్సలు కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. 'ఇరాన్‌పై అమెరికా- ఇజ్రాయెల్ దాడులు చేశాక పశ్చిమాసియా ప్రాంతంలో అస్థిర పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ప్రాంతంలో సైనిక ఘర్షణల సంఖ్య కూడా పెరిగింది. వీటి ఫలితంగా ప్రతికూలమైన రాజకీయ, ఆర్థిక పర్యవసానాలను మనం ఎదుర్కోవాల్సి వస్తుంది' అని దిమిత్రీ పెస్కోవ్ హెచ్చరించారు.

## సంక్షోభ నివారణకు చైనా 'పంచసూత్రాలు'

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ యద్ధోన్మాద దాడులు కొనసాగిస్తున్న నేపథ్యంలో పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులను నివారించడానికి చైనా ఐదు సూత్రాలను ప్రతిపాదించింది. బీజింగ్‌లో 14వ జాతీయ పీపుల్స్ కాంగ్రెస్ నాలుగో సెషన్ తర్వాత ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మాట్లాడుతూ ఈ వివరాలు వెల్లడించారు. ఇరాన్, మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతలను తగ్గించడానికి తాము దౌత్యపరమైన ఐదు కర్తవ్యాలను సూచిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. వీటిలో మొదటిది తక్షణమే శత్రుత్వాలను విరమించి అన్ని రకాల సైనిక చర్యలను నిలిపివేయాలని, ప్రాణనష్టాన్ని నివారించడం అత్యంత ప్రధానమని పేర్కొన్నారు. సైనిక బలంతో రాజకీయ సమస్యలను పరిష్కరించలేమని పునరుద్ఘాటించారు. ఇక రెండోది : ఇరాన్, ఇతర గల్ఫ్ దేశాల సరిహద్దులను, స్వతంత్రతను ఇతర దేశాలు గౌరవించాలని, బాహ్య శక్తుల జోక్యం ఉండరాదని హితవు పలికింది. మూడోది : అణువ్యాప్తిని అరకట్టిడానికి విస్తృత సంప్రదింపులు, చర్చలు మాత్రమే సరైన మార్గమని పేర్కొన్నారు. నాలుగోది : హోర్ముజ్ జలసంధి వంటి కీలక వాణిజ్య మార్గాలను సురక్షితంగా ఉంచాలని సూచిం చింది. అంతర్జాతీయ ఇంధన సరఫరాకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడటం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమని పేర్కొన్నారు. ఇక ఐదోవది : మదధ్యప్రాచ్య దేశాలు తమ భద్రత సమస్యలను తామే పరిష్కరించుకోవడానికి వీలుగా ఒక నూతన వేదికను ఏర్పాటు చేసుకోవాలని, బాహ్య దేశాల 'జోక్యం' లేని భద్రతా వ్యవస్థను చైనా ప్రోత్సహిస్తుందని తెలిపారు.

# ఇరాన్ ఆర్థిక మూలాలపై యుద్ధోన్మాద పడగ

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధోన్మాద దాడులు తొమ్మిదో రోజు అయిన ఆదివారం కూడా కొనసాగాయి. ఇరాన్‌కు ఆర్థిక మూలాలను దెబ్బతీసే వ్యూహంతో తొలిసారి చమురు నిల్వల గోదాములను, సరఫరా కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్త దాడులు చేపట్టాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోనూ, పొరుగునున్న అల్‌బోర్జ్ ప్రావిన్సులోని చమురు నిల్వ గోదాములు, సరఫరా కంపెనీల క్షేత్రాలను ధ్వంసం చేశాయి. ఈ దాడులతో అక్కడ భయానక పరిస్థితులు నెలకొన్నాయి. ఆకాశాన్నింటేలా మంటలు ఎగిసిపడ్డాయి. నగరాన్ని మింగేసేలా దట్టమైన నల్లని మేఘాలు టెహ్రాన్ అంతటా అలుముకున్నాయి. ఈ దాడుల్లో నలుగురు ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని ఇరాన్ చమురు సంస్థ వెల్లడించింది. ఈశాన్య టెహ్రాన్‌లోని అఘదసియాం?? చమురు గోదాము, దక్షిణ ప్రాంతంలోని టెహ్రాన్ చమురుశుద్ధి క్షేత్రం, అలాగే పశ్చిమ ప్రాంతంలోని సదరన్ చమురు గోదాము, కారజ్ నగరంలోని మరో చమురు గోదాముపై ఈ దాడులు జరిగినట్లు వెల్లడించింది. ఈ దాడుల కారణంగా పెద్ద మొత్తంలో చమురు సమీప వీధుల్లోకి వదరలా ముంచెత్తిందని పేర్కొంది.

# అమెరికా-ఇజ్రాయిల్ దాడి క్రూరమైన చర్య

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులు చాలా క్రూరమైన చర్యగా క్యూబా అధ్యక్షులు మిగెల్ డియాస్ కానెల్ పేర్కొన్నారు. సామ్రాజ్యవాదం, యుద్ధోన్మాదంతో అమెరికా, ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ హత్యకు గురికావడం పట్ల కానెల్ తీవ్ర సంతాపం తెలిపారు. ఈ మేరకు ఆయన హవానాలోని ఇరాన్ రాయబార కార్యాలయాన్ని సందర్శించారు. ఖమేనీ హత్య జరిగిన విషయం తెలుసుకొని తీవ్ర దు:ఖం, బాధ కలిగిందని తెలిపారు. అమెరికా, ఇజ్రాయిల్ దాడి క్రూరమైన చర్యగా పేర్కొన్నారు. ఇది అంతర్జాతీయ చట్టాలు, నైతిక ప్రమాణాల ఉల్లంఘన అని ఆరోపించారు. ఖమేనీని ఇరాన్ ప్రజల గొప్ప నాయకుడిగా, అంతర్జాతీయస్థాయిలో గౌరవనీయ రాజనీతిజ్ఞుడుగా గుర్తు చేసుకుంటామని కానెల్ తెలిపారు. ఇరాన్, క్యూబా మధ్య స్నేహపూర్వక, సహకార సంబంధాలను బలోపేతం చేయడంలో ఆయన కీలక భూమిక పోషించారని చెప్పారు.

# భారత క్రికెట్‌కు స్వర్ణ యుగం

**హైదరాబాద్ పెన్ పవర్:** సమకాలీన క్రికెట్ ప్రపంచం వేగం, వ్యూహం, సాంకేతికతల సమన్వయంతో కొత్త దశలోకి అడుగుపెట్టింది. ముఖ్యంగా ట్వంటీ20 ఫార్మాట్ క్రికెట్‌ను అత్యంత ఉత్కంఠ భరిత క్రీడగా మలిచింది. కేవలం మూడు గంటల వ్యవధిలోనే ఫలితం తేలే ఈ ఫార్మాట్ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది అభిమానులను ఆకర్షిస్తోంది. అంతర్జాతీయ క్రికెట్ వ్యవస్థను నిర్వహిస్తున్న అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించే పురుషుల టీ?20 ప్రపంచకప్ ఈ ఫార్మాట్‌కు అత్యున్నత వేదికగా నిలుస్తోంది. ప్రపంచంలోని అత్యుత్తమ జట్లు పాల్గొనే ఈ మహా టోర్నమెంట్‌లో భారత క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలవడం భారత క్రీడా చరిత్రలో గర్వకారణంగా నిలిచింది. గత కాలపు చారిత్రాత్మక విజయానికి నాయకత్వం వహించిన కెప్టెన్ రోహిత్ శర్మ తన సమర్థ వ్యూహాలతో ఆధునిక క్రికెట్‌లో ఒక విశిష్ట నాయకుడిగా గుర్తింపు పొందాడు. జట్టును సమన్వయంతో ముందుకు నడిపించడంలో, ఆటగాళ్ల ప్రతిభను సరైన సమయంలో వినియోగించడంలో ఆయన చూపిన దూరదృష్టి ఈ విజయానికి ప్రధాన కారణంగా నిలిచింది. టోర్నమెంట్ మొత్తం భారత జట్టు అజేయంగా సాగి టైటిల్ సాధించడం అరుదైన ఘనతగా నిలిచింది. భారత క్రికెట్‌కు గొప్ప వారసత్వం ఉంది. టెస్ట్ క్రికెట్ నుంచి వన్డేలు, టీ?20ల వరకు భారత జట్టు ఎన్నో చారిత్రక విజయాలను సాధించింది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది అభిమానులను కలిగిన జట్లలో భారత జాతీయ క్రికెట్ జట్టు అగ్రస్థానంలో నిలుస్తోంది. 2007లో జరిగిన తొలి టీ20 ప్రపంచకప్ విజయం భారత క్రికెట్‌లో ఒక కొత్త యుగాన్ని ప్రారంభించింది. ఆ విజయంతో యువ ఆటగాళ్లకు కొత్త అవకాశాలు లభించాయి. దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన క్రికెటర్లు వెలుగులోకి వచ్చి భారత జట్టును మరింత బలంగా తీర్చిదిద్దారు. కాలక్రమేణా జట్టు నిర్మాణంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. ఒకప్పుడు సీనియర్ ఆటగాళ్లపై ఆధారపడి ఉన్న జట్టు, ఇప్పుడు అనుభవం మరియు యువశక్తి కలయికతో సమతుల్యంగా మారింది. విరాట్ కోహ్లీ వంటి స్థిరమైన బ్యాట్స్‌మన్, హార్దిక్ పాండ్యా వంటి దూకుడు ఆల్ రౌండర్, అలాగే ప్రపంచ స్థాయి వేగబౌలర్ జస్ప్రీత్ బుమ్రా వంటి ఆటగాళ్లు జట్టుకు కీలక బలంగా నిలిచారు. వీరి సమిష్టి ప్రదర్శన భారత జట్టును ప్రపంచ స్థాయిలో అత్యంత పటిష్ట జట్టుగా నిలిపింది. ప్రస్తుత 2026 టోర్నమెంట్‌లో భారత జట్టు ప్రదర్శన గణాంక పరంగా కూడా విశేషంగా నిలిచింది. లీగ్ దశ నుంచి ఫైనల్ వరకు ఒక్క మ్యాచ్ మినహా అజేయంగా ముందుకు సాగడం భారత జట్టు సామర్థ్యానికి నిదర్శనం. ప్రతి మ్యాచ్‌లోనూ జట్టు సమన్వయంతో కూడిన ప్రదర్శన కనబరిచింది. బ్యాటింగ్ విభాగంలో ప్రారంభ ఓవర్ల నుంచే దూకుడు ప్రదర్శించడం ద్వారా ప్రత్యర్థి జట్లపై ఒత్తిడి సృష్టించారు. పవర్ ప్లేలో వేగంగా పరుగులు సాధించడం ద్వారా బలమైన పునాది వేసి, మధ్య ఓవర్లలో నిలకడగా ఆడి, చివరి ఓవర్లలో స్కోరును భారీగా పెంచడం భారత బ్యాటింగ్ వ్యూహంలో ప్రధాన లక్షణంగా నిలిచింది. బౌలింగ్ విభాగం కూడా భారత విజయానికి కీలక పాత్ర పోషించింది. పవర్ ప్లేలోనే ప్రత్యర్థి జట్లను ఒత్తిడికి గురిచేయడం ద్వారా ప్రారంభంలోనే వికెట్లు సాధించారు. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు పరుగులను నియంత్రించి బ్యాట్స్‌మన్‌లపై ఒత్తిడిని పెంచారు. చివరి ఓవర్లలో వేగబౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్ చేయడం ద్వారా ప్రత్యర్థి జట్లకు భారీ స్కోర్లు సాధించే అవకాశాన్ని తగ్గించారు. ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రా చేసిన కట్టుదిట్టమైన బౌలింగ్ అనేక మ్యాచ్‌లలో భారత జట్టుకు విజయాన్ని అందించింది. ఫీల్డింగ్ కూడా భారత జట్టు విజయానికి కీలక కారణంగా నిలిచింది. ఆధునిక క్రికెట్‌లో ఫీల్డింగ్ స్థాయి ఎంత ముఖ్యమో భారత ఆటగాళ్లు తమ ప్రదర్శనల ద్వారా నిరూపించారు. బౌండరీల వద్ద అద్భుతమైన క్యాచ్‌లు, మెరుపు వేగంతో చేసే రన్ అవుట్లు, మైదానంలో చురుకైన కదలికలు ప్రత్యర్థి జట్లపై తీవ్ర ఒత్తిడిని సృష్టించాయి. కొన్ని సందర్భాల్లో ఫీల్డింగ్ ద్వారానే మ్యాచ్ గమనాన్ని మార్చిన ఘట్టాలు కనిపించాయి. ప్రస్తుత విజయ ప్రయాణంలో మరో ముఖ్య పాత్ర పోషించిన ఆటగాడు సూర్య కుమార్ యాదవ్. ఆధునిక క్రికెట్‌లో అత్యంత వినూత్నమైన బ్యాటింగ్ శైలి కలిగిన ఆటగాడిగా ఆయన ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాడు. మైదానం మొత్తం మీద అసాధారణ కోణాల్లో షాట్లు ఆడగల సామర్థ్యం ఆయన ప్రత్యేకత. క్రికెట్ విశ్లేషకులు ఆయనను "360 డిగ్రీ బ్యాట్స్‌మన్"గా అభివర్ణిస్తారు. ఒత్తిడి పరిస్థితుల్లో కూడా ధైర్యంగా ఆడే స్వభావం జట్టుకు కీలక బలంగా నిలిచింది. ఈ విజయానికి వెనుక ఉన్న మరో ప్రధాన కారణం భారత క్రికెట్ వ్యవస్థ యొక్క బలం. దేశంలో ఉన్న విస్తృతమైన దేశీయ క్రికెట్ వ్యవస్థ యువ ప్రతిభను వెలికి తీస్తోంది. ఈ వ్యవస్థను సమర్థంగా నిర్వహిస్తున్న భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన క్రికెట్ సంస్థగా గుర్తింపు పొందింది. దేశీయ టోర్నీలు, శిక్షణా అకాడమీలు, ఆధునిక సౌకర్యాలు యువ ఆటగాళ్లను అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దుతున్నాయి. భారత క్రికెట్ విజయాలు కేవలం క్రీడా విజయాలు మాత్రమే కాదు; అవి జాతీయ గర్వానికి ప్రతీకలు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది భారతీయ అభిమానులు ఈ విజయాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. చిన్న పట్టణాల నుంచి మహా నగరాల వరకు ప్రతి చోటా అభిమానులు సంబరాలు నిర్వహించారు. క్రికెట్ భారతదేశంలో ఒక క్రీడ మాత్రమే కాదు; అది ఒక భావోద్వేగం, ఒక సామూహిక అనుభూతి. భవిష్యత్తు దృష్ట్యా ఈ విజయం భారత జట్టుకు మరింత ప్రేరణగా నిలుస్తుంది. యువ ఆటగాళ్లకు ఇది ఒక ప్రేరణాత్మక ఉదాహరణగా మారింది. క్రమశిక్షణ, కృషి, సమన్వయం ఉంటే ప్రపంచ స్థాయిలో విజయాలను సాధించడం సాధ్యమని ఈ విజయం నిరూపించింది. సూర్య కుమార్ యాదవ్ నాయకత్వం భారత జట్టుకు స్థిరత్వం, ఆత్మవిశ్వాసాన్ని అందించింది. ఆయన నిర్మించిన బలమైన జట్టు నిర్మాణం భవిష్యత్తులో కూడా భారత క్రికెట్‌కు మార్గదర్శకంగా నిలుస్తుంది. మొత్తంగా చూస్తే ఈ టీ20 ప్రపంచకప్ విజయం భారత క్రికెట్ చరిత్రలో ఒక మైలురాయి. అజేయ ప్రస్థానం, సమన్వయంతో కూడిన జట్టు ప్రదర్శన, వ్యూహాత్మక నాయకత్వం ఇవన్నీ కలిసి ఈ విజయాన్ని సాధ్యం చేశాయి. భారత క్రికెట్ యొక్క స్వర్ణయుగం కొనసాగుతుందనే నమ్మకాన్ని ఈ విజయం మరింత బలపరిచింది. సూర్య కుమార్ యాదవ్ నాయకత్వంలో సాధించిన ఈ విజయగాథ భారత క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతుంది. సూర్య కుమార్ యాదవ్ వంటి యువ నాయకుల చేతుల్లో భారత క్రికెట్ భవిష్యత్తు మరింత ప్రకాశవంతంగా ఉండబోతోందనే ఆశాభావాన్ని అభిమానులలో నింపుతోంది.

# పరీక్షల నిర్వహణలో బోర్డు పాత్రే కీలకం

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతి విద్యార్థి విద్యా ప్రయాణంలో పదవ తరగతి బోర్డు పరీక్షలు అత్యంత కీలకమైన దశగా భావించబడతాయి. విద్యార్థి భవిష్యత్ విద్యా దిశను నిర్దేశించే ఈ పరీక్షలు కేవలం మార్కుల పోటీ మాత్రమే కాకుండా క్రమశిక్షణ, సమయ పాలన, మానసిక స్థైర్యం, శ్రద్ధ వంటి విలువలను కూడా పరీక్షిస్తాయి. ఈ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలంటే కేవలం చదువు మాత్రమే సరిపోదు. చదువు విధానం, సమయ నిర్వహణ, ప్రశ్నలకు సమాధానాలు రాయడంలో సరైన పద్ధతి, పరీక్ష అనంతరం సమాధానాలను పరిశీలించుకునే అలవాటు వంటి అంశాలు కూడా సమానంగా అవసరం. పరీక్షల సమయంలో చాలా మంది విద్యార్థులు ఆందోళన, భయం, ఒత్తిడి వంటి భావోద్వేగాలకు లోనవుతుంటారు. అయితే పరీక్షలను భయపడాల్సిన అవసరం లేదు. సరైన ప్రణాళికతో, క్రమబద్ధమైన చదువుతో, సమయపాలనతో ముందుకు సాగితే పరీక్షలు సులభంగా ఎదుర్కోవచ్చు. విద్యార్థులు ముందుగా పరీక్షలను ఒక బాధ్యతగా కాకుండా ఒక అవకాశంగా చూడాలి. తమ సామర్థ్యాన్ని నిరూపించుకునే వేదికగా భావిస్తే భయం తగ్గి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. పరీక్షలకు ముందు పునశ్చరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. పాఠ్యాంశాన్ని మొదటిసారి చదవడం ఒక దశ అయితే, దాన్ని మళ్లీ మళ్లీ పునశ్చరణ చేయడం ద్వారానే అది మనసులో స్థిరపడుతుంది. ముఖ్యమైన సూత్రాలు, నిర్వచనాలు, గణిత సమీకరణాలు, తేదీలు, చారిత్రక సంఘటనలు వంటి అంశాలను చిన్న నోట్ల రూపంలో రాసుకొని తరచుగా చదవడం చాలా ఉపయోగకరం. దీనివల్ల పరీక్షల సమయంలో త్వరగా గుర్తు చేసుకునే అవకాశం ఉంటుంది. పరీక్షల సమయంలో సమయ నిర్వహణ అత్యంత కీలకమైన అంశం. ప్రశ్నాపత్రం చేతికి వచ్చిన వెంటనే తొందరపడి రాయడం ప్రారంభించకుండా మొదట కొన్ని నిమిషాలు తీసుకొని మొత్తం ప్రశ్నా పత్రాన్ని పూర్తిగా చదవాలి. అందులోని ప్రశ్నల స్వభావం, మార్కుల విభజన, ఎంపిక ప్రశ్నలు వంటి అంశాలను అర్థం చేసుకోవాలి. తదనంతరం ఏ ప్రశ్నకు ఎంత సమయం కేటాయించాలో ముందుగానే నిర్ణయించు కోవాలి. సాధారణంగా ఎక్కువ మార్కులున్న ప్రశ్నలకు కొంత ఎక్కువ సమయం కేటాయించాలి. అయితే ఒక్క ప్రశ్నపైనే ఎక్కువ సమయం ఖర్చు చేయకుండా సమతౌల్యం పాటించడం అవసరం. విద్యార్థులు ముందుగా బాగా తెలిసిన ప్రశ్నలతో సమాధానాలు రాయడం ప్రారంభిస్తే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మొదటి కొన్ని సమాధానాలు సులభంగా రాయగలిగితే మిగిలిన ప్రశ్నలకు సమాధానాలు రాయడంలో కూడా ఉత్సాహం పెరుగుతుంది. తెలియని ప్రశ్నలపై ఎక్కువగా ఆలోచిస్తూ సమయాన్ని వృథా చేయకుండా, తాత్కాలికంగా వదిలి తరువాత ప్రయత్నించడం ఉత్తమం. సమాధానాలను రాయడంలో స్పష్టత, క్రమబద్ధత, సరళత ఎంతో ముఖ్యమైనవి. పరీక్షా పత్రాన్ని మూల్యాంకనం చేసే ఉపాధ్యాయులు సమాధానాలను సులభంగా అర్థం చేసుకునే విధంగా రాయాలి. అర్థం కాని రీతిలో పొడవుగా రాయడం కన్నా సూటిగా, స్పష్టంగా, పాయింట్ల రూపంలో రాయడం ఉత్తమం. ముఖ్యమైన పదాలను అండర్లైన్ చేయడం, ఉపశీర్షికలుగా విభజించడం, అవసరమైన చోట చార్టులు లేదా చిత్రాలు గీయడం ద్వారా సమాధానాన్ని మరింత స్పష్టంగా చేయవచ్చు.అక్షరాల స్పష్టత కూడా మంచి మార్కులు పొందడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కొంతమంది విద్యార్థులు త్వరగా రాయాలనే ఆలోచనతో అక్షరాలను గందరగోళంగా రాస్తారు. దీనివల్ల పరీక్షా పత్రాన్ని చదవడం మూల్యాంకనాధికారులకు కష్టమవుతుంది. అందువల్ల వేగం మరియు స్పష్టత మధ్య సమతౌల్యం పాటించాలి. ప్రతి పదం చదవడానికి సులభంగా ఉండేలా రాయడం మంచిది. గణిత శాస్త్రం మరియు విజ్ఞాన శాస్త్రాల వంటి విషయాల్లో ప్రతి దశను స్పష్టంగా చూపించడం చాలా ముఖ్యమైనది. కేవలం తుది సమాధానం రాయడం మాత్రమే సరిపోదు. సమస్యను పరిష్కరించే ప్రతి దశను క్రమపద్ధతిలో చూపిస్తే పూర్తి మార్కులు పొందే అవకాశం ఉంటుంది. అదే విధంగా విజ్ఞాన శాస్త్రంలో అవసరమైన చిత్రాలు, లేబుల్స్ సరిగా గీయడం కూడా మంచి మార్కులకు దోహదపడుతుంది. సమాధాన పత్రంలో తప్పులను తగ్గించడానికి విద్యార్థులు చివరి కొన్ని నిమిషాలను తప్పనిసరిగా సరి చూసుకోవడానికి కేటాయించాలి. తొందరలో రాసినప్పుడు కొన్ని చిన్న తప్పులు జరగడం సహజం. సంఖ్యలలో పొరపాట్లు, పదాల తప్పులు, ప్రశ్న నంబర్లలో గందరగోళం వంటి లోపాలు ఉండే అవకాశం ఉంటుంది. పరీక్ష సమయం ముగిసే ముందు సమాధాన పత్రాన్ని పూర్తిగా పరిశీలిస్తే ఈ తప్పులను సరిచేసుకునే అవకాశం ఉంటుంది. పరీక్షల సమయంలో మానసిక ప్రశాంతత కూడా అత్యంత అవసరం. ఒత్తిడిని తగ్గించడానికి విద్యార్థులు సరైన నిద్ర, సమతుల్య ఆహారం తీసుకోవాలి. రాత్రి పొద్దుపోయే వరకు చదివి అలసటకు గురికావడం కన్నా, క్రమబద్ధమైన విశ్రాంతి తీసుకోవడం ఉత్తమం. ఆరోగ్యకరమైన శరీరంలోనే చురుకైన మనస్సు ఉంటుంది అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. పరీక్షల ముందు రోజు కొత్త పాఠాలను చదవడం కన్నా ఇప్పటికే చదివిన విషయాలను పునశ్చరణ చేయడం మంచిది. కొత్త విషయాలను చదవడం వల్ల గందరగోళం పెరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల ఇప్పటికే నేర్చుకున్న అంశాలను మళ్లీ ఒకసారి గుర్తు చేసుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. పరీక్షా కేంద్రానికి సమయానికి ముందుగానే చేరుకోవడం కూడా చాలా ముఖ్యమైన అంశం. ఆలస్యంగా రావడం వల్ల తొందర, ఆందోళన పెరుగుతుంది. పరీక్ష ప్రారంభానికి కనీసం అరగంట ముందే కేంద్రానికి చేరుకుంటే మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. అవసరమైన హాల్ టికెట్, పెన్నులు, పెన్సిళ్లు, గణక యంత్రం (అనుమతి ఉన్నపక్షంలో) వంటి వస్తువులను ముందుగానే సిద్ధం చేసుకోవాలి.ఇతర విద్యార్థులతో పోల్చుకోవడం కూడా అనవసరమైన ఒత్తిడిని పెంచుతుంది. ప్రతి విద్యార్థికి తనకు తానుగా చదివే విధానం ఉంటుంది. ఇతరులు ఎంత చదివారనే విషయంపై ఆలోచించకుండా తాము ఎంత సమర్థంగా సిద్ధమయ్యామనే విషయంపై దృష్టి పెట్టాలి. ఆత్మవిశ్వాసం, పట్టుదల ఉంటే ఏ పరీక్షనైనా విజయవంతంగా ఎదుర్కోవచ్చు.తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల పాత్ర కూడా ఇక్కడ ముఖ్యమైనది. వారు విద్యార్థులపై అనవసర ఒత్తిడి లేకుండా ప్రోత్సహించాలి. విద్యార్థుల్లో నమ్మకం పెంచే విధంగా మాట్లాడాలి. పరీక్షలు జీవితంలో ఒక దశ మాత్రమే కానీ అంతిమ గమ్యం కాదని వారికి తెలియజేయాలి. మొత్తానికి పదవ తరగతి బోర్డు పరీక్షలు విద్యార్థి జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి. సరైన ప్రణాళిక, సమయపాలన, పునశ్చరణ, సమాధానాల స్పష్టత, మానసిక ప్రశాంతత వంటి అంశాలను పాటిస్తే మంచి ఫలితాలు సాధించడం కష్టం కాదు. క్రమశిక్షణతో చదివి, ఆత్మవిశ్వాసంతో పరీక్షలను ఎదుర్కొంటే విజయ ద్వారం విద్యార్థుల ముందు తప్పకుండా తెరుచు కుంటుంది. ఈ దశలో సాధించిన విజయమే వారి భవిష్యత్ విద్యా ప్రయాణానికి బలమైన పునాది అవుతుంది.

## దేశ సమాఖ్య స్వభావాన్ని నాశనం చేస్తున్న కేంద్రం




**హైదరాబాద్ పెన్ పవర్:** మోదీ ప్రభుత్వం దేశ సమాఖ్య స్వభావాన్ని నాశనం చేస్తోందని, రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని కార్మిక, రైతు పార్లమెంట్ పేర్కొంది. సోమవారం నాడిక్కడ జంతర్ మంతర్‌లో కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా సంయుక్తంగా కార్మిక, రైతు పార్లమెంటును చేపట్టాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను ఆర్థికంగా కుంగదిస్తోందని, అధికారం కె?ంద్రీకృతానికి చర్యలు చేపడుతుందని విమర్శించారు. రాష్ట్రాల పన్ను హక్కులను పునరుద్ధరించడానికి జిఎస్టీ చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాలకు ఇచ్చే 33 శాతం పన్ను వాటాను 60 శాతంగా పెంచాలని కూడా డిమాండ్ చేశారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడిని కార్మిక, రైతు నేతలు ఖండించారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ అమరవీరుల వార్షికోత్సవమైన మార్చి 23ను సామ్రాజ్యవాద వ్యతిరేక దినోత్సవంగా పాటించాలని పిలుపునిచ్చారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనకు పిలుపునిచ్చారు. ఏప్రిల్ 1న కార్మిక కోడ్లకు వ్యతిరేకంగా అఖిల భారత బ్లాక్ డేగా పాటించాలని నిర్ణయించారు. మోడీ ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ అన్ని రాష్ట్రాల్లో మహా పంచాయితీలు నిర్వహించనున్నట్లు పార్లమెంట్ ప్రకటించింది. ఫిబ్రవరి 12న జరిగిన జాతీయ సమ్మెను చారిత్రాత్మక విజయంగా మార్చిన వారందరికీ పార్లమెంటు వందనం చేసింది. ఈ కార్యక్రమానికి కార్మిక సంఘాల నేతలు ఎఆర్ సింధు (సిఐటియు), ముఖేష్ కశ్యప్ (ఎఐటియుసి), షహనాజ్ రఫీక్ (ఐఎన్టియుసి), నారాయణ్ సింగ్ (హెచ్‌ఎంఎస్), ఆర్ కె శర్మ (ఎఐయుటియుసి), లతా (సేవా), రాఘవ్ సింగ్ (ఎఐసిసిటియు), గజరాజ్ సింగ్ (యుటియుసి), ఎస్ కెఎం నేతలు పి. కృష్ణప్రసాద్ (ఎఐకెఎస్), తదితర సంఘాల నాయకులు అధ్యక్షత వహించారు.

## ఫణిక్కర్ మృతి వామపక్ష ప్రజాస్వామ్య ఉద్యమానికి లోటు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ చరిత్రకారుడు కె ఎన్ ఫణిక్కర్ మృతిపై సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ తీవ్ర విచారర వ్యక్తం చేశారు. పనిక్కర్ మృతి దేశంలో విద్యా ప్రపంచానికి, వామపక్ష ప్రజాస్వామ్య ఉద్యమానికి తీవ్రమైన లోటు అని బేబీ పేర్కొన్నారు. లౌకికవాదానికి పనిక్కర్ బలమైన రక్షకుడని, ప్రగతిశీ మేధావులకు మార్గదర్శకుడని బేబీ కొనియాడారు. చరిత్రను మతతత్వం చేయడానికి వ్యతిరేకంగా అవిశ్రాంతంగా పోరాడిన విమర్శనాత్మక ఆలోచనా యోధుడిగా పనిక్కర్‌ను బేబీ అభివర్ణించారు. 2006-11లో కేరళలో అప్పటి విఎస్ అచ్యుతానందన్ నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం కేరళ రాష్ట్ర ఉన్నత విద్యా మండలిని ఏర్పాటు చేసే బాధ్యతను పనిక్కర్‌కు అప్పగించిన విషయాన్ని బేబీ గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన చట్టం ద్వారా దేశంలోనే తొలిసారిగా కేరళలో ఇది ఏర్పాటయిందని, పనిక్కర్ సృజనాత్మక కృషితో అనేక సంస్కరణలు, కొత్త చొరవలు ఇక్కడ ప్రవేశపెట్టారని బేబీ తెలిపారు. ఢిల్లీలోని జెఎన్‌యులో పనిచేసిన సమయంలోనే జనసంస్కృతి, స్వరలయ అనే రెండు సాంస్కృతిక సంస్థల్లో పనిక్కర్ చాలా చురుగ్గా పని చేశారని బేబీ గుర్తుచేసుకున్నారు. ఫణిక్కర్ కృషి, లౌకిక, ప్రగతిశీల విలువల పట్ల పనిక్కర్ నిబద్ధత మనకు నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉంటాయని బేబీ ఈ సందర్భంగా తెలిపారు. పనిక్కర్ కుటుంబానికి, స్నేహితులకు, విద్యార్థులకు బేబీ హృదయపూర్వక సంతాపం తెలిపారు.

## నిన్నటి నష్టాల నుంచి కోలుకొని లాభాల వైపు పరుగులు



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా, ఇజ్రాయెల్ లబ ఇరాన్ యుద్ధం కారణంగా స్టాక్ మార్కెట్లు గత కొద్ది రోజులుగా నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం కూడా భారీ నష్టాల్లో ముగిశాయి. కానీ గత సెషన్‌లో భారీ పతనంతో ఇన్వెస్టర్లను ఆందోళనకు గురిచేసిన భారతీయ స్టాక్ మార్కెట్లు, నేడు (మంగళవారం) ఉదయం నుంచే రికవరీ బాట పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాలతో పాటు, కనిష్ట స్థాయిల వద్ద ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడం మార్కెట్లకు భారీ ఊతాన్నిచ్చింది. ప్రస్తుతం సెన్సెక్స్ 77,991 పాయింట్ల వద్ద ట్రేడ్ అవుతూ, సుమారు 425 పాయింట్ల లాభంతో బలంగా కొనసాగుతోంది. అటు నిఫ్టీ కూడా తన కీలక స్థాయిలను తిరిగి పుంజుకుని 24,139.25 పాయింట్ల వద్ద ట్రేడ్ అవుతూ ఇన్వెస్టర్లలో ఆశలు చిగురింపజేస్తోంది. నేటి మార్కెట్ గమనానికి ప్రధానంగా ఐటీ (ఎ), బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాలు వెన్నుదన్నుగా నిలిచాయి. నిన్నటి భారీ నష్టాల తర్వాత నాణ్యమైన షేర్ల ధరలు ఆకర్షణీయంగా మారడంతో దేశీయ ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేపట్టారు. దీనికి తోడు అమెరికా, ఇతర ఆసియా మార్కెట్ల సానుకూల ధోరణి కూడా మన మార్కెట్లలో ఉత్సాహాన్ని నింపింది. ప్రస్తుత ట్రెండ్ కొనసాగితే మార్కెట్లు మరింత లాభాల్లో ముగిసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఉద్యోగాల కోత వార్తలు అవాస్తవం




**హైదరాబాద్ పెన్ పవర్:** భారీగా ఉద్యోగాల కోత విధిస్తున్నట్లు వచ్చిన వార్తలను ఐటీ దిగ్గజం టెక్ మహీంద్రా తోసిపుచ్చింది. ఉద్యోగులను తొలగించే ప్రతిపాదనేదీ పరిశీలనలో లేదని స్పష్టం చేసింది. ఇటీవల సోషల్ మీడియా పోస్ట్‌లు, వాటాదార్ల నుంచి వస్తున్న ప్రశ్నల నేపథ్యంలో కంపెనీ ఈ వివరణ ఇచ్చింది. 'నమోదిత కంపెనీల వెల్లడి నిబంధనలన్నీ' పాటిస్తున్నామని, కార్యకలాపాల స్థిరత్వానికి కట్టుబడి ఉన్నామని టెక్ మహీంద్రా వివరించింది. మూడేళ్ల క్రితం కొత్త నాయకత్వం రూపొందించిన వ్యూహం వల్ల టెక్ మహీంద్రా వేగవంతమైన, స్థిరమైన వృద్ధి దిశగా అడుగులు వేస్తోందని, సంస్థ నిర్వహణ మార్జిన్, భారీ ఒప్పందాల పెరుగుదలకు ఇది నిదర్శనమని కంపెనీ సీఈఓ, ఎండీ మోహిత్ జోషి పేర్కొన్నారు. గత ఏడాది డిసెంబరు త్రైమాసికంలో కంపెనీ ఉద్యోగుల సంఖ్య 3098 తగ్గి 1,49,616కు చేరింది. ఇది ఖర్చు తగ్గించే చర్యల వల్ల కాదని, ఫిక్స్‌డ్-ప్రైస్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టడం, ఉద్యోగుల వలసలే కారణమని జోషి స్పష్టం చేశారు. కొత్త ఉద్యోగులను నియమించుకోవడానికి బదులుగా, ఇతర ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్నవారిని వినియోగించుకుంటున్నట్లు వివరించారు.

## ఇరాన్‌కు వ్యూహాత్మక మద్దతును ప్రకటించిన పుతిన్



**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరిన వేళ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇరాన్‌కు తన మద్దతును ప్రకటించారు. ఇజ్రాయెల్, అమెరికాలతో సాగుతున్న ఘర్షణల్లో మిత్రదేశమైన ఇరాన్‌కు మాస్కో అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన ముజ్తబా ఖమేనీకి పుతిన్ అభినందనలు తెలుపుతూ, ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో దేశాన్ని సమర్థవంతంగా నడిపించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.సరిహద్దుల్లో ఎదురవుతున్న సాయుధ దురాక్రమణను తిప్పికొట్టడంలో ఇరాన్‌కు ముజ్తబా నాయకత్వం అవసరమని పుతిన్ పేర్కొన్నారు. ఇటీవల ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఖమేనీ సహా ఇతర అగ్రనేతల మృతిపై ఆయన తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ఆంక్షలు, యుద్ధ మేఘాల మధ్య రష్యా-ఇరాన్‌ల మధ్య బలపడుతున్న ఈ వ్యూహాత్మక బంధం పశ్చిమాసియా రాజకీయ సమీకరణాలను వేగంగా మారుస్తోంది. రష్యా ఇస్తున్న ఈ బహిరంగ హామీ ఇరాన్‌కు అంతర్జాతీయ స్థాయిలో భారీ నైతిక బలాన్ని చేకూర్చనుంది.

## నెతన్యాహుతో చర్చించాకే.. ఇరాన్‌తో యుద్ధం ఆపడంపై నిర్ణయం

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో యుద్ధం 10వ రోజుకు చేరుకున్న వేళ.. అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత వివాదాస్పద, శక్తివంతమైన ప్రకటన చేశారు. ముఖ్యంగా ఇరాన్‌పై యుద్ధాన్ని ఎప్పుడు ముగించాలనేది ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో చర్చించిన తర్వాతే నిర్ణయిస్తానని స్పష్టం చేశారు. అంతటితో ఆగకుండా ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ నియామకంపై స్పందిస్తూ.. అమెరికా ఆమోదం లేనిదే ఇరాన్‌లో ఏ నాయకుడూ ఎక్కువ కాలం అధికార బాధ్యతలు చేపట్టలేరని ఆయన హెచ్చరించారు. యుద్ధం ఎప్పుడు ముగుస్తుందన్న ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ.. "ఇది పరస్పర నిర్ణయం. నేను, నెతన్యాహు నిరంతరం మాట్లాడుకుంటున్నాం. సరైన సమయంలోనే నిర్ణయం తీసుకుంటాం. మేము లేకపోతే ఇరాన్ ఇప్పటికే ఇజ్రాయెల్‌ను నాశనం చేసేది" అని ఇజ్రాయెల్ మీడియా సంస్థకు తెలిపారు. అమెరికా వైమానిక దాడులు ఆపినా ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తుందా అన్న ప్రశ్నకు మాత్రం ఆయన సమాధానం దాటవేశారు. ప్రస్తుతం ఇరాన్ తన పొరుగు దేశాలైన యూఏఈ, కువైట్, బహ్రెయిన్, సౌదీ అరేబియాలోని అమెరికా సైనిక స్థావరాలు, చమురు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణి దాడులు చేస్తోంది. యుద్ధం 10వ రోజుకు చేరినా.. ఇరుపక్షాల మధ్య కాల్పుల విరమణ దిశగా ఎటువంటి అడుగులు పడకపోవడం ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ సందర్భంగానే ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ ఈ రకమైన కామెంట్లు చేశారు.

# ఎల్పీజీ సిలిండర్ బుకింగ్ గడువు పెంపు



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయంగా ప్రస్తుతం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం నడుస్తోంది. అమెరికా కూడా ఇరాన్‌పై దాడులు చేస్తుండగా..ఇరాన్ అమెరికా- ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాలపైనా భీకర దాడులు చేస్తోంది. ఈ యుద్ధం ప్రభావంతో చమురు, సహజవాయువు సరఫరాలో కొరత తలెత్తనుందనే భయాలు నెలకొన్నాయి. ఇప్పటికే వంట గ్యాస్ సిలిండర్ ధరల్ని కేంద్రం పెంచింది. గృహ వినియోగ సిలిండర్ ధర రూ. 60, కమర్షియల్ సిలిండర్ ధర రూ. 115 చొప్పున పెరిగింది. ఈ క్రమంలోనే గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్‌ను అడ్డుకునేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు సిలిండర్‌కు సిలిండర్‌కు మధ్య బుకింగ్ గడువు 21 రోజులుగా ఉండగా.. దీనిని 25 రోజులకు పెంచింది. చాలా మంది సిలిండర్లకు కొరత ఏర్పడవచ్చన్న భయాలతో.. ముందస్తుగా బుక్ చేస్తున్నారు. గతంలో సగటున 55 రోజులకు ఒకసారి సిలిండర్ బుక్ చేసుకునే వారు కూడా ఇప్పుడు పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో 15 రోజులకే గ్యాస్ బుక్ చేస్తుండటం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో 21 రోజుల లాకిన్ నిబంధన తెచ్చింది. ఇప్పుడు ఆ గడువును 25 రోజులకు పెంచినట్లు తెలుస్తోంది. ఎల్పీజీ సరఫరాలో కాస్త అంతరాయం నేపథ్యంలో.. వాస్తవానికి ఆయిల్ కంపెనీలు కొద్ది రోజుల ముందే ముందస్తు చర్యలకు దిగాయి. కనీస గడువును బుధవారం నుంచే చమురు సంస్థలు అనధికారికంగా అమల్లోకి తెచ్చినట్లు తెలుస్తోంది. డబుల్ సిలిండర్ ఉన్న వారికి గడువు 30 రోజులు.. సింగిల్ సిలిండర్ ఉన్న వారికి 21 రోజులుగా నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పుడు దానినే 25 రోజులకు చేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో వంట గ్యాస్ లభ్యతను నిర్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎమర్జెన్సీ పవర్స్‌ను ఉపయోగిస్తోంది. ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచాలని రిఫైనరీలను ఆదేశించింది. పారిశ్రామిక అవసరాలకు కాకుండా.. గృహ వినియోగదారులకు వంట గ్యాస్ సరఫరానే తొలి ప్రాధాన్యంగా ఉండాలని చమురు సంస్థలకు కేంద్రం స్పష్టం చేసింది.

# 8 దేశాల్లో యూపీఐ సేవలు




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటనలో యూపీఐ అంశం కూడా చర్చనీయాంశమైంది. ఇజ్రాయెల్ ఫాస్ట్ పేమెంట్ వ్యవస్థతో యూపీఐని అనుసంధానం చేయడంపై ఇరుదేశాలు చర్చలు జరిపాయి. యూపీఐని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆకాశానికెత్తేశారు. దీంతో త్వరలోనే ఇజ్రాయెల్‌లో కూడా యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. అయితే ఇప్పటికే 8 దేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులో ఉన్నాయనే సంగతి చాలామందికి తెలియదు. ఇన్‌స్టంట్‌గా జరిగే ఈ క్యాష్‌లెస్ పేమెంట్స్ వల్ల కొన్ని దేశాల్లో భారతీయ పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరగడం గమనార్హం. ఈ సేవలు వినియోగించుకోవాలంటూ యూపీఐ ఇంటర్నేషనల్ సెటప్ చేసుకుంటే సరిపోతుంది. ఎడారి దేశం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ప్రయాణించే భారతీయులు పేటీయం యాప్‌తో యూపీఐ పేమెంట్స్ చేసుకోవచ్చు. ఫోన్‌పే యూజర్లయితే మాష్రెఖ్‌కు చెందిన నియోపే టర్మినల్స్‌లో కూడా యూపీఐ సేవలు ఉపయోగించుకోవచ్చు. భారతీయ రూపాయల్లోనే ట్రాన్సాక్షన్ జరుగుతుంది. మారకం విలువను యూడా యాప్స్ చూపిస్తాయి. భారత్ తర్వాత యూపీఐ సేవలను ఆరంభించిన తొలి దేశం భూటాన్. రూపే కార్డుల పేమెంట్‌ను కూడా స్వీకరించే ఈ దేశంలో 2021 నుంచి బీహెచ్‌ఐఎం ఎనేబుల్ చేసిన యూపీఐ క్యూఆర్ పేమెంట్స్‌ను కూడా అనుమతించారు. దీంతో భారతీయ పర్యాటకులు ఎలాంటి ఇబ్బంది లేకుండా పేటీయంతో యూపీఐ సేవలు వినియోగించుకోవచ్చు. యూపీఐ సేవలు అనుమతించడంతో ఫ్రాన్స్‌కు భారతీయ పర్యాటకుల సంఖ్య విపరీతంగా పెరిగింది. 2024లో ఈఫిల్ టవర్ వద్ద యూపీఐ సేవలు ప్రారంభించిన తర్వాత.. భారతీయ పర్యాటకుల సంఖ్య సుమారు 40 శాతం పెరిగిందని అధికారులు చెప్తున్నారు. రెండేళ్ల క్రితమే 2024 మార్చి నెలలో నేపాల్‌లో యూపీఐ సేవలకు అనుమతి లభించింది. యూపీఐ ఇంటర్నేషనల్ ఎనేబుల్ చేసుకున్న వినియోగదారులు.. నేపాల్‌లో చాలా చోట్ల నేరుగా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పేమెంట్స్ చేసుకోవచ్చు. ద్వీపదేశం సింగపూర్‌లో కూడా 2024 జనవరి నుంచి యూపీఐ పేమెంట్స్ అందుబాటులోకి వచ్చాయి. భీమ్, పేటీయం, ఫోన్‌పే వంటి యాప్స్‌తో ఇక్కడ పేమెంట్స్ చేసుకోవచ్చు. సింగపూర్‌లో నివశించే భారతీయులు స్వదేశంలోని బంధువులకు డబ్బులు పంపేందుకు కూడా యూపీఐ సేవలను వినియోగించుకోవచ్చు. పొరుగు దేశం శ్రీలంకలో కూడా యూపీఐ సేవలు ఫుల్లుగా అందుబాటులో ఉన్నాయి. 2024 మే నుంచి అనుమతించిన ఈ సేవలతో లంకక్యూఆర్‌ను స్కాన్ చేసి నేరుగా పేమెంట్స్ చేయొచ్చు. భారత రూపాయిల్లోనే చెల్లింపులు జరుగుతాయి. అయితే కరెన్సీ మారకం విలువ కూడా యాప్‌లో కనపడుతుంది. భారత టూరిస్టులు మారిషస్‌లో కూడా యూపీఐ పేమెంట్స్ చెయ్యొచ్చు. 2024 ఫిబ్రవరిలో ఆ దేశం యూపీఐ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఈ దేశంలో రూపే సేవలు కూడా విస్తరించారు. ఇప్పుడు ఆ దేశంలో తీసుకునే రూపే కార్డులను భారత్‌లో కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉపయోగించుకోవచ్చు. ఎడారి దేశం ఖతర్‌లోని ప్రముఖ టూరిస్ట్ ప్లేసుల్లో, డ్యూటీ ఫ్రీ షాపుల్లో యూపీఐ సేవలు అందుబాటులో ఉన్నాయి. 2025 సెప్టెంబరులో యూపీఐ మాతృసంస్థ ఎన్‌పీసీఐ ఈ విషయాన్ని వెల్లడించింది. ఖతర్‌కు వెళ్లే అత్యధిక టూరిస్టులు వెళ్లే రెండో దేశం భారత్. యూపీఐ సేవల ద్వారా భారతీయ పర్యాటకులను ఆకర్షించడంతోపాటు, కరెన్సీ ఎక్స్‌చేంజ్ ఇబ్బందులను తొలగించేందుకు ఖతర్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మలేసియాలో కూడా అతిత్వరలో యూపీఐ పేమెంట్స్‌ను అందుబాటులోకి తెస్తామని గతేడాది అక్టోబరులో రేజర్‌పే ప్రకటించింది. అదే జరిగితే ఇష్టమొచ్చిన యూపీఐ యాప్ ద్వారా భారతీయ పర్యాటకులు నేరుగా పేమెంట్స్ చేసుకోవచ్చు.

# భారీగా పెరగనున్న భారత చమురు దిగుమతి బిల్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్, ఇజ్రాయెల్-యూఎస్ మధ్య పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ప్రపంచ ముడి చమురు ధరలు సోమవారం భారీగా పెరిగాయి. ఈ ఉద్రిక్తతల కారణంగా, సరఫరా భయాలు ముడి చమురు ధరలను బ్యారెల్‌కు దాదాపు 115 డాలర్లకు, ఒకానొక సమయంలో 125 డాలర్ల దగ్గరగా పెంచాయి. ఇది 2022 తర్వాత అత్యధిక స్థాయి. దీంతో దిగుమతి చేసుకున్న చమురుపై ఎక్కువగా ఆధారపడిన అనేక దేశాలకు ఆందోళన కలిగించింది. ముఖ్యంగా 85 శాతం చమురు దిగుమతిపై ఆధారపడిన మనదేశానికి ఇది భారం కానుంది. దీని కారణంగా, ప్రపంచ చమురు ధరలు పెరిగినప్పుడు, భారత్ అదే మొత్తంలో చమురును కొనుగోలు చేయడానికి చాలా ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుంది. గత ఆర్థిక సంవత్సరంలో (2024-25) మనదేశం దాదాపు 137 బిలియన్ డాలర్ల విలువైన 243 మిలియన్ టన్నుల ముడి చమురును దిగుమతి చేసుకుంది.ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100-115 మధ్య ఎక్కువ కాలం కొనసాగితే, మనదేశ చమురు దిగుమతి బిల్లు ప్రతి సంవత్సరం దాదాపు 56-64 బిలియన్ డాలర్లు(మన కరెన్సీలో రూ. 5-5.9 లక్షల కోట్లు) పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. దీనివల్ల కరెంట్ ఖాతా లోటును పెరుగుతుందని, రూపాయి మరింత బలహీనపడొచ్చు, ద్రవ్యోల్బణం కూడా పెరగడం ద్వారా దేశ ఆర్థికవ్యవస్థపై ఒత్తిడిని పెంచుతుంది. అయితే, ఇప్పటివరకు ఆ స్థాయి సంక్షోభం లేదని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్ అన్నారు. కానీ, మధ్యప్రాచ్యంలో ఘర్షణలు కొనసాగితే పరిస్థితి మరింత ప్రమాదంగా మారుతుంది. అధిక చమురు ధరలు ఇంధన ధరలు, రవాణా ఖర్చులు, మొత్తం ఆర్థిక వృద్ధితో సహా ఆర్థిక వ్యవస్థలోని అనేక భాగాలను ప్రభావితం చేస్తాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, చమురు సంస్థలు పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయి. దేశంలో తగినంత చమురు సరఫరాలను నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నాయి.

## ముడి చమురు ధరల పెరుగుదల ద్రవ్యోల్బణంపై పెద్ద ప్రభావం చూపదు



**హైదరాబాద్ పెన్ పవర్:** మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో ముడి చమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో దేశీయంగా ద్రవ్యోల్బణ పెరుగుతుందనే చర్చలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు.ప్రపంచ వ్యాప్తంగా ముడి చమురు ధరలు ఇటీవల పెరగడం వల్ల దేశంలో ద్రవ్యోల్బణం భారీగా పెరుగుతుందనే ఆందోళనలు అవసరంలేదని నిర్మలా సీతారామన్ అన్నారు. ఇప్పటికే దేశంలో ద్రవ్యోల్బణం చాలా తక్కువగా ఉంది, భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) నిర్దేశించిన కనిష్ట పరిమితికి దగ్గరగానే ఉంది. ముడి చమురు ధరలూ దాదాపు ఒక ఏడాది కాలంగా తగ్గుతున్నాయని ఆమె ప్రస్తావించారు. అయితే, ఇటీవల పశ్చిమాసియాలో భౌగోళిక రాజకీయ సంఘర్షణలు ప్రారంభమైన తర్వాత ధరలు పెరిగాయి. ఆ సమయంలో, భారత ముడి చమురు ధర బ్యారెల్‌కు 69.01 డాలర్ల నుంచి రోజుల వ్యవధిలో బ్యారెల్‌కు 80.16కి పెరిగిందని మంత్రి వివరించారు. ఆర్‌బీఐ నివేదిక ప్రకారం, ముడి చమురు

ధరలు 10 శాతం పెరిగితే, దేశంలో ద్రవ్యోల్బణం 0.30 శాతం మాత్రమే పెరగవచ్చు. అయితే, ఈ పెరుగుదల కూడా వాస్తవంలో రూపాయి-డాలర్ మారకం రేటు, ప్రపంచ చమురు సరఫరా, డిమాండ్, ఆర్థిక విధానాలు వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుందన్నారు.

# జంక్ ఫుడ్ చూడగానే నోరూరుతోందా?



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో రుచికరమైన జంక్ ఫుడ్ వైపు మనసు మళ్లడం చాలా సహజం. పిజ్జాలు, బర్గర్లు, సమోసాలు వంటివి చూసినప్పుడు మన మెదడులో కలిగే 'క్రేవింగ్స్' మనల్ని నియంత్రించుకోనివ్వవు. అయితే ఇవి కేవలం తాత్కాలిక రుచిని మాత్రమే ఇచ్చి.. దీర్ఘకాలంలో ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులకు కారణమవుతాయి. జంక్ ఫుడ్ తినాలనే బలమైన కోరికను మొగ్గలోనే తుంచివేసి, ఆరోగ్యకరమైన లైఫ్ స్టైల్ అలవర్చుకోవడానికిగల 7 ప్రభావవంతమైన చిట్కాలేంటో తెలుసుకుందాం. ఆఫీసు నుండి వస్తుంటే రోడ్డు పక్కన వేడివేడి సమోసాల వాసన మిమ్మల్ని లాగుతోందా? లేదా ఇంట్లో కూర్చున్నప్పుడు సడన్ గా పిజ్జా ఆర్డర్ చేయాలనిపిస్తోందా? నిజానికి ఇది మీకు ఆకలి వేయడం వల్ల వచ్చే కోరిక కాదు. మీ మెదడులో జరిగే కొన్ని రసాయన మార్పుల వల్ల కలిగే మాయాజాలం. ఈ క్రేవింగ్స్ లో చిక్కుకుంటే ఆరోగ్యం పాడవ్వడమే కాకుండా జేబు కూడా ఖాళీ అవుతుంది. మరి మనల్ని మనం నియంత్రించుకుంటూ, ఆ జంక్ ఫుడ్ ఆలోచనల నుండి ఎలా బయటపడాలి? మీ లైఫ్ స్టైల్ ను మార్చేసే ఆ 7 అద్భుతమైన చిట్కాలు. చాలా సార్లు మన శరీరం దాహాన్ని ఆకలిగా తప్పుగా అర్థం చేసుకుంటుంది. ఏదైనా జంక్ ఫుడ్ తినాలని అనిపించినప్పుడు వెంటనే ఒక గ్లాసు నీరు తాగండి. ఒక 15 నిమిషాలు ఆగి చూడండి. అప్పుడు ఆ కోరిక ఆటోమేటిక్ గా తగ్గిపోవడాన్ని మీరు గమనిస్తారు. ఆహారంలో ప్రోటీన్ ఎక్కువగా ఉంటే అది మీకు ఎక్కువ సేపు కడుపు నిండుగా ఉన్న అనుభూతిని ఇస్తుంది. గుడ్లు, పప్పు ధాన్యాలు, పనీర్ లేదా నట్స్ తీసుకోవడం వల్ల మధ్యలో చిరుతిళ్లు తినాలనే కోరిక కలగదు. నిద్రలేమి వల్ల శరీరంలో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. నిద్ర సరిగ్గా లేనప్పుడు శరీరం శక్తి కోసం చక్కెర, పిండి పదార్థాలు ఎక్కువగా ఉండే జంక్ ఫుడ్ వైపు మొగ్గు చూపుతుంది. రోజుకు 7-8 గంటల గాఢ నిద్ర క్రేవింగ్స్‌ను అదుపులో ఉంచుతుంది. ఒత్తిడిలో ఉన్నప్పుడు శరీరం 'కార్టిసాల్' అనే హార్మోన్‌ను విడుదల చేస్తుంది. ఇది మనల్ని తీపి, నూనె పదార్థాలు తినేలా ప్రేరేపిస్తుంది. యోగా, ధ్యానం లేదా నచ్చిన పనిని చేయడం ద్వారా ఈ ఒత్తిడిని తగ్గించుకోవచ్చు.

బరువు తగ్గాలని భోజనం మానేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పడిపోయి విపరీతమైన ఆకలి పుడుతుంది. ఫలితంగా కళ్ల ముందు కనిపించిన జంక్ ఫుడ్‌ను ఆపలేనంతగా తినేస్తారు. కాబట్టి క్రమం తప్పకుండా ఆహారం తీసుకోవడం ముఖ్యం. చిప్స్‌కు బదులుగా నట్స్ (జీడిపప్పు, బాదం) లేదా వేయించిన శనగలు తీసుకోండి. తీపి తినాలనిపిస్తే చాక్లెట్లకు బదులుగా పండ్లు లేదా ఖర్జూరాలను ఎంచుకోండి. ఇలా చేయడం వల్ల రుచితో పాటు ఆరోగ్యం కూడా లభిస్తుంది. వంటగదిలో లేదా ఆఫీసు డెస్క్‌లో జంక్ ఫుడ్ నిల్వ ఉంచకండి. బయటకు వెళ్ళేటప్పుడు ఇంట్లోనే ఏదైనా తిని వెళ్లడం వల్ల బయటి తిండిపై ఆశ కలగదు. షాపింగ్ చేసేటప్పుడు ముందే లిస్ట్ రాసుకుని వెళ్లడం వల్ల అనవసరమైన చిరుతిళ్లు కొనకుండా ఉండవచ్చు.

# రోగనిరోధకత పెంచడంలో దీనికి సాటి లేదు



గ్రామీణ ప్రాంతాల్లో ప్రయాణించేటప్పుడు రోడ్డుకు ఇరువైపులా విస్తారంగా జీడి తోటలు కనిపిస్తుంటాయి. అయితే మన కళ్లు ఎప్పుడూ ఆ చెట్టు చివరన వేలాడే జీడి గింజల (జీడిపప్పు) మీదే ఉంటాయి. కానీ ఆ గింజకు ఆధారమైన రంగురంగుల జీడి పండును మాత్రం మనం పెద్దగా పట్టించుకోము. తోటల్లో రాలిపోయి, నేలపాలయ్యే ఆ పండులో ఎన్ని అద్భుత ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయో తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. కేవలం గింజ కోసం పండును పారేయడం ఎంత పెద్ద పొరపాటో తెలుసా? ఆ చెట్టు ఇచ్చే గింజను మనం వేల రూపాయలు పోసి కొంటాం. కానీ అదే చెట్టు ఇచ్చే పండును మాత్రం కనీసం ఉచితంగా ఇచ్చినా తీసుకోము. పల్లెటూళ్లలో వేల టన్నుల కొద్దీ ఈ పండ్లు నేల రాలి కుళ్లిపోతుంటాయి. తీపి, వగరు కలగలిసిన రుచితో ఉండే ఈ పండును కేవలం ఒక వ్యర్థంలా చూడటం మన అవగాహన లోపమే. నిజానికి పోషకాహార నిపుణులు దీనిని ఒక 'సూపర్ ఫుడ్'గా అభివర్ణిస్తున్నారు. మన శరీరానికి కావలసిన విటమిన్లు, ఖనిజాల గనిగా పిలిచే పండే జీడి మామిడి పండు. జీడి పండులో విటమిన్ సి అపారంగా ఉంటుంది. నిమ్మ, నారింజ వంటి పండ్ల కంటే కూడా ఇందులో విటమిన్ సి స్థాయిలు ఎక్కువగా ఉంటాయని పరిశోధనలు చెబుతున్నాయి. ఇది శరీర రోగనిరోధక శక్తిని పెంచి జలుబు, దగ్గు, వైరల్ ఇన్ఫెక్షన్ల నుండి రక్షణ కల్పిస్తుంది. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు ఈ పండును తీసుకోవడం వల్ల సీజనల్ వ్యాధుల బారి నుండి తప్పించుకోవచ్చు. నేటి కాలంలో మహిళలు, గర్భిణీలు ఎక్కువగా ఎదుర్కొనే సమస్య రక్తహీనత. జీడి పండులో ఐరన్, కాపర్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉండటం వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తి పెరుగుతుంది. సహజ సిద్ధంగా రక్తాన్ని వృద్ధి చేసే గుణం ఈ పండుకు ఉంది. రోజూ ఈ పండును ఆహారంలో భాగంగా తీసుకుంటే రక్తహీనత సమస్య చాలా వరకు తగ్గుముఖం పడుతుంది. జీడి మామిడిలో ఫైబర్ (పీచు పదార్థం) అధికంగా ఉంటుంది. ఇది పొట్ట పనితీరును మెరుగుపరిచి మలబద్ధకం, గ్యాస్, పొట్ట ఉబ్బరం వంటి సమస్యలను నివారిస్తుంది. తక్కువ క్యాలరీలు ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక అద్భుతమైన స్నాక్. ఇది తిన్న వెంటనే కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది, తద్వారా అనవసరమైన చిరుతిళ్లపై ఆశ కలగదు. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు శరీర కణాలను రక్షించి చర్మాన్ని కాంతివంతంగా మారుస్తాయి. ముఖంపై ముడతలు, గీతలు రాకుండా నివారిస్తాయి. అలాగే ఇందులోని పొటాషియం రక్తపోటును నియంత్రించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీడి పండు కొంచెం కషాయం లేదా వగరు రుచిగా అనిపించవచ్చు. కానీ దీనిని శుభ్రంగా కడిగి తీసుకోవడం వల్ల మన శరీరానికి అందే పోషకాలు అమూల్యం. కేవలం జీడిపప్పు కోసమే కాకుండా, ఆరోగ్యం కోసం ఈ అద్భుతమైన పండును కూడా ఆదరించండి. ప్రకృతి ఇచ్చిన ఈ సహజ ఔషధాన్ని ఇకపై నేలపాలు చేయకండి!

# ఆరోగ్యానికి మంచిదే కదా అని తినేస్తున్నారా.!



టమాటాలు నిత్యవసరమైనప్పటికీ, వాటి తొక్కపై పురుగుమందుల అవశేషాలు చేరే ప్రమాదం ఉంది. కేవలం నీటితో కడగడం సరిపోదు. ఉప్పునీటిలో 15-20 నిమిషాలు నానబెట్టి, బాగా రుద్దడం ద్వారా పురుగుల మందుల అవశేషాలను గణనీయంగా తగ్గించవచ్చు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. దాదాపు ప్రతి వంటింట్లోనూ టమాటాలను నిత్యం వాడతారు. అయితే, ఇటీవలి కాలంలో వ్యవసాయంలో పురుగుమందుల వాడకం పెరగడంతో, తొక్కతో తినే టమాటాలను సరిగ్గా శుభ్రం చేయడం అత్యవసరం. కేవలం నీటితో కడగడం వల్ల టమాటా తొక్కపై అంటుకున్న పురుగుమందుల అవశేషాలు పూర్తిగా తొలగిపోవు. టమాటా తొక్క సన్నగా, సున్నితంగా ఉండటం వల్ల రసాయనాలు సులభంగా అంటుకుంటాయి. ఈ రసాయన అవశేషాలను తగ్గించడానికి ఒక పద్ధతి ఉప్పునీటితో శుభ్రం చేయడం. టమాటాలను ఉప్పునీటిలో దాదాపు 15 నుండి 20 నిమిషాలు నానబెట్టాలి. ఉప్పులోని సహజ శుభ్రపరిచే లక్షణాలు పురుగుమందులను వదిలిస్తాయి. అనంతరం, శుభ్రమైన నీటితో కడిగి, చేతులతో సున్నితంగా రుద్దడం వల్ల మట్టి, దుమ్ము, బ్యాక్టీరియా తొలగిపోతాయి. టమాటాలను నిల్వ చేసిన తర్వాత లేదా ఉపయోగించే ముందు తప్పనిసరిగా కడగాలి. అయితే, వండడానికి ముందు టమాటాలను ఎక్కువసేపు నీటిలో నానబెట్టకూడదు, ఎందుకంటే ఇది వాటి ఆకృతిని ప్రభావితం చేయవచ్చు. టమాటాల్లో దెబ్బతిన్న భాగాలను ముందుగానే తొలగించడం మంచిది. ఒకవేళ మీరు పురుగుమందుల అవశేషాల గురించి మరింత ఆందోళన చెందుతుంటే, టమాటా తొక్క తీసి కూడా ఉపయోగించవచ్చు.

ఇది చర్మం నుండి ఉపరితల పురుగుమందుల అవశేషాలను చాలా వరకు తొలగించడానికి సహాయపడుతుంది. స్థానికంగా పండించిన టమాటాలు కొనుగోలు చేయడం ద్వారా పురుగుమందులకు గురయ్యే అవకాశాన్ని తగ్గించుకోవచ్చు. ఉప్పునీటి పద్ధతి ఉపరితల పురుగుమందులను మాత్రమే తగ్గిస్తుందని గుర్తుంచుకోవాలి. టమాటాలను పండించే సమయంలో వాటిలోకి చొప్పించిన (సిస్టమిక్) రసాయనాలను ఈ పద్ధతి పూర్తిగా తొలగించదు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లలో భాగంగా, వంటింట్లో ఇలాంటి చిన్న చిన్న శుభ్రపరిచే చర్యలు మీ కుటుంబ ఆరోగ్యంపై పెద్ద ప్రయోజనాలను కలిగిస్తాయి. టమాటా తొక్కలను ఉప్పుతో సరిగ్గా శుభ్రం చేయడం పురుగుమందుల అవశేషాలను తగ్గించడానికి ఒక సులభమైన, ప్రభావవంతమైన పద్ధతి.

## అన్నం తిన్న తర్వాత.. ఆ అలవాటు ఉంటే డేంజర్!



భోజనం తర్వాత టీ తాగడం జీర్ణక్రియకు సహాయపడుతుందనే నమ్మకం ఉన్నా, నిపుణుల ప్రకారం ఇది ఆరోగ్యానికి ప్రమాదకరం. విటమిన్ ః12 లోపం, ఐరన్ తగ్గడం, రక్తహీనత, గుండెల్లో మంట, మలబద్ధకం, నిద్రలేమి వంటి అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. భోజనం చేశాక కనీసం 45 నిమిషాల నుంచి గంట తర్వాత టీ తాగడం మంచిది. ఉదయం లేదా సాయంత్రం వేళ ఒక కప్పు వేడి టీ అలసటను దూరం చేసి మానసిక స్థితిని రిఫ్రెష్ చేస్తుంది. అయితే, రోజుకు అనేక కప్పుల టీ తాగే అలవాటు శరీర ఆరోగ్యాన్ని క్రమంగా బలహీనపరుస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా భోజనం చేసిన వెంటనే టీ లేదా కాఫీ తాగడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. కొంతమందికి భోజనం తర్వాత టీ జీర్ణక్రియకు సహాయపడుతుందని, నీరసాన్ని తగ్గిస్తుందని నమ్మకం ఉన్నా, ఈ అలవాటు ఆరోగ్యానికి హానికరం. టీలోని టాక్సిన్లు విటమిన్ ః12 ను తగ్గించవచ్చు. టానిన్లు ఆహారంలోని ఐరన్‌ను గ్రహించకుండా అడ్డుకుంటాయి, దీనివల్ల రక్తహీనతకు దారితీస్తుంది. టీలో టానిన్ అనే పదార్థం ఉంటుంది. ఈ టానిన్లు ఆహారంలోని ఐరన్‌తో కలిసిపోతాయి, దీని కారణంగా శరీరం ఆహారంలోని ఐరన్‌ను సమర్థవంతంగా గ్రహించలేకపోతుంది. ప్రతిరోజు భోజనం చేసిన వెంటనే టీ తాగడం వల్ల శరీరంలో ఇనుము లోపానికి కారణమవుతుంది, ఇది రక్తహీనతకు దారితీస్తుంది. ఈ ప్రభావం ముఖ్యంగా వెజిటేరియన్లకు మరింత హానికరం, ఎందుకంటే వారి ఆహారంలో ఐరన్ మూలాలు పరిమితంగా ఉంటాయి. కెఫిన్ కడుపులో ఆమ్లాలను పెంచి గుండెల్లో మంటను కలిగిస్తుంది. థియోఫిలిన్ మలబద్ధకానికి కారణం కాగా, ప్రోటీన్ల జీర్ణక్రియను కష్టతరం చేస్తుంది. భోజనం తర్వాత కాఫీ తాగడం వల్ల రక్తపోటు తాత్కాలికంగా పెరుగుతుంది. రాత్రిపూట టీ లేదా కాఫీ తాగితే కెఫిన్ వల్ల నిద్రలేమి సమస్యలు కూడా వస్తాయి. ఆరోగ్య నిపుణుల సలహా ప్రకారం, భోజనం చేసిన తర్వాత కనీసం 45 నిమిషాల నుంచి ఒక గంట తర్వాత టీ లేదా కాఫీ తాగాలి.

## అరటిపండు తిన్న వెంటనే నీళ్లు తాగితే ఏమవుతుంది..?



ఇంట్లో పెద్దలు అరటిపండు తిన్న తర్వాత నీళ్లు తాగవద్దని తరచుగా చెబుతుంటారు. చాలామంది దీనిని మూఢనమ్మకంగా కొట్టిపారేస్తారు. కానీ శాస్త్రీయంగా, ఆయుర్వేదం ప్రకారం దీని వెనుక చాలా బలమైన కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా వేసవిలో ఆకలిగా ఉన్నప్పుడు తొందరపడి అరటిపండు తిని నీళ్లు తాగడం మీ జీర్ణవ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. జీర్ణక్రియపై ప్రభావం: అరటిపండును ఆయుర్వేదంలో చల్లని పండుగా పరిగణిస్తారు. అరటిపండు తిన్న వెంటనే నీళ్లు తాగడం వల్ల కడుపులో ఆహారాన్ని జీర్ణం చేసే రసాలు బలహీనపడతాయి. జీర్ణ ప్రక్రియ నెమ్మదించడం వల్ల పండు సరిగ్గా జీర్ణం కాకుండా కడుపులోనే ఉండిపోతుంది. దీనివల్ల కడుపు ఉబ్బరం, అజీర్తి సమస్యలు వస్తాయి. కఫ సమస్యలు: ఆయుర్వేదం ప్రకారం, అరటిపండ్లు శరీరంలో కఫను పెంచుతాయి. అరటిపండు తిన్న వెంటనే ముఖ్యంగా చల్లటి నీళ్లు తాగడం వల్ల శరీరంలో ఉష్ణోగ్రత అకస్మాత్తుగా మారి, గొంతు నొప్పి, తీవ్రమైన దగ్గు లేదా జలుబుకు దారితీస్తుంది. ఇప్పటికే కఫ సమస్యలు ఉన్నవారు ఈ తప్పు అస్సలు చేయకూడదు. రక్తంలో చక్కెర స్థాయిలు: అరటిపండ్లలో ఫైబర్, సహజ చక్కెర అధికంగా ఉంటాయి. తిన్న వెంటనే నీళ్లు తాగడం వల్ల చక్కెర శాతం శరీరంలోకి చాలా వేగంగా శోషించబడుతుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరిగి ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. కడుపు నొప్పి: అరటిపండు తిన్న వెంటనే నీళ్లు తాగడం వల్ల కడుపులో గ్యాస్ట్రిక్ యాసిడ్ సమతుల్యత దెబ్బతింటుంది. దీనివల్ల కడుపులో భారంగా అనిపించడం, కడుపు నొప్పి లేదా గ్యాస్ట్రిక్ సమస్యలు రావడమే కాకుండా కొంతమందిలో వాంతులు లేదా వికారం కూడా సంభవించవచ్చు. నీరు ఎప్పుడు తాగాలి?: ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఏదైనా పండు తిన్న తర్వాత కనీసం 20 నుండి 30 నిమిషాల తర్వాత నీళ్లు తాగడం మంచిది. మీకు బాగా దాహం వేస్తే, అరటిపండు తినడానికి 10 -15 నిమిషాల ముందు నీళ్లు తాగండి. అరటిపండ్లు గొప్ప శక్తి వనరులు, కానీ వాటిని తినే విధానం కూడా ముఖ్యమే. ఈ జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోండి.

## నిద్ర తగ్గితే నిర్ణయాలు తప్పుతాయా!

నేటి సమాజంలో ఉద్యోగాల కారణంగా ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది పని ఒత్తిడి, ఇతర కారణాల వల్ల రాత్రిళ్లు తక్కువ సమయం నిద్రపోతున్నారు. రోజుకు కేవలం 6 గంటలు మాత్రమే నిద్రపోతూ, తాము ఆరోగ్యంగానే ఉన్నామని భావిస్తున్నారు. కానీ అది కేవలం వారి భ్రమ మాత్రమేనని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వరుసగా రెండు వారాల పాటు రోజుకు 6 గంటల చొప్పున నిద్ర తగ్గించడం వల్ల మెదడు పనితీరు మందగిస్తుంది. ఇది ఏకధాటిగా రెండు రోజుల పాటు నిద్ర లేని వ్యక్తి మెదడు ఎలా పనిచేస్తుందో, అంతటి ప్రమాదకర స్థితికి చేరుకుంటుందని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. ప్రతి మనిషికి నిద్ర ఎంతో అవసరం.. కానీ నిద్ర తగ్గడం వల్ల మన దైనందిన పనితీరులో మార్పులు వచ్చినప్పటికీ, దానిని మనం వెంటనే గుర్తించలేకపోవడం అసలైన సమస్య. దీనివల్ల ఏకాగ్రత దెబ్బతినడంతో పాటు, ముఖ్యమైన విషయాల్లో నిర్ణయాలు తీసుకోవడంలో తప్పులు జరిగే అవకాశం ఉంది. మెదడులోని నాడీ వ్యవస్థ సరిగ్గా స్పందించక పోవడం వల్ల జ్ఞాపకశక్తి మందగించడం, చిరాకు, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు తలెత్తుతాయి. నిద్ర తక్కువైన ప్రతిరోజూ మెదడు తన సామర్థ్యాన్ని కోల్పోతూనే ఉంటుందని వైద్యులు వివరిస్తున్నారు. మెదడు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే వయస్సును బట్టి రోజుకు కనీసం 7 నుంచి 9 గంటల గాఢ నిద్ర తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు. సరైన నిద్ర వల్ల మెదడులోని వ్యర్థాలు శుభ్రపడటమే కాకుండా, కణాలు తిరిగి పుంజుకుంటాయి. నిద్రను నిర్లక్ష్యం చేయడం వల్ల దీర్ఘకాలంలో అల్జీమర్స్, అధిక రక్తపోటు, ఇతర నాడీ సంబంధిత వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రతి ఉద్యోగి తన పని కంటే నిద్రకే ప్రాధాన్యత ఇవ్వాలని వైద్య నిపుణులు కోరుతున్నారు.

# వరల్డ్ కప్ ఫైనల్‌లో గొడవ.. అర్ష్‌దీప్ సింగ్‌కి షాక్ ఇచ్చిన ఐసీసీ




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా నంబర్--1 టీ20 బౌలర్ అర్షదీప్ సింగ్ పై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ బిగ్ షాక్ ఇచ్చింది. పొట్టి ప్రపంచకప్ 2026 ఫైనల్లో న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ పట్ల ప్రవర్తించిన తీరుపై భారీగా ఫైన్ విధించింది. మ్యాచ్ ఫీజ్ లో 15 శాతం కోత పెట్టడంతో పాటు ఓ డీమెరిట్ పాయింట్ కూడా ఇచ్చింది. గత 24 నెలల్లో ఇదే ఫస్ట్ తప్పిదం కావడంతో అర్షదీప్ మ్యాచ్ నిషేధం ప్రమాదాన్ని తప్పించుకున్నాడు. పూర్తి వివరాల్లోకి వెళితే.. తాజాగా ముగిసిన టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో డారిల్ మిచెల్ పైకి అర్షదీప్ ప్రమాదకరంగా బంతిని విసిరాడు. ఈ ఘటనను సీరియస్ గా తీసుకున్న ఐసీసీ అతడిపై కఠిన చర్యలు చేపట్టింది. వాస్తవానికి డారిల్ మిచెల్ పై అర్షదీప్ అంత సీరియస్ గా బంతిని విసరాల్సిన పని లేదు.. ఫాలో అప్ లో భాగంగా బాల్ ని వికెట్లపైకి విసరడంతో ప్రమాదవశాత్తు అది మిచెల్ కి గట్టిగా తాకింది. ఆ సమయంలో మిచెల్ సైతం సహనాన్ని కోల్పోవడంతో.. అర్షదీప్ అతన్ని పట్టించుకోకుండా తాను బౌలింగ్ చేసేందుకు వెళ్లిపోయాడు. దీంతో భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సర్ది చెప్పడంతో ఆ గొడవ అంతటితో ఆగిపోయింది. ఈ ఘటన జరిగిన తర్వాత మిచెల్ కి క్షమాపణలు చెప్పిన అర్షదీప్ షేక్ హ్యాండ్ ఇచ్చి హగ్ చేస్తున్నారు.

ఇలాంటి ఘటనలు ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ లోని ఆర్టికల్ 2.9 రూల్స్ ఉల్లంఘన కిందికి వస్తాయి. దీని ప్రకారం, బంతి లేదా ఇతర క్రికెట్ సామగ్రిని మరో ప్లేయర్ వైపు అనుచితంగా లేదా ప్రమాదకరంగా విసరడం తప్పు.. ఇందుకు తగిన మూల్యాన్ని అర్షదీప్ చెల్లించుకున్నాడు. ఇక ప్రపంచకప్ ఫైనల్లో కివీస్ పై భారత్ 96 పరుగుల తేడాతో గెలిచి వరుసగా రెండో టీ20 వరల్డ్ కప్ ని సొంతం చేసుకుంది. మొత్తంగా ఐదో ప్రపంచకప్ లని టీమిండియా ఇప్పటి వరకు (1983, 2011 (వన్డే), 2007, 2024, 2026 (టీ20)) కైవసం చేసుకుంది.

# హార్దిక్ కుటుంబంలో చిచ్చు పెట్టిన మహికా శర్మ.. విడిపోతున్న పాండ్యా బ్రదర్స్..?




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా కుటుంబంలో అతడి గర్ల్ ఫ్రెండ్ మహికా శర్మ చిచ్చు పెట్టింది. ఇద్దర అన్నదమ్ముల ( హార్దిక్-- కృనాల్ పాండ్యా) మధ్య విభేదాలు వచ్చాయా అనే చర్చ ప్రస్తుతం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. ఇటీవల జరిగిన టీ20 ప్రపంచకప్ 2026 తర్వాత అభిమానులు గమనించిన కొన్ని విషయాలు ఈ ఊహాగానాలకు బలం చేకూర్చుతున్నాయి. వరల్డ్ కప్ గెలిచిన తర్వాత దేశవ్యాప్తంగా సంబరాలు జరిగాయి.. ఈ టోర్నీలో హార్దిక్ పాండ్య కీలక పాత్ర పోషించాడు. ఈ విజయానికి సంబంధించిన పోస్టులు లేదా అభినందనలు అతని అన్న క్రునాల్, వదిన పంకురి శర్మ నుంచి నెట్టింట ఎక్కడ కనిపించకపోవడంతో ఫ్యాన్స్ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు, ఫైనల్ మ్యాచ్ లో కృనాల్ పాండ్యా, ఆయన భార్య స్టేడియంలో కనిపించకపోవడం ఈ చర్చకు మరింతగా వైరల్ అవుతుంది. దీంతో ఇద్దరు సోదరుల మధ్య ఏమైనా విభేదాలు వచ్చాయా అనే ప్రశ్నలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కొంతమంది ఫ్యాన్స్ అభిప్రాయం ప్రకారం.. హార్దిక్ పాండ్యా-- మోడల్ మహికా శర్మ మధ్య ఉన్న సన్నిహిత సంబంధం వల్లే ఈ పరిస్థితికి కారణమై ఉండొచ్చని పేర్కొంటున్నారు. 25 ఏళ్ల మహికా శర్మ టీ20 వరల్డ్ కప్ మొత్తం హార్దిక్‌తో కలిసి ప్రయాణిస్తుస్తూ స్టేడియంలో అతనికి సపోర్టు చేసింది. ముంబైలోని వాంఖెడే స్టేడియంలో ఇంగ్లాండ్‌తో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్ సమయంలో హార్దిక్ కుమారుడు అగస్త్య పాండ్య కూడా మహికాతో కలిసి మ్యాచ్‌ను వీక్షించాడు. హార్దిక్ 12 బంతుల్లో 27 పరుగులు చేసి అవుట్ కావడంతో అగస్త్య కొంత నిరాశకు గురైనట్లు కనిపించగా, మహికా అతన్ని ఓదార్చిన దృశ్యాలు కూడా నెట్టింట వైరల్ అయ్యాయి. ఫైనల్ లో గెలిచిన అనంతరం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో హార్దిక్-- మహికా రొమాన్స్ చేసుకోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. సోషల్ మీడియాలో ఈ విషయంపై ఫ్యాన్స్ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఇది కేవలం ఊహాగానం మాత్రమే అంటున్నారు. నెట్టింట పోస్టులు పెట్టకపోతే కుంటుంబంలో విభేదాలు ఉన్నాయని అనుకోవడం సరైంది కాదు.. ఫ్యామిలిలో చిన్న చిన్న మనస్పర్ధలు వస్తుంటాయని ఒక యూజర్ రాసుకొచ్చాడు. మరో వ్యక్తి ఇలా కామెంట్ పెట్టాడు.. హార్దిక్ గత ఏడాది నుంచి వేరుగా ఉంటున్నాడు.. మహికాతో జరిగిన ఎంగేజ్‌మెంట్‌కు కూడా కృనాల్‌ను ఆహ్వానించలేదని తెలుస్తుందని పేర్కొన్నాడు. అయితే ఒక ప్రేమ ఇద్దరి అన్నదమ్ముల మధ్య బంధాన్ని విడదీసిందని మరో నెటిజన్ కామెంట్ చేశాడు. అయితే, ఇప్పటి వరకు హార్దిక్ పాండ్యా గానీ కృనాల్ పాండ్యా కానీ ఈ విషయంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దాంతో ప్రస్తుతం జరుగుతున్న చర్చ అంతా అభిమానుల ఊహాగానాలకే పరిమితమైంది.

# రెండ్రోజుల పాటు బాగా తిని, హాయిగా నిద్రపోతా: సూర్యకుమార్ యాదవ్




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ వంటి మెగా టోర్నీని గెలిచిన తర్వాత మీ తదుపరి ప్రణాళిక ఏంటి? అని అడిగితే ఏ కెప్టెన్ అయినా తర్వాతి సిరీస్‌ల గురించో, భవిష్యత్ సవాళ్ల గురించో చెబుతారు. కానీ టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాత్రం చాలా సరదాగా, సింపుల్‌గా సమాధానమిచ్చాడు. "ప్రస్తుతానికి నా ప్లాన్ ఒక్కటే. ఇంటికి వెళ్లి, మంచి భోజనం చేసి, రెండ్రోజులు హాయిగా నిద్రపోవాలి. ఆ తర్వాతే మిగతా విషయాల గురించి ఆలోచిస్తా" అని తన తక్షణ కర్తవ్యాన్ని వెల్లడించాడు. స్వదేశంలో జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో గెలిచి, ఈ ఘనత సాధించిన తొలి ఆతిథ్య జట్టుగా చరిత్ర సృష్టించిన ఆనందంలో ఉన్న సూర్య... ముంబైలోని తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడాడు.ఈ విజయం జట్టు సభ్యులదే కాదు, అభిమానులది కూడా అని అన్నాడు. "మీరంతా మాతో సమానంగా సంబరాలు చేసుకున్నారు. మీ అందరికీ అభినందనలు. భారత్‌లో ప్రపంచకప్ గెలవడం చాలా ప్రత్యేకమైన అనుభూతి. ఎంతో మంది మద్దతు, ప్రార్థనల వల్లే ఇది సాధ్యమైంది" అని తెలిపాడు. ఈ విజయం వెనుక మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ప్రోత్సాహం ఎంతో ఉందని సూర్య గుర్తు చేసుకున్నాడు. "2024లో రోహిత్ కెప్టెన్సీలోనే మేం టీ20 ప్రపంచకప్ గెలిచాం. ఆ తర్వాత అతడు కెప్టెన్సీ నుంచి తప్పుకున్నప్పుడు నాపై పూర్తి నమ్మకం ఉంచాడు. గత రెండేళ్లుగా ఈ జట్టును విజయవంతంగా నడిపించాను. ఇప్పుడు ప్రపంచకప్ కూడా గెలిచాం. నాపై రోహిత్ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టడం చాలా ఆనందంగా ఉంది. ఈ విజయం యావత్ భారతదేశానిది" అని సూర్య వివరించాడు. టోర్నమెంట్‌కు ముందు రోహిత్ వ్యాఖ్యలను కూడా సూర్య పంచుకున్నాడు. "మీ జట్టు చాలా బాగుంది. ధైర్యంగా ఆడండి. గెలుపు మీదే అవుతుంది" అని రోహిత్ చెప్పిన మాటలు తమలో స్ఫూర్తి నింపాయని అన్నాడు.

ప్రస్తుత విజయంతోనే ఆగిపోమని, భవిష్యత్ లక్ష్యాలపై తమకు స్పష్టమైన ప్రణాళిక ఉందని సూర్య వెల్లడించాడు. "2028లో జరగనున్న ఒలింపిక్స్‌లో క్రికెట్ తరఫున దేశానికి స్వర్ణ పతకం అందించడమే మా తదుపరి లక్ష్యం. అదే ఏడాది మరో టీ20 ప్రపంచకప్ కూడా ఉంది. కాబట్టి హ్యాట్రిక్ ప్రపంచకప్‌లు గెలిచేందుకు మా వంతు కృషి చేస్తాం" అని ధీమా వ్యక్తం చేశాడు. ప్రపంచకప్ గెలిచిన రాత్రి జరిగిన సంబరాల గురించి చెబుతూ... "ఆ రాత్రి మేం ఏం చేశామో చెప్పాలనుంది కానీ... ఉదయం 8 గంటల వరకు మేల్కొనే ఉన్నాం. ఒక టీమ్‌గా గెలిచినప్పుడు సంబరాలు కూడా కలిసే చేసుకోవాలి. అందుకే మేమంతా కలిసే ఆనందాన్ని పంచుకున్నాం" అని సూర్య తెలిపాడు.వరుసగా రెండుసార్లు (2024, 2026) ఐసీసీ టోర్నీలు గెలవడంతో తమపై ఒత్తిడి ఉన్నప్పటికీ, సరైన సమయంలో రాణించామని సూర్య పేర్కొన్నాడు. ఒత్తిడి లేకపోతే ఆటలో మజా ఉండదని వ్యాఖ్యానించాడు. ముంబై చేరుకున్న తర్వాతే ప్రపంచకప్ గెలిచామనే అసలైన భావన కలుగుతోందని, ఈ ఆనందం చాలాకాలం పాటు తనతోనే ఉంటుందని చెప్పుకొచ్చాడు. తన క్రికెట్ ప్రయాణం మొదలైన ముంబైని ఎప్పటికీ వీడనని, తాను భారతీయుడిగా గర్విస్తున్నానని సూర్య పేర్కొన్నాడు.

# 'బేబీ' జంట కొత్త మూవీ.. ఫస్ట్ సింగిల్ విన్నారా?







టాలీవుడ్ యంగ్ క్యాస్టింగ్ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఎపిక్- ఫస్ట్ సెమిస్టర్ నుంచి రిలీజ్ అయిన ఫస్ట్ సింగిల్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. సంచారమే అంటూ సాగుతున్న ఆ పాట మంచి రెస్పాన్స్ అందుకుంటా.. సూపర్ మెలోడీగా మెప్పిస్తోంది. సినిమా కథలోని మెయిన్ రోల్స్ ఎమోషనల్ జర్నీని సాంగ్ క్లియర్ గా చూపిస్తోంది.

ఆ పాటకు ప్రముఖ కవి, రైటర్ గోరటి వెంకన్న లిరిక్స్ అందించగా.. ప్యూర్ తెలుగు పదాలు, హృదయాన్ని తాకే భావాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇండియన్ కల్చర్, ఫారిన్ లైఫ్ స్టైల్ మధ్య ఉండే తేడాలను సింపుల్ గా వ్యక్తపరుస్తూ సంచారమే పాట సాగుతుంది. సినిమా స్టోరీకి అనుగుణంగా, యూత్ మనసుల్లోని ఫీలింగ్స్ వ్యక్తపరిచేలా సాంగ్ ను రూపొందించినట్లు చిత్రబృందం తెలిపింది.

సంచారమే పాటకు ప్రముఖ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ బాణీలు కట్టారు. ఆయన కంపోజిషన్ సాంగ్ కు మరింత అందాన్ని తీసుకొచ్చింది అంతేకాకుండా హేషమ్ అబ్దుల్ వహాబ్, గోరటి వెంకన్న కలిసి సాంగ్ ను ఆలపించడం విశేషం. వారి వాయిస్ పాటలోని భావాన్ని ప్రేక్షకుల హృదయాలకు **చేరవేస్తుందని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు.**

అదే సమయంలో సాంగ్ విజువల్స్ పరంగా కూడా ఆకట్టుకుంటోంది. ఫారిన్ బ్యాక్ డ్రాప్ తో షూట్ చేసిన ఆ సాంగ్ లో లండన్ లోని ఫేమస్ స్పాట్స్ చూపించారు మేకర్స్. అక్కడి నేచుర్ సీన్స్, సిటీ వాతావరణం మధ్య తెలుగు పాటను చిత్రీకరించిన విధానం ప్రేక్షకులను ఆకర్షిస్తోంది. ఓవరాల్ గా సాంగ్ మ్యూజిక్ లవర్స్ ను ఆకట్టుకుని.. అనేక మంది ఫేవరెట్ లిస్ట్ లోకి చేరిపోయిందని చెప్పాలి.ఇక సినిమాలో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మరోసారి కలిసి నటిస్తున్నారు. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన బేబీ సినిమా మంచి విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రంతో ప్రేక్షకుల మనసుల్లో నిలిచిన జంట మళ్లీ కలిసి నటించడంతో కొత్త సినిమాపై ఆసక్తి పెరిగింది. ఇప్పుడు సాంగ్ లో వీరి మధ్య కనిపించే ఎమోషనల్ మూమెంట్స్, కెమిస్ట్రీ, స్క్రీన్ ప్రెజెన్స్ ఆకట్టుకుంటున్నాయి.ఎపిక్- ఫస్ట్ సెమిస్టర్ మూవీతో ఆదిత్య హాసన్ డైరెక్టర్ గా పరిచయమవుతున్నారు. ఇప్పటికే ఆయన తీసిన 90స్ వెబ్ సిరీస్ ఓ రేంజ్ లో మెప్పించగా.. ఇప్పుడు సిల్వర్ స్క్రీన్ పై లక్ ను టెస్ట్ చేసుకోనున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగ వంశీ, సాయి సౌజన్య సినిమాను నిర్మిస్తున్నారు. సినిమాటోగ్రఫీ అజీమ్ మహమ్మద్ నిర్వహించగా, ఎడిటింగ్ బాధ్యతలు నవీన్ నూలి చేపట్టారు. మరి స్మూత్ లవ్ స్టోరీతో రూపొందుతున్న ఎపిక్- ఫస్ట్ సెమిస్టర్ ఎప్పుడు రిలీజ్ అవుతుందో, ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965